తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తిరుపతి
: fb.com/vaartha Digital
Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 201 పేజీలు: 10+4 వెల: 6.50

మొజాయిక్
గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

## జూడాలకు 5 శాతం స్టైపెండ్ పెంపు


జనవరి 1, 2026 నుంచి అమలు.. ఇకపై యేటా 3 శాతం పెంపు

సమ్మెను తాత్కాలికంగా విరమించి విధుల్లో చేరాలని ప్రభుత్వం విజ్ఞప్తి

2లో

# ఎపిపిఎస్‌సిని ప్రక్షాళన చేస్తాం

● అవకతవకలకు తావులేకుండా వ్యవస్థ ఏర్పాటు ● గ్రూప్-1 పరీక్షలో చరిత్రలో చూడని అక్రమాలు ● బరితెగించి గ్రూప్-1 నియామకాల్లో అవకతవకలు ● ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో మూల్యాంకనం ● ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి జవాబు పత్రాలేమిటి? ● నిబంధనలకు విరుద్ధంగా హాయ్‌లాండ్‌లో పేపర్లు ● సిఎం సీట్లో కూర్చుని నేరాలు చేసిన వ్యక్తి నేడు సమాధానం చెప్పేందుకు సభకు రాలేదు ● గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో సిఎం చంద్రబాబు



బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఎపిపిఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో ఊహకు కూడా అందని స్థాయిలో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. గత పాలకులు బరితెగించి అక్రమాలకు పాల్పడ్డారని, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించాల్సిన గ్రూప్-1 సర్వీసు అభ్యర్థుల నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని శాసనసభకు తెలియ చేశారు. 344 నిబంధన కింద శాసనసభలో చేపట్టిన ప్రత్యేకచర్చలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 315 ప్రకారం ఏర్పడిన ఎపిపిఎస్సీ రాష్ట్రానికి కీలకమైన అధికారులను ఎంపిక చేసే సంస్థ అని, దాని విశ్వసనీయతను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో సిఎం సీట్లో కూర్చుని నేరాలు చేసిన వ్యక్తి నేడు వాటిపై ప్రజలకు సమాధానం చెప్పేందుకు శాసనసభకు రాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్షేపించారు. ఎదురుదాడి చేసేందుకు 24 గంటలూ కుట్రలు చేయటం కాదని బాధ్యతాయుతంగా జవాబు చెప్పాలని సవాలు చేశారు.

**కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదు**

2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు 1.14 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని. ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధించుకునే ఈ పరీక్షల నిర్వహణలో నిబంధనలను పూర్తిగావిస్మరించారని సిఎం చంద్రబాబు తెలిపారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను సైతం అత్యంత భద్రత మధ్య పోలీసు ఎస్కార్టుతో తరలిస్తామని, అలాంటిది రాష్ట్రాన్ని పాలించే అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్షల జవాబు పత్రాల విషయంలో భద్రతను గాలికి వదిలేసి ఇష్టానుసారం వ్యవహరించారని మండిపడ్డారు. డిజిటల్ మూల్యాంకనాన్ని పక్కనపెట్టి మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కోర్టును >>2

## త్యాగం మీది.. అండ మాది

వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం

నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

## బిసి రిజర్వేషన్ల పెంపుతో మారనున్న రాజకీయ ముఖచిత్రం

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త సమీకరణాలు

### గ్రామం నుంచి జిల్లా వరకు బిసి నాయకత్వానికి ఊతం

**ఏలూరు, ఆగస్టు 19 పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రూరల్ ప్రాంతాల్లో 34 శాతం, అర్బన్ ప్రాంతాల్లో 33.1 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. ఇప్పటివరకు స్థానిక రాజకీయాల్లో ఉన్న ఆధిపత్య సమీకరణాలకు భిన్నంగా కొత్త బిసినాయకత్వం తెరపైకి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, పట్టణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ప్రభావం గణనీయంగా ఉండనుంది. రిజర్వేషన్ రోస్టర్ ఖరారైన తర్వాత ఏయే స్థానాలు బిసిలకు కేటాయించబడతాయనే అంశం స్పష్టత రానున్నప్పటికీ.. రాజకీయ పార్టీల్లో మాత్రం ఇప్పటి నుంచే స్థానిక నాయకత్వంపై కసరత్తు ప్రారంభమయ్యే అవకాశముంది.

**34 శాతం.. గ్రామీణ రాజకీయాల్లో కీలక మలుపు**

రూరల్ ప్రాంతాల్లో 34 శాతం బిసి రిజర్వేషన్ అమలైతే సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపిటిసి, జడ్పిటిసి వంటి స్థానాల్లో బిసిలకు మరింత ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంటుంది. దీంతో ఇప్పటివరకు రాజకీయంగా పెద్దగా అవకాశం లభించని అనేక మంది బిసి యువ నాయకులు స్థానిక సంస్థల ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించే అవకాశం ఉంది.

**సర్పంచ్ పదవులపై ప్రధాన పార్టీల దృష్టి:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ పదవులు గ్రామీణ రాజకీయాల్లో కీలకమైనవి. బిసి రిజర్వేషన్ పెరగడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఉన్న బిసి నాయకులను గుర్తించి ముందుకు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. >>2

# డేటా సెంటర్లపై అపోహాలు వద్దు

### 6.5 గిగావాట్ల డాటా సెంటర్ల లక్ష్యం పూర్తి

పారిశ్రామిక కేటాయింపుల నుంచే డేటా సెంటర్లకు నీరు

విశాఖకు ఐటీ సంస్థలు క్యూ, అనుబంధ సంస్థలు రాక

అసెంబ్లీలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన మంత్రి లోకేష్



బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 6.5 గిగావాట్లకు మించకుండా లక్ష్యాన్ని పూర్తి చేశామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో డేటా సెంటర్లపై వస్తున్న అపోహాలపై నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ "కొంతమంది కావాలని డేటా సెంటర్లపై అపోహాలు సృష్టిస్తున్నారు. గూగుల్ అనే సంస్థ విశాఖ వస్తున్నామని ప్రకటించాకే ఐటి సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయి. మనమంతా వాడే స్మార్ట్ ఫోన్ అందులో వినియోగించే ఎఐ డేటా సెంటర్లతో ముడిపడి ఉంది. 1995లో చంద్రబాబు ఐటి నేర్చుకోవాలని పిలుపు నిచ్చారు. ఆ ప్రక్రియలో పనిచేసే ఎంప్లాయ్ చనిపోయారు. అప్పుడున్న ప్రతిపక్షం వాళ్లు కంప్యూటర్ రేడియేషన్ వల్ల ఆ ఎంప్లాయ్ చనిపోయారని ఆరోపణలు చేశారు. అప్పుడు వెనక్కి తగ్గి ఉంటే, హైదరాబాద్ ఈరోజు ప్రస్తుత స్థాయికి వచ్చేది కాదు. డేటా సెంటర్లపై వస్తున్న అపోహాలు కూడా అలాంటివ్వే అని స్పష్టం చేశారు.

"డేటా సెంటర్లకు సంబంధించి మాధవి మూడు సమస్యలు చెప్పారు. మొదటిది నీటి భద్రత, గోదావరి నుంచి ఐదేళ్ల సరాసరి తీసుకుంటే సాధారణంగా ప్రతిఏటా 3వేల టిఎంసిల నీరు బంగాళాఖాతంలో వృధాగా పోతోంది. మనం ఆ నీటిలో కొంత భాగాన్ని పోలవరంలోకి మళ్లించి గ్రావిటీ ద్వారా విశాఖకు తీసుకువస్తున్నాం. >>2

## స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్

3లో





## జూడాల కళ్లకు గంతలు.. కూరగాయల అమ్మకంతో నిరసన..

**గుంటూరు మెడికల్, ఆగస్టు 19 ప్రభాత వార్త:** పీజీ వైద్యుల సమయిత వేతనభత్యం పెంపుతో పాటు తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె పదో రోజుకు చేరుకుంది. మూడో దశలో భాగంగా మూడో రోజు కూడా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల్లో జూనియర్ వైద్యులు ఆందోళనలు కొనసాగాయి. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన కొనసాగించారు. స్వచ్ఛంద రిలే దీక్షలో భాగంగా 15 మంది పీజీ వైద్యులు ఉదయం 9 గంటల నుంచిరాత్రి 9 గంటల వరకు దీక్షలో పాల్గొన్నారు.

**కళ్లకు గంతలు కట్టుకుని నిరసన**

నేటి ఆందోళనలో భాగంగా జూనియర్ వైద్యులు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలపై ప్రభుత్వ దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. వైద్యుల న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

**కూరగాయలు విక్రయిస్తూ వినూత్న నిరసన**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం నేపథ్యంలో పీజీ వైద్యులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రజలకు తెలియజేసేలా కూరగాయలు విక్రయిస్తూ నిరసన చేపట్టారు. వేతనభత్యం ప్రస్తుత జీవన వ్యయానికి అనుగుణంగా లేకపోవడంతో ఎదురవుతున్న ఆర్థిక భారాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.

**ముఖ చిత్రాలపై నిరసన సందేశాలు**

మధ్యాహ్నం ముఖచిత్రాలపై నిరసన సందేశాలను చిత్రీకరించే కార్యక్రమం నిర్వహించారు. తమ డిమాండ్లను సృజనాత్మకంగా ప్రజలకు తెలియ జేస్తూ జూనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

**అత్యవసర సేవలకు దూరంగా.. రోగుల రాక తగ్గుదల**

సమ్మె మూడో దశలో భాగంగా జూనియర్ వైద్యులు అత్యవసర వైద్య సేవల నుంచి కూడా వైదొలగడంతో ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల రాక తగ్గినట్లు జూడా ప్రతినిధులు తెలిపారు. పలువురు రోగులు ప్రత్యామ్నాయ వైద్య సదుపాయాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వ వైద్య సేవలపై ఆధారపడే పేద, మధ్యతరగతి వర్గాలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని తెలిపారు.

**ఆందోళన మధ్య.. రక్తదానానికి సిద్ధం**

సమ్మె కొనసాగుతున్నప్పటికీ సమాజం పట్ల తమ బాధ్యతను చాటేందుకు జూనియర్ వైద్యులు రేపు రక్తదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. వైద్యుల పోరాటం కొనసాగుతూనే ప్రజాసేవకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని వారు తెలిపారు.

**చర్చలకు సిద్ధం**

తమ సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వం చర్చలకు ముందుకు వస్తే జూనియర్ వైద్యులు సిద్ధంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం తెలిపింది. సామరస్యపూర్వక చర్చలద్వారా సమస్యకు త్వరితగతినపరిష్కారం లభించాలని ఆకాంక్షించింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరిస్తే ఎటువంటి అంతరాయంలేకుండా రోగులకు వైద్యసేవలు అందించేందుకు

# జూడాలకు 5 శాతం స్టైపెండ్ పెంపు

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 19, ప్రభాత వార్త:** జూనియర్ వైద్యుల స్టైపెండ్ పెంపు డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న స్టైపెండ్‌పై 5 శాతం పెంపునకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పెంపును 2026 జనవరి 1 నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. అనంతరం ప్రతి యేడాది ఇంటర్న్‌లకు 3 శాతం, పిజి, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులకు 3 శాతం చొప్పున స్టైపెండ్ పెంచనున్నట్లు వెల్లడించింది.ప్రస్తుతం ఇంటర్న్‌లకు నెలకు రూ.25,906 స్టైపెండ్ అందుతోంది. తమ స్టైపెండ్‌ను 15 శాతం పెంచాలని జూనియర్ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం 5 శాతం పెంపునకు నిర్ణయం తీసుకుంది. జూడాల డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించిందని, అయితే 15 శాతం పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని వివరించింది.

**యేటా రూ.586 కోట్ల వ్యయం**

జూనియర్ వైద్యుల స్టైపెండ్ల కోసం ప్రభుత్వం ఇప్పటికే ఏటా రూ.586.08 కోట్లను ఖర్చు చేస్తోందని తెలిపింది. 15 శాతం స్టైపెండ్ పెంపు అమలు చేస్తే ప్రభుత్వంపై యేటా మరో రూ.87.91 కోట్ల అదనపు భారం పడుతుందని పేర్కొంది. జూడాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జూలై 17 నుంచి వరుసగా చర్చలు జరిపిందని తెలిపింది. ఆగస్టు 15నకూడా జూడా ప్రతినిధులతో చర్చలు నిర్వహించినట్లు పేర్కొంది. 15 శాతం పెంపు డిమాండ్‌పై జూడాలు మరోసారి పునరాలోచించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

**వెంటనే విధుల్లో చేరాలి**

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్య సేవలు యథావిధిగా కొనసాగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా జూనియర్ వైద్యులు వెంటనే విధుల్లో చేరాలని కోరింది.

# ఎపిపిఎస్‌సిని ప్రక్షాళన చేస్తాం

>> తప్పు దోవ పట్టించేలా అఫిడవిట్లు దాఖలు చేశారని చంద్రబాబు అన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత సరిదిద్దుకోవాల్సింది పోయి హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం కోసం రూ.1.19 కోట్ల విలువైన పనులకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఒకవైపు కోర్టు ఆదేశాలు ఉండగానే ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టారని తెలిపారు. హైకోర్టు ఈ వ్యవహారంపై విచారణ జరిపి విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు**

గ్రూప్-1 వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలకు అభ్యర్థులు రాసిన పరీక్షా పత్రాలను అర్హత లేని ప్రైవేటు వ్యక్తులతో దిద్దించారని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు, గృహిణులు, నిరుద్యోగులు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, హెచ్‌ఓడిలు వంటి నిపుణులు చేయాల్సిన మూల్యాంకనాన్ని టీచర్లు, లెక్చరర్లు, ఇతర అనర్హులతో చేయించడం తీవ్ర ఉల్లంఘన అని అన్నారు. మొత్తం 158 మంది ప్యానల్‌ను ఎంపిక చేసి అందులో 72 మందికి మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని, వారిలో 25 మంది అనధికారికంగా నియమించిన వారేనని చంద్రబాబు తెలిపారు. మరో 66 మంది ఎవాల్యుయేటర్లు అనధికారికంగా పరీక్ష పత్రాలు దిద్దారని ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తుల ల్యాప్‌టాప్‌లకు పరీక్షా మూల్యాంకన వివరాలను పంపించారని, పిడిఎఫ్ జవాబు పత్రాలను ప్రైవేటు ఈ మెయిళ్లు, గూగుల్ డ్రైవ్, వాట్సప్ ద్వారా పంపించారని చెప్పారు. ఎపిపిఎస్సీ స్ట్రాంగ్ రూమ్ నుంచి జవాబు పత్రాలను అనధికారికంగా తరలించి 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో ఉంచారని సిఎం తెలిపారు. మొదట హైదరాబాద్‌లో, ఆ తర్వాత హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం నిర్వహించారని చెప్పారు. హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం జరగలేదని హైకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిన సమయంలోనే లాజిస్టిక్స్ కోసం రూ.1.14 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు.

**డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు**

కొత్త చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశాలు ఇచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్‌లు ముద్రించినట్లు చెప్పారు. జవాబు పత్రాల్లో వేర్వేరు రాతలు, మార్పులు, చేర్పులు, ఓవర్‌రైటింగ్‌లు గుర్తించారని తెలిపారు. 734 ఓఎంఆర్ స్లిప్‌లలో 718 స్లిప్‌లలో మార్పులు జరిగినట్లు వెల్లడించారు. 21 స్లిప్‌లపై ఎలాంటి సంతకాలు లేకపోవడం అక్రమాల తీవ్రతకు నిదర్శనమన్నారు. గ్రూప్-1 పరీక్ష రాసిన ఒక అభ్యర్థినే అదే పరీక్షకు ఎవాల్యుయేషన్ ఎగ్జామినర్‌గా నియమించడం మరింత దారుణమని సిఎం అన్నారు. ఎగ్జామినర్ల జాబితాలను వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో పెట్టారని తెలిపారు. మూల్యాంకనం జరిగే హాల్లో 17 రోజుల పాటు సిసి కెమెరాలు లేకపోవడం, మొబైల్ ఫోన్లను అనుమతించడం వంటి దారుణాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. ఎపిపిఎస్సీ నిబంధనల ప్రకారం వైటనర్ వినియోగించకూడదని స్పష్టం చేస్తుండగా, ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్‌లలో వైటనర్ వినియోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నివేదికలు వెల్లడించాయని చంద్రబాబు తెలిపారు.


**వ్యవస్థలు యువత భవిష్యత్తు కోసమే**

2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని చాలా సార్లు చెప్పానని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. ప్రజా వేదిక నుంచి రాష్ట్ర బ్రాండ్ వరకు దెబ్బతీశారని, ప్రభుత్వంలోని వివిధ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం పోయేలా గత పాలకులు వ్యవహరించారని విమర్శించారు. వ్యక్తుల కోసం వ్యవస్థ కాదు.. యువత భవిష్యత్తు కోసమే వ్యవస్థ. తప్పు చేస్తే కఠినంగా శిక్ష పడుతున్న భయం ఉండాలని అన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందని చంద్రబాబు అన్నారు. తప్పు చేసి పారిపోవడం కాదని, ఎందుకు జరిగిందో చెప్పాల్సిన బాధ్యత సంబంధిత వ్యక్తులపై ఉందన్నారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అక్రమాలను పూర్తిగా విశ్లేషించి తదుపరి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఎపిపిఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని పారదర్శకమైన మూల్యాంకన విధానం, బలమైన భద్రతా ప్రమాణాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు తీసుకుని సంస్కరణలు చేపడతామని వెల్లడించారు. ఇలాంటి అక్రమాలు మళ్లీ జరగకుండా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. తప్పు చేసిన వ్యక్తులు ఎప్పటికైనా దొరికిపోతారు అనడానికి ఎపిపిఎస్సీ గ్రూప్-1 పరీక్షలే ఉదాహరణ అని సిఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంత దారుణమైన కుంభకోణం జరిగితే రాష్ట్ర భవిష్యత్తు ఏమిటో ప్రజలు ఆలోచించాలని ముఖ్యమంత్రి అన్నారు.

# శేషాచలంలోకి పెద్దపులి

## వెంకటగిరి రేంజ్‌లో జాడ గుర్తించిన అటవీశాఖ

**తిరుపతి,ఆగస్టు19 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవులు ఎర్రచందనం వృక్షసంపదకు నిలయం. ఇక్కడ స్మగ్లర్లను కట్టడిచేయడానికి ఇప్పటికే చిరుతలు, ఏనుగులు సంచారం ఉన్నా తాజాగా పెద్దపులి జాడలను శేషాచలం అడవిలో అటవీశాఖ అధికారులు కనుగొన్నారు. నల్లమల అటవీప్రాంతం నుండి ఇటువైపు సంచారం ఉన్నట్లు గుర్తించారు. తిరుపతి జిల్లాలోని శేషాచల అటవీ ప్రాంతంలో తొలిసారిగా ట్రాప్ కెమెరాలకు పెద్దపులి సంచారం చిక్కింది. పులి శేషాచలం అడవుల్లోకి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. వెంకటగిరి రేంజ్ వేములూరు బీట్ పరిధిలో పెద్దపులి కదలికలు నమోదయ్యాయి.శేషాచలం అడవుల్లో పెద్దపులి సంచారంతో కలకలం మొదలైంది. తిరుపతి అడవుల్లో పెద్దపులి సంచరించడం చరిత్రలో ఇదే మొదటిసారిగా చెబుతున్నారు. కెమెరాకు చిక్కడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానికులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో ఘాట్ రోడ్లు అటవీ మార్గాల్లో వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పెద్దపులి ఇప్పుడు తిరుపతి-తిరుమల అటవీప్రాంతంవైపు వస్తే పరిస్థితి ఏంటనే ఆందోళన మొదలైంది.



బుధవారం వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు నష్టపరిహారం చెక్కు అందిస్తున్న సిఎం చంద్రబాబు

# త్యాగం మీది.. అండ మాది

## వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం

### నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన సిఎం చంద్రబాబు

### ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం, బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

**రూ.518 కోట్ల మేర పరిహారం అందజేత:**

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకుగానూ ఓటిఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటిఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్లైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

# మారనున్న రాజకీయ ముఖచిత్రం

>> దీంతో గ్రామస్థాయిలో ఇప్పటికే ఉన్న రాజకీయ సమీకరణాలు మారడమే కాకుండా కొన్ని గ్రామాల్లో కొత్త నాయకత్వం పుట్టుకొచ్చే అవకాశం ఉంది.

**ఎంపిటిసి, జడ్‌పిటిసిల్లోనూ ప్రభావం**

బిసి రిజర్వేషన్ ప్రభావం కేవలం గ్రామపంచాయతీలకే పరిమితం కాకుండా మండల, జిల్లా స్థాయి స్థానిక సంస్థలపైనా పడనుంది. ఎంపిటిసి, జడ్‌పిటిసి స్థానాల రిజర్వేషన్‌లో మార్పులతో మండల రాజకీయాల్లో బిసి నాయకుల ప్రాధాన్యం పెరగవచ్చు. ఇప్పటివరకు గ్రామ రాజకీయాలకే పరిమితమైన పలువురు నాయకులు మండల, జిల్లా స్థాయికి ఎదిగే అవకాశం కూడా ఉంటుంది.

**పట్టణాల్లో 33.1శాతం.. కొత్త రాజకీయ సమీకరణాలకు అవకాశం**

అర్బన్ ప్రాంతాల్లో 33.1 శాతం రిజర్వేషన్ అమలు అయితే మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థల్లోనూ బిసిల ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం తదితర పట్టణాల్లో వార్డు రిజర్వేషన్లు తుది రూపం దాల్చిన తర్వాత ఆయా ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయన్నది ఆసక్తికరంగా మారనుంది.

**బిసి మహిళలకు మరిన్ని అవకాశాలు**

బిసి రిజర్వేషన్లకు మహిళా రిజర్వేషన్లు కూడా వర్తించే సందర్భంలో బిసి మహిళలకు స్థానిక రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కొత్త మహిళా నాయకత్వం కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే స్థానిక సంస్థల్లో మహిళా ప్రాతినిధ్యం పెరుగుతున్న నేపథ్యంలో బిసి మహిళలకు రిజర్వేషన్ మరింత రాజకీయ అవకాశాలను కల్పించనుంది.

**పార్టీల్లో టికెట్ల కేటాయింపుపై ప్రభావం:**

రిజర్వేషన్ల పెంపు ప్రభావం కేవలం ఎన్నికల ఫలితాలపైనే కాకుండా రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎంపికపైనా పడనుంది. ఏ గ్రామపంచాయతీ ఏ వర్గానికి రిజర్వ్ అవుతుంది? ఏ ఎంపిటిసి స్థానం బిసికి దక్కుతుంది? ఏ జడ్‌పిటిసి స్థానంలో బిసి అభ్యర్థిని నిలబెట్టాలి? అనే అంశాలపై రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో స్థానికంగా బలమైన బిసి నాయకులకు రాజకీయ పార్టీల్లో డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. గతంలో బిసిలకు 34 శాతం ఉన్న రిజర్వేషన్లు 24శాతానికి తగ్గడంతో స్థానిక సంస్థల్లో బిసి ప్రాతినిధ్యం తగ్గిందని బిసి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం తిరిగి 34శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించడం బిసి వర్గాల్లో రాజకీయంగా ప్రాధాన్యమైన అంశంగా మారింది. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనమాల శ్రీనివాస్ కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ.. స్థానిక సంస్థల్లో బిసిలకు ఎ,బి,సి,డి వర్గీకరణతో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

**కొత్త నాయకత్వానికి పునాది?**

స్థానిక సంస్థలు రాజకీయ నాయకత్వానికి తొలి మెట్టు. సర్పంచ్‌గా ప్రారంభమైన అనేక మంది నాయకులు తరువాత ఎంపిపి, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపి స్థాయికి ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బిసి రిజర్వేషన్ల పెంపు ఉమ్మడి పశ్చిమగోదావరిలో కొత్త తరం బిసి రాజకీయ నాయకత్వానికి పునాది వేస్తుందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే అసలు రాజకీయ చిత్రం తుది రిజర్వేషన్ రోస్టర్ విడుదలైన తర్వాతే స్పష్టమవుతుంది. ఏ గ్రామం, ఏ మండలం, ఏ వార్డు ఏ వర్గానికి కేటాయించబడుతుందన్నదే వచ్చే స్థానిక ఎన్నికల అసలు రాజకీయ సమీకరణాలను నిర్ణయించనుంది.

# డేటా సెంటర్లపై అపోహాలు వద్దు

>> ప్రస్తుత సాంకేతికత ప్రకారం 6.5 గిగావాట్ల డేటా సెంటర్లు విశాఖలో ఇన్‌స్టాల్ అయితే 3 టిఎంసిల నీరు అవసరమవుతుంది. పోలో ఆల్టో ఇంటెల్ ఏర్పాటుచేసిన డేటా సెంటర్‌ను స్వయంగా చూశాను. అక్కడ వాటర్ కూల్ టెక్నాలజీ లేదు, అంతా ఎయిర్ కూల్ టెక్నాలజీ వాడుతున్నారు. ఇంకా కొత్త టెక్నాలజీలు వస్తున్నాయి. నీటి వినియోగం మరింత తగ్గించుకుంటూ వస్తున్నారు. ఎనర్జీ అవసరాలు కూడా తగ్గించే టెక్నాలజీ రాబోతోంది. పోలవరం నుంచి వస్తున్న నీరు ప్రత్యేకంగా విశాఖపట్నం నగర ప్రజల తాగు, సాగు, పరిశ్రమల అవసరాలకు కేటాయింపులు జరిగాయి. పరిశ్రమలకు కేటాయించిన నీటి వాటా నుంచే డేటా సెంటర్లకు అవసరమైన నీరందిస్తాం. రాబోయే 18నెలల్లో పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా విశాఖ ప్రజలకు తాగునీరు అందిస్తాం. డేటా సెంటర్లకు డెడికేటెడ్ పైప్ లైన్ ద్వారా నీరు అందిస్తాం తప్ప సిటీ ఇన్ ఫ్రా నుంచి మళ్లించేది లేద్ను మంత్రి లోకేశ్ వివరించారు.

**థర్మల్ ప్లాంటులపై మాట్లాడరెందుకు?**

"గిగావాట్ థర్మల్ పవర్ ప్రాజెక్టు డేటా సెంటర్ ఉపయోగించే నీటి కంటే పదిరెట్లు ఎక్కువగా వినియోగిస్తుంది. విశాఖలో ఇప్పుడు డేటా సెంటర్లపై ధర్నా చేస్తున్న వారు ఏనాడు థర్మల్ ప్లాంట్ గురించి మాట్లాడలేదు. ఎనర్జీ కావాలి, డేటా సెంటర్ వద్దనడం ఎలా సబబు? ఈరోజు ఉన్న పరిస్థితుల్లో ఎఐ అనివార్యం. అది మన జీవితం భాగమైంది. గూగుల్ పెద్దఎత్తున పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావడం వల్లే మిగిలిన గ్లోబల్ సంస్థలు విశాఖలో తమ డేటా సెంటర్లకు భూములు కేటాయించాలని అడుగుతున్నాయి. డేటా సెంటర్లు కనీసం 70శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలని స్పష్టంగా చెప్పాం. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌నే వాడాలని వారికి చెప్పాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా మంత్రి గొట్టిపాటి నాయకత్వంలో డిస్ట్రిబ్యూషన్ లైసెన్సు కూడా ఇచ్చాం. విద్యుత్ ఛార్జీల విషయంలో ఎలాంటి పెంపుదల ఉండదు. విద్యుత్ ఛార్జీలు ఎట్టి పరిస్థితుల్లో పెంచేది లేదని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నారు. పెంచకపోగా ఈ యేడాది 13పైసలు విద్యుత్ చార్జీలు తగ్గించిన ఘనత ఎన్‌డిఏ ప్రభుత్వానిది. ప్రత్యేకించి ఒక సంస్థ 100 ఎంఎల్‌డి డిశాలినేషన్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తోంది. దానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉంద్ను అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**ఎకో సిస్టమ్ వస్తుంది.. ఉద్యోగాలు తెస్తుంది:**

"డేటా సెంటర్ల వల్ల ఉద్యోగాలు వస్తాయా అనే చర్చ జరుగుతోంది. డేటా సెంటర్ చుట్టూ ఎకో సిస్టమ్ చాలా ముఖ్యం. ఎఐ డేటా సెంటర్స్ వస్తున్నాయి. అడ్వాన్స్‌డ్స్ చిప్స్ రావాలి. ఆ చిప్స్‌ను ఈరోజు గూగుల్ తీసుకువస్తుంది. దానివల్ల ఎఐకి సంబంధించిన కటింగ్ ఎడ్జ్, ఇతర కంపెనీలు విశాఖపట్నాన్ని కేంద్రంగా చేసుకుంటాయి. భారీ ఎత్తున వస్తున్న డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌కు ఎయిర్ కూలింగ్ సిస్టమ్ అవసరం. ప్రతి ఐదేళ్లకు దానిని అప్ గ్రేడ్ చేయాల్సి ఉంటుంది. దానివల్ల ఈరోజు కెరీర్, ఎల్జీ ఎపిలో పెట్టుబడులు పెడుతున్నాయి. మరో కంపెనీ కూడా ఈరోజు ఎపికి వస్తోంది. రైజింగ్ రాయలసీమలో మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేస్తున్నందున అక్కడ కేవలం కూలింగ్ ఎకోసిస్టమ్ వల్ల 20వేలమందికి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించబోతున్నాం.

**రాష్ట్రవ్యాప్తంగా అనుబంధ సంస్థలు వస్తున్నాయి..**

పవర్ జనరేషన్, ట్రాన్స్ మిషన్ లైన్లు... 6.5 గిగావాట్ల డేటా సెంటర్లకు సరిపడా వరల్డ్ క్లాస్ డేటా సెంటర్లు తీసుకురావాల్సిన బాధ్యత మనపై ఉంది. అందులో భాగంగా మరికొన్ని కంపెనీలు విశాఖలో భూములు అడుగుతున్నారు. వరల్డ్ క్లాస్ ట్రాన్స్ ఫార్మర్ల తయారీ, డెలివరీ కోసం ఇన్ ఫ్రా కావాలని కోరుతున్నారు. అది కూడా విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేస్తాం. పవర్ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు కూడా ఈరోజు రాయలసీమకు వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయి. అక్కడ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్ ఉన్నందునే అక్కడే పవర్ ఎలక్ట్రానిక్స్ వస్తున్నాయి. అందువల్ల పవర్ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాం. ఫైబర్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలను కూడా ఎపికి తీసుకువస్తున్నాం. విశాఖలో మూడు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటుచేసి గ్లోబల్ ల్యాండింగ్‌తో అనుసంధానిస్తున్నాం. దీనివల్ల ఐటి, జిసిసి, ఐటి అనుబంధ పరిశ్రమలు వస్తాయి. డేటా సెంటర్ల వల్ల లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్ సపోర్టింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ విశాఖ కేంద్రంగా తయారవుతోంది. గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఒక లాజిస్టిక్స్ సంస్థ వెయ్యికోట్ల పెట్టుబడి పెట్టబోతోంది. సర్వర్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్స్ స్టోర్ చేయడానికి విశాఖ కేంద్రంగా మరో ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తాం. దీనివల్ల వేర్ హౌసింగ్, కమర్షియల్, రెసిడెన్షియల్, ట్రాన్స్ పోర్టేషన్, హాస్పిటాలిటీ, రిటైల్, మెయింటెనెన్స్, సర్వీసెస్ లో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయ్ను అని మంత్రి లోకేశ్ వివరించారు.

**విశాఖపట్నం..ఇక ఎఐ పట్నం:**

"అశ్వినీ వైష్ణవ్ గూగుల్ శంకుస్థాపనకు వచ్చినపుడు ఇక విశాఖపట్నం కాదు... ఎఐ పట్నంగా మారబోతోంది అని చెప్పారు. విశాఖ గేట్ వే ఆఫ్ ఇండియా ఎఐ ఎకో సిస్టమ్ మార్చడం మా కమిట్మెంట్. దీంతోపాటు రియల్ ఎస్టేట్ వారు జిసిసిలు, ఐటి సెజ్‌లు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఒక అమెరికన్ యూనివర్సిటీ ఎఐ రిలేటెడ్ సబ్జెక్ట్‌తో విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయబోతున్నారు. ఆ పేరు ఇప్పుడు చెప్పడం ఒప్పందం ప్రకారం కుదరదు కనుక చెప్పడంలేద్ను అని లోకేష్ పేర్కొన్నారు.

**కావాలనే అపోహాలు సృష్టిస్తున్నారు:**

"కావాలని కొందరు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. ఎక్కడా పర్యావరణ ఉల్లంఘనలు చేయడం లేదు. కొంతమంది కావాలని దొంగ వీడియోలు తీసుకొచ్చి ఏదో అయిపోతుందని చెప్పే మాటలను పట్టించుకోవద్దు. స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ సమీపంలో పోలో వోల్టో డేటా సెంటర్ స్వయంగా చూశాను. కనీసం అక్కడ ఉన్నట్లు కూడా మాకు తెలియలేదు. దయచేసి విశాఖ ప్రజలు దుష్ప్రచారం నమ్మవద్దు, మేం పట్టుదల, కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్నాం. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో డేటా సెంటర్ మన గడ్డపై ఉండాల్సిన అవసరం చాలా ఉంది. కొత్తగా ఎఐ స్మార్ట్ ఫోన్లు, డివైజ్‌లు వస్తున్నాయి. ఆ డేటా అంతా ఎఐ డేటా సెంటర్‌లో స్టోర్ అవుతుంది. ఐదేళ్లలో ఆపరేటింగ్ సిస్టమ్స్ కూడా మారబోతున్నాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కష్టపడి పెట్టుబడులు తీసుకువస్తున్నాం. అపోహాలు అస్సలు నమ్మొద్దు. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌లో రెన్యువబుల్ ఎనర్జీ వాడి గ్రీన్ స్టీల్ తయారు చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేసేపుడు భూమిని చదును చేయాలి. దానిని ప్రకృతి విధ్వంసం అనడం ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచించాలి. అభివృద్ధి జరిగే సమయంలో ప్రకృతిపై కొంత భారం ఉంటుంది. దానిని కనీస స్థాయిలో తగ్గించేందుకు ఒక కార్యాచరణ పెట్టుకొని మేం పనిచేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నూరుశాతం సస్టయినబుల్ మెకానిజంతో డేటా సెంటర్స్, ఐటి ఎకో సిస్టమ్, అనకాపల్లిలో ఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్, స్టీల్ ఎకో సిస్టమ్ వస్తున్నాయి. వీటిని ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంద్ను అని మంత్రి లోకేష్ చెప్పారు.

## వారం - వర్జ్యం

20-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.అష్టమి రా.9.20
న.విశాఖ ఉ.9.09
వ.మ.1.36-మ.3.23
దు1. ఉ.10.04-ఉ.10.54
దు2. మ.3.07-మ.3.57
రాహు మ.1.30-మ.3.00 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు. మీలో దాగివున్న నైపుణ్యం వెలుగులోకి వస్తుంది.

**వృషభం :** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. మీకు అనుకూలాంశాలు ఎక్కువగా ఉంటాయి.

**మిథునం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వివాహ యత్నాలు లభిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** నూతన కాంట్రాక్ట్‌లకు సంబంధించి ఒప్పందాలు చేసుకుంటారు. విహార యాత్రలు చేస్తారు.

**సింహం :** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు. ప్రయాణాలు జాగ్రత్త.

**కన్య :** విద్యావకాశాలు పొందుతారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వస్త్ర లాభం.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. పదవులలో, హోదాలు లభించటానికి సమయం పడుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం :** పాత బాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాహ యత్నాలు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు :** పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించటానికి కాలంకలసి రాదు. క్రయ విక్రయాలకు దూరంగా ఉండండి.

**మకరం :** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. ధన లాభం. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.


**కుంభం :** సంక్షేమ సంఘాల వలన లాభ పడతారు. మీ మేధస్సుతో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం :** చాలాకాలంగా పరిష్కారం కాని కుటుంబ సమస్యలు ఈ రోజు పరిష్కారమవుతాయి. వాహన సౌఖ్యం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చరిత్రను సజీవంగా భవిష్యత్తు తరాలకు అందించే నేర్పరులు ఛాయా చిత్రకారులు

## -సిఎం చంద్రబాబు



**విజయవాడ.ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** చరిత్రను సజీవంగా భవిష్యత్తు తరాలు అందించే నేర్పరులు ఛాయా చిత్రకారులని సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.ఓ ఫోటో చూడగానే ఇది మన గతమనే ఆలోచన వస్తుందన్నారు. ఫోటోల్లో బంధించిన అనేక ఘట్టాలు చిర స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో ఫోటోగ్రాఫర్లతో కలిసి సందడి చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు బుధవారం కొద్దిసేపు ఫోటోగ్రాఫర్‌గా మారిపోయారు.

ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ల కెమెరాను చేతిలోకి తీసుకుని, వారినే క్లిక్ అనిపించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన మీడియా ఫోటోగ్రాఫర్లకు చంద్రబాబు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిలో ఒకరి కెమెరాను తీసుకుని వారికి ఫోటోలు తీశారు. తాను తీసిన ఫోటోలను తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు ఓ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. "చరిత్రను నమోదు చేసే, జ్ఞాపకాలను భద్రపరిచే ఫోటోగ్రాఫర్లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మన మీడియా, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్లను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. వారి అంకితభావం, కళానైపుణ్యం, అవిశ్రాంత కృషి మనందరికీ కొత్త దృక్కోణాలను అందిస్తాయి.

ప్రతి చిత్రం రాబోయే తరాల కోసం కాలంలోని ఒక భాగాన్ని భద్రపరుస్తుంది. స్ఫూర్తినిచ్చే క్షణాలను బంధిస్తూ ఫోటోగ్రఫీ కమ్యూనిటీ ముందుకు సాగాలి అంటూ చంద్రబాబు తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# రిజర్వేషన్లతో బిసిలకు అందలం



**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత నేతృత్వంలో బిసి నాయకుల సంబరాలు జరుపుకున్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి బిసి నేతలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బిసిల అభ్యున్నతే లక్ష్యంగా టిడిపి ఆవిర్భవించిందన్నారు. బిసిలకు వెన్నుదన్నుగా అన్న ఎన్టీఆర్, సిఎం చంద్రబాబు నిలిచారన్నారు. బిసిలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు టిడిపి ప్రభుత్వ హయాంలోనే లభించాయన్నారు. తొలుత ఎన్టీఆర్ బిసిలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజ్యాధికారంలో భాగస్వామ్యులు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సిఎం చంద్రబాబు బిసిలను అన్నిరంగాల్లో ముందంజలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. 1995లో సిఎం చంద్రబాబు ఆ సంఖ్యను 34శాతానికి పెంచారన్నారు. 2021 వరకూ ఆ రిజర్వేషన్లను కొనసాగుతూ వచ్చాయన్నారు. జగన్ వచ్చిన తరవాత స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లకు కోత విధించి, 24శాతం అమలు చేశారన్నారు. దీనివల్ల బిసిలు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బిసిలకు పదవులే కాకుండా ఆర్థికంగా లబ్ధి కలిగించే పథకాలను సైతం జగన్ రద్దు చేశారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన బిసిలను ఆ సామాజిక వర్గ నేతలను తప్పుడు కేసులతో వేధించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా బిసి రిజర్వేషన్లను 34శాతానికి పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయమన్నారు. నిర్ణయాధికారంలోనే బిసిలకు అందలం దక్కుతుందని మంత్రి సవిత తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి గురుమూర్తి, పేరేప ఈశ్వర్, మల్లెల ఈశ్వర్, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం చేసేది సంస్కృతమే

- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్
- ఉత్కర్ష మహోత్సవం-2026 ఘనంగా ప్రారంభం



**తిరుపతి(విద్య), ఆగస్టు 19 ప్రభాతవార్త:** వికసిత్ భారత్‌కు దిశ, దశ చూపించగల శక్తి సంస్కృత భాషకు ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ అన్నారు. సంస్కృతంలో నిక్షిప్తమైన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేసి, సమాజానికి ఉపయోగపడే విధంగా అన్వయించుకోవాలని సూచించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతిలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఉత్కర్ష మహోత్సవం-2026ను బుధవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఘనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, లాల్ బహదూర్ ఆచార్య జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. మురళీ మనోహర్ పాఠక్, రిజిస్ట్రార్ కె. వెంకటనారాయణ రావు తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మహోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా అర్జున్‌రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ 2020లో కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయాల చట్టం ద్వారా దేశంలోని మూడు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాలకు కేంద్ర విశ్వవిద్యాలయ హోదా లభించిందన్నారు. భారతీయ సంస్కృతికి మూలాధారమైన సంస్కృత భాష అధ్యయనం, బోధన, పరిశోధనలకు ఈ విశ్వవిద్యాలయాలు దిక్సూచిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సంస్కృతంలో ఉన్న విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞాన విషయాలను ఆధునిక అంశాలతో అనుసంధానం చేస్తూ పరిశోధనలు చేపడితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు. సంస్కృత భాష అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల ద్వారా సహకరిస్తోందని తెలిపారు. ఉత్కర్ష మహోత్సవంలో పాల్గొంటున్న పండితులు విస్తృతంగా మేధోమథన సదస్సులు నిర్వహించి, సమాజానికి ఉపయోగపడే అంశాలను వెలికితీయాలని సూచించారు. మహోత్సవంలో భాగంగా మహాపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అద్వైత వేదాంత విద్యార్థి వరద రాజన్‌కు వేదాంత విద్వన్మణి సత్కారంతో పాటు నగదు పురస్కారాన్ని మంత్రి అందజేశారు. ఆయనకు విద్యాబోధన చేసిన అద్వైత వేదాంత విభాగ ఆచార్యులు డా. శ్రీహరి శివరామ్ దాయగుడేను శాస్త్ర విద్వన్మణి బిరుదుతో సత్కరించారు. అలాగే కె.వి.ఎస్.ఎస్. అవధాని, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఆచార్యులు ప్రొ. ప్రఫుల్లకు విశ్వవిద్యాలయం తరఫున ప్రాచ్య విద్యాభూషణ అవార్డులు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయం ప్రచురించిన 25కు పైగా పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ అర్జున్‌రామ్ మేఘ్వాల్ గతంలోనూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఉత్కర్ష మహోత్సవంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. మరోసారి ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమానికి హాజరు కావడం సంస్కృత భాష, భారతీయ సంస్కృతిపై ఆయనకున్న అభిమానానికి నిదర్శనమన్నారు లాల్ బహదూర్ ఆచార్య జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ సంస్కృతాన్ని జనభాషగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మూడు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో ఉత్కర్ష మహోత్సవం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొ. కె.గణపతి భట్ సభా సంచాలకులుగా వ్యవహరించగా, అడిషనల్ కోఆర్డినేటర్లు డా. భారత భూషణ్ రథ్, డా. నాగరాజు భట్ కార్యక్రమ నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కె. వెంకటనారాయణరావు, అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, లక్నో క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొ. సర్వనారాయణ ఝా, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆచార్యులు శ్రీవాత్సవ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ. దక్షిణామూర్తి శర్మతో పాటు వివిధ

# మత్స్యకారుల కోసం 7 నౌకలు, 2 విమానాలతో ముమ్మర గాలింపు

- భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులతో సమన్వయం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు పర్యవేక్షణలో సహాయక చర్యలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక,గాలింపు చర్యలను కొనసాగిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బుధవారం అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలోని ఫిషరింగ్ ల్యాండ్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్. నైడియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల బుచ్చిరాజు, నర్సాపురం బొమ్మిడి నాయకర్, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్‌లతో కలిసి ఇన్ ఛార్జ్ మంత్రి క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తూ, గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే దిశగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం, పోలీస్, మెరైన్ విభాగాలు భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్‌లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని తెలిపారు. ఆగస్టు 3వ తేదీన ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారు. కోపనాతి రామకృష్ణ, కొల్లాటి యేసు దాసు, పాలేపు సంతోషరావు, కర్రి రాంబాబు, కొల్లాటి శ్రీనుబాబు, సంగడి తాతారావు, పోనాడి సతీష్‌లు ఈ బోటులో ఉన్నారు. వీరంతా అమలాపురం, ముమ్మిడివరం నియోజక వర్గాలకు చెందినవారని బాధిత కుటుంబాలు మంత్రికి తెలియజేశారు. సాధారణంగా పది రోజుల్లో తిరిగి వస్తామని కుటుంబ సభ్యులకు తెలిపి సముద్రంలోకి వెళ్లినప్పటికీ, నిర్ణీత గడువు దాటిన తరువాత కూడా బోటు తిరిగి రాక పోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 17న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ డా.ఆర్ మహేష్ కుమార్ వెంటనే స్పందించి గాలింపు చర్యలను ప్రారంభించారని బాధితులు తెలియజేశారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్‌కు చెందిన 5 నౌకలు, భారత నౌకాదళానికి చెందిన 2 నౌకలు, అలాగే నేవీకి చెందిన 2 అత్యాధునిక విమానాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. సుమారు 300 నాటికల్ మైళ్ల పరిధిలో సముద్ర ప్రాంతాన్ని జల్లెడ పడుతూ బోటు, మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతరంగా శోధన కొనసాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం తదితర తీర ప్రాంతాల రక్షణ విభాగాలకు సమాచారం అందించి సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు. తాజాగా ఒడిశాలోని పారాదీప్‌కు సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో పసుపు రంగులో ఉన్న ముత్యాలమ్మ పేరుతో కూడిన బోటును గుర్తించినట్లు సమాచారం అందింది. దీనిపై అధికారులు అప్రమత్తమై, గుర్తించిన బోటు గల్లంతైన మత్స్యకారుల బోటేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ప్రత్యేక బృందాన్ని పంపించామని మంత్రి తెలిపారు. గాలింపు చర్యల్లో లభిస్తున్న తాజా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, మత్స్యకారులను సురక్షితంగా గుర్తించి ఒడ్డుకు చేర్చే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని మత్స్య శాఖ మంత్రి తెలిపారు.

## గాలింపు చర్యలపై సీఎం ఆరా..

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో గల్లంతైన బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారుల ఆచూకీని కనుగొనేందుకు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనలో జరుగుతున్న గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులతో వర్చువల్ గా మాట్లాడారు. గాలింపు చర్యలు ఏ మేరకు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్స్, మెరైన్ పోలీసులు గాలిస్తున్నారని... జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తోందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇప్పటికే రెండు డార్నియర్ విమానాలు నేవీ బోట్లతో పాటు మరో ఏడు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల బోట్లను కూడా అప్రమత్తం చేసి గల్లంతైన బోటు ఆచూకీపై సమాచారం సేకరిస్తున్నామన్నారు. పారాదీప్‌కు 14 నాటికల్ మైళ్ల దూరంలో కొన్ని పడవలను గుర్తించామని, వాటి గురించి ఆరా తీస్తున్నామని అధికారులు

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

- జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, జెడ్పీ సీఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

**విశాఖపట్నం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, కార్యదర్శి మల్లిఖార్జున ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, జెడ్పీ సీఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం అమరావతి నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లాపరిషత్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వార్డుల వారీగా వివరాలు, రిజర్వేషన్లు, ఓటర్ల సంఖ్య తదితర అంశాలను సరిచూసుకోవాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే అవసరమైన డేటాను సిద్ధం చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, మౌలిక వసతులు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు సులభంగా ఓటుహక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాలను సేకరించి, అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు చేపట్టాలని, ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు నిబంధనలు, విధివిధానాలు, బాధ్యతలపై దశలవారీగా పూర్తి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, సీలింగ్ మెటీరియల్ లభ్యతను ముందుగానే నిర్ధారించుకోవడంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ప్రీఎలక్షన్ ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్, ప్రచురణలు, ఓటర్ల విభజన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రధానంగా మూడు దశల ఎన్నికల సరళిపై చర్చించారు. అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసిన 15వ రోజున పోలింగ్ నిర్వహించి, పోలింగ్ ముగిసిన 18వ రోజున ఫలితాలు ప్రకటించేలా ప్రణాళిక ఉంటుందని వివరించారు. మేయర్/మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఓటర్లకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉన్నందున దీనిపై సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన 16వ రోజున పోలింగ్ నిర్వహించి, 19వ రోజున ఫలితాలు ప్రకటించే విధంగా షెడ్యూల్ ఉంటుందని చెప్పారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన 14వ రోజున పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపట్టాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, సామగ్రిని సిద్ధం చేయడం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ వివరించారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, డిపిఒ శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ రమణ మూర్తి, ఎస్.డి.సి. గోవిందు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మం చౌదరిని పరామర్శించిన ఎమ్మెల్యేలు



**అనంతపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్.ఎస్.రాజు పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్న అయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఎమ్మెల్యేలు బ్రహ్మం చౌదరి ఇంటికి వెళ్లారు. ఆయన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగా ఉందని బ్రహ్మం చౌదరి తెలిపారు. మరింత విశ్రాంతి తీసుకుని, మళ్లీ మీ సేవలు ప్రారంభించాలన్నారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు వివిధ సమయాల్లో పార్టీ కోసం అనేక సేవలందించిన బ్రహ్మంచౌదరి చిన్న వయసులోనే ఇలా అనారోగ్యానికి గురి కావడం బాధాకరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అన్నారు. దేవుని దయ వలన ఆయన త్వరగా కోలుకున్నారని, మరికొద్ది రోజుల్లో కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా తన సేవల్ని తిరిగి ప్రారంభిస్తారని వారు తెలిపారు.

## గుంటూరులో భారీ స్థాయిలో

# ఐటి సోదాలు

**గుంటూరు(క్రైమ్), ఆగస్టు 19 ప్రభాతవార్త:** చార్టెడ్ అకౌంటెంట్ ఇంట్లో ఐటీ బృందం మంగళవారం సాయంత్రం నుండి సోదాలు నిర్వహించారు. తెలిసిన వివరాలు ప్రకారం అరండల్ పేట 17/2లో తేజ కాంప్లెక్స్‌లోని చార్టెడ్ అకౌంటెంట్ దామా సుబ్రహ్మణ్యం చెందిన నివాసం వద్దకు ఆదాయ పన్ను శాఖ అధికారులు ఒక్కసారిగా మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఐదు కార్లలో 26 మంది వరుకు విచ్చేసి సోదాలు చేశారు. విజయవాడ, హైదరాబాద్ నుంచే కాకుండా సెంట్రల్ ఐఆర్ఎస్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సోదాల్లో కీలకమైన హార్డ్ డిస్కులు, ఫైళ్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. దీనికి సంబంధించిన కంపెనీ యజమానిని కూడా ఐటీ అధికారులు విచారిస్తున్నట్లు తెలియవచ్చింది.

వందల కోట్ల రూపాయలతో బ్యాంకులకు కుచ్చు టోపి పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఆరు బ్యాంకుల నుండి కోట్లలో లావాదేవీలు జరిగినట్లు అంచనా. దావా సుబ్రహ్మణ్యంపై గత నెల రోజులుగా నిఘా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం.

ఓ బడా కంపెనీ యజమానికి బినామిగా కూడా వ్యవహరిస్తున్నట్లు ఐటీ అధికారులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. ఆ కంపెనీ యజమానిని కూడా అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో విజయవాడ నుండి ఆరుగురు, హైదరాబాద్ నుండి 17 మంది, సెంట్రల్ నుంచి మరో ఇరువురు ఐఆర్ఎస్ అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

## ఎసిబి వలలో ఇరిగేషన్ ఎఇ

**విజయనగరం, గరివిడి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా గరివిడి మండలంలోని కొండ లక్ష్మీపురం పంచాయతీ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఎఇ చింతాడ మహేష్ అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడుల్లో పట్టుబడ్డారు. కొండ లక్ష్మీపురానికి చెందిన మీసాల శ్రీను అనే వ్యక్తి కోళ్ల ఫారం ఏర్పాటుకి పంచాయతీ అనుమతులు కోరారు. అనుమతులకు రూ.15 వేలు లంచం ఎఇ డిమాండ్ చేశారు. దీంతో మీసాల శ్రీను ఎసిబిని ఆశ్రయించారు. ఎసిబి అధికారులు విజయనగరంలో లంచం తీసుకుంటుండగా ఎఇ మహేష్‌ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు.

# కీచక ఉపాధ్యాయుడు

- మాయమాటలతో మైనర్ విద్యార్థినిపై అత్యాచారం

**కంచిలి (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 19 ప్రభాతవార్త:** విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి వారికి ఉన్నత స్థానంలో నిలపాల్సిన ఉపాధ్యాయుడు కీచకంగా మారి మైనర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉన్నంత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. ప్రధానోపాధ్యాయుడు చాణక్య విలేకరులకు తెలియజేసిన వివరాలు ప్రకారం ఉపాధ్యాయుడు, మరో కళాశాలలో చదువుకుంటున్న మైనర్ విద్యార్థినికి సంవత్సరం కాలంగా మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. విద్యార్థినికి ఉపాధ్యాయుడికి మధ్య చరవాణిలో కొంతకాలంగా చాటింగ్ జరుగుతుంది. అయితే తల్లిదండ్రులకు అమ్మాయి ప్రవర్తనలో మార్పు గమనించి నిలదీశారు. తల్లిదండ్రులు నిలదీయడంతో అమ్మాయి పూర్తిగా జరిగిన విషయాలను తెలియజేసింది. జరిగిన సంఘటనను 45 రోజుల క్రితం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమక్షంలో ఉపాధ్యాయుడిని నిలదీశారు. అమాయకురాలైన తమ కుమార్తెను ఉపాధ్యాయుడు మాయ మాటలతో లొంగదీసుకున్నాడని, తమది పేద కుటుంబమని కుమార్తె విషయం బయటకు తెలిస్తే తమ కుటుంబ సభ్యులంతా సంఘంలో, సమాజంలో బతకలేక, మరణమే శరణ్యమని ప్రధానోపాధ్యాయులు ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఎంతకీ న్యాయం జరగపోవడంతో, జరిగిన విషయాన్ని జిల్లా ఉపవిద్యా శాఖ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై జిల్లాఉప విద్యాశాఖ అధికారి మూడు రోజుల క్రితం ఉన్నత పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. జరిగిన విషయాలను కుటుంబ సభ్యుల నుండి తెలుసుకొని, వివరాలంతా ప్రధానోపాధ్యాయుల నుండి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందుకొని ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# డాక్టర్ ప్రియాంక హత్య కేసులో నిందితుల రెండు రోజుల పోలీస్ కస్టడీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రాజమహేంద్రవరంలో డాక్టర్ ప్రియాంక హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. బుధవారం ఉదయం 11 గంటల నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల వరకు నిందితులను పోలీసులు విచారించనున్నారు. విచారణ అధికారి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పాటిల్ దేవరాజ్ మునీష్ ఆధ్వర్యంలో నిందితులను బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఘటనకు ముందు, ఘటన జరిగిన సమయంలో, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. డాక్టర్ ప్రియాంక ప్రయాణిస్తున్న స్కూటీని నిందితుల కారు ఏ విధంగా ఢీకొట్టింది? ప్రమాదం అనంతరం నిందితులు ఎక్కడికి వెళ్లారు? కారు ఎందుకు వేగంగా అక్కడి నుంచి వెళ్లింది? తదితర అంశాలపై విచారణ సాగుతోంది.

అలాగే ప్రసాదిత్య మాల్‌లో నిందితులకు, సిబ్బందికి మధ్య జరిగిన వివాదానికి కారణాలు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపైనా పోలీసులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు సమాచారం. సీసీటీవీ ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితుల వాంగ్మూలాలను పోలీసులు సరిపోల్చనున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావడమే లక్ష్యంగా దర్యాప్తు కొనసాగుతోంది.

# 22, 23 తేదీల్లో విశాఖలో బ్రిక్స్ సమావేశాలు

**విశాఖపట్నం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి విశాఖపట్నం వేదిక కానుంది. బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం నగరానికి లభించిన అరుదైన గౌరవంగా నిలవనుంది. యువత, క్రీడలు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారంపై ప్రపంచ దేశాల ప్రతినిధులు చర్చించే ఈ సమావేశాల ద్వారా విశాఖపట్నం తన అంతర్జాతీయ ప్రతిష్టను మరోసారిచాటుకోనుంది. భారతదేశం 2026 బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో 2వ బ్రిక్స్ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రుల సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచంలోని ప్రముఖ అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన బ్రిక్స్‌కు చెందిన 11 దేశాల నుంచి మంత్రులు, ఉన్నతస్థాయి ప్రతినిధులు విశాఖకు రానుండటంతో నగరం అంతర్జాతీయ అతిథ్యానికి సిద్ధమవుతోంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధుల భాగస్వామ్యంతో జరిగే ఈ సమావేశాలు యువత, క్రీడలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సహకారంపై కీలక చర్చలకు వేదిక కానున్నాయి. 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్ టైనబిలిటీ' అనే విస్తృత అంశంతో జరిగే సమావేశాల్లో యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహికత, ఆవిష్కరణలు, సాధికారతతో పాటు క్రీడా అభివృద్ధి, క్రీడా సాంకేతికత, క్రీడా పరిశ్రమ, సామర్థ్య నిర్మాణం, సంప్రదాయ, స్వదేశీ క్రీడల పరిరక్షణ తదితర అంశాలపై సభ్య దేశాలు చర్చించనున్నాయి. విశాఖ ప్రత్యేకతను చాటే కార్యక్రమాలు 22న తోట్లకొండలో మొక్కల నాటే కార్యక్రమం, వారసత్వ ప్రదేశ సందర్శన, ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించ నున్నారు. అనంతరం హోటల్ రాడిసన్ బ్లూలో యువజన మంత్రుల సమావేశం జరుగుతుంది. అదే రోజు రాత్రి హోటల్ నోవాటెల్‌లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో గాలా డిన్నర్ నిర్వహించనున్నారు. దీనిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రి భాగస్వామ్యం కానున్నారు. 23వ తేదీ ఉదయం నిర్వహించనున్న బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైకిల్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నోవాటెల్ నుంచి రామకృష్ణ బీచ్ రోడ్, సబ్‌మెరైన్ మ్యూజియం, సీ హారియర్ ప్రాంతం మీదుగా సుమారు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగనుంది. అనంతరం క్రీడా మంత్రుల సమావేశం, విశాఖలోని క్రీడా ప్రదేశాల సందర్శన వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

**ప్రతినిధుల కోసం అత్యున్నత స్థాయి ఏర్పాట్లు:** అంతర్జాతీయ ప్రతినిధులకు అత్యున్నత స్థాయి ఆతిథ్యం అందించేలా జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది. రాడిసన్ బ్లూ రిసార్ట్స్, నోవాటెల్ హోటళ్లలో ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం నుంచి ప్రతినిధుల బస, సమావేశ వేదికల వరకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు,


AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
ఒక షెడ్యూల్ట్ కమర్షియల్ బ్యాంక్
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

ఇదిలా ఉండగా దిగువ సంతకందారు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్ట్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు (చట్టం, 2002 (54 ఆఫ్ 2002)" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని (నియమం 3)తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి రుణగ్రహీత ఎం.చంద్రశేఖరరెడ్డి (రుణగ్రహీత) ఎం. వరలక్ష్మి (సహరుణగ్రహీత), (రుణ ఖాతా నం. 18660000216857) నోటీసులలో పేర్కొన్న మొత్తం రూ.1,79,352 (రూ. ఒక లక్ష డెబ్బై-తొమ్మిది వేల మూడు వందల యాభై-రెండు మాత్రమే) సదరు నోటీస్ స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోపుగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇస్తూ 16-మార్చి-26 తేదీ గల డిమాండ్ నోటీస్ జారీ చేసారు.

ఇదిలా ఉండగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క విలీన పథకం ప్రకారం, 1 ఏప్రిల్ 2024 నుండి అమలులోకి వచ్చేలా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ప్రకారం, పైన పేర్కొన్న రుణ ఖాతా, మంజూరు చేయబడిన సదరు క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించవలసిన మొత్తం సొమ్ముతో పాటు, తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించిన అంతర్లీన సెక్యూరిటీ మరియు సెక్యూరిటీ వడ్డీతో సహా, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు బదిలీ చేయబడింది.

రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మొత్తం తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, దిగువ సంతకందారు 18వ రోజు ఆగస్ట్ 2026వ సంవత్సరం ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/తాకట్టుదారుకు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయబడుతుంది.

ముఖ్యంగా రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించబడింది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలనైనా, 12-మార్చి-26 నాటికి రూ.1,79,352 (రూ. ఒక లక్ష డెబ్బై-తొమ్మిది వేల మూడు వందల యాభై-రెండు మాత్రమే) మొత్తం మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్ట్ వాణిజ్య బ్యాంకు) వారి ఛార్జీకి లోబడి ఉంటుంది.

హామీగా ఉంచిన ఆస్తులను తిరిగిపొందడానికి అందుబాటులో ఉన్న సమయం, అనగా ఈ సమాచారం అందిన తేదీ నుండి 30 రోజులు, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను రూల్ 8(6)తో చదువబడే దానిని రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం అయినది.

స్థిరమైన ఆస్తుల వివరణ

చిత్తూరు రెవెన్యూ జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, చంద్రగిరి సబ్‌జిల్లా, చంద్రగిరి మండలం, దోర్నకంబాల గ్రామ పంచాయతీ నం.63, చంద్రగిరి గ్రామ కాతాలు పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామం సర్వే నం. 1075/1, ఇంటి నం. 1-153 ఆస్తి పన్ను అసెస్‌మెంట్ నం. 53 వద్ద ఉన్న టెర్రస్ భవనం మరియు RCC భవనం మరియు స్థలం దీని వివరాలు: తూర్పు-పడమర 80.3 అడుగులు లేదా 24.476 మీటర్లు మరియు ఉత్తర-దక్షిణం 25 లేదా అడుగులు 7.625 మీటర్లు కొలతలు కలిగిన మొత్తం 2006.25 చదరపు అడుగుల లేదా 222.91 చదరపు గజాల స్థలం; ఈ స్థలంలో నిర్మించబడిన సున్నపు మిద్దె భవనం కొలతలు: తూర్పు-పడమర 32.11 అడుగులు/10.037 మీటర్లు; ఉత్తర-దక్షిణం 22.6 అడుగులు/6.862 మీటర్లు; విస్తీర్ణం 740.475 చదరపు అడుగులు మరియు ఆ ఇంటికి తూర్పు వైపున ఉన్న మరో భవనం కొలతలు; తూర్పు-పడమర 30.8 అడుగులు/9.351 మీటర్లు; ఉత్తరం- దక్షిణం 11.4 అడుగులు/3.455 మీటర్లు; విస్తీర్ణం 347.377 చదరపు అడుగులు కలిగిన RCC భవనం: అలాగే తలుపులు, చట్రాలు, వెంటిలేషన్లు, కిటికీలు, పెరడు, వాస్తు సౌకర్యాలు మరియు కాంపౌండ్ వాల్ 8'3+16+47'3= మొత్తం పొడవు 143.5 అడుగులు వంటివి; పంచాయతీ కుళాయి కనెక్షన్, విద్యుత్ సర్వీస్ నం. 0076 మరియు ఇతర గృహ వినియోగ సదుపాయాలు; ఈ ఆస్తికి సంబంధించిన అన్ని హక్కులు మరియు ఈజ్‌మెంట్ హక్కులు; భవనంలోని ఫిక్చర్లు, ఫిట్టింగ్‌లు మరియు ప్రస్తుతం లేదా భవిష్యత్తులో అక్కడ నిర్మించబడే నిర్మాణాలు అన్నీ దీనిలో అంతర్భాగం. సరిహద్దులు: తూర్పున : CC రోడ్డు, పడమరన : CC రోడ్డు, ఉత్తరాన: C షెడ్యూల్ ఆస్తి ఇల్లు, దక్షిణాన: A షెడ్యూల్ ఆస్తి ఇల్లు.

తేది: 18/ఆగస్ట్/2026 అధీకృత అధికారి
ప్రదేశం : జిల్లా: చిత్తూరు, ఆం.ప్ర. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

20-8pg4:20-8pg4.qxd 8/19/2026 11:56 PM Page 1



వార్త


ఒక దేశం కీర్తి ప్రతిష్టలు ప్రధానంగా ఆ దేశ రచయితలపై ఆధారపడి ఉంటాయి.

న- శామ్యూల్ జాన్సన్

# న్యాయప్రక్రియ నత్తనడక!

న్యాయవ్యవస్థలో ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండటం ఏవర్గానికీ సంతృప్తికరంగా లేదు. తాజాగా సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో దేశం మొత్తం మీద 5.74 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తేలింది. ఇది నిజంగా ఆందోళనకరమే. సాధారణ పౌరులు అనుకోకుండా వ్యాజ్యాల్లో చిక్కుకోవడం, తమకు సంబంధం లేని కేసుల్లో ఇరుక్కోవడం కోర్టులనాశ్రయించడంలో తమ జీవితాలనే పణంగా పెట్టిన సందర్భాలు కోకొల్లలు. ఒక్క నేరస్థుడు తప్పించుకున్నా పర్వాలేదు కానీ ఒక నిరపరాధి శిక్షించబడకూడదనే ఏకైక న్యాయ సిద్ధాంతం మీద న్యాయవ్యవస్థలో వివిధ క్రిమినల్ కేసులు సాగుతుంటాయి. ఈ కోవకు చెందకపోయినా ప్రధానంగా చూస్తే ప్రజాప్రతినిధులపై ఉన్నకేసుల విచారణ వేగవంతం చేయాల్సిన ఆవశ్యకతను సుప్రీంకోర్టు పదేపదే నొక్కి చెబుతోంది. ఎవరేం చేసినా,ఎవరెన్ని చెబుతున్నా సాధారణ కేసులుకానీ, ప్రజాప్రతినిధులపై ఉన్న అవినీతి వగైరా కేసులు కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన చతికిలపడిపోతున్నా యి. ఇలాంటి కేసుల్లో నష్టపోయేది ఎవరంటే ఎంతో నిజాయితీగా కోర్టులను ఆశ్రయిస్తున్న కక్షిదారులే.ఏంపాపం చేసుకున్నారని వాళ్లకీ శిక్ష. అందుకేనేమో 'ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే గెలిచిన వాడు కోర్టు బయట ఏడుస్తాడనే జనశ్రుతి ఉండనే ఉంది. దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై 4192 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిలో లోక్‌సభలో 543 మంది ఎంపీల్లో 251 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 533మంది రాజ్యసభ సభ్యుల్లో 75మంది క్రిమినల్ కేసులు నడుస్తున్నాయి. సాధారణంగా నిందితులు రాజ్యాంగ పదవుల్లో ఉన్నప్పుడు కేసుల అసాధారణ జాప్యం జరగడం పరిపాటి. కేసుల్లో ఇరుకున్న ప్రజాప్రతినిధులు వాయిదాలు కోరుతూ న్యాయప్రక్రియను ఎంత కాలం వీలైతే అంతకాలం పరిష్కారం కాకుండాన్యాయశాస్త్ర, చట్టంలోని లోపాలను ఆసరాగా తీసుకుని ఓపట్టాన తెమలనీయరు. అది సహజం. అలా వీళ్ల కేసులు సుదీర్ఘ కాలం న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉంటాయి.మరి సాధారణ ప్రజలపరిస్థితి ఆ దేముడికే తెలియాలి.'కోర్టువాయిదా'లనేవి వాళ్ల పాలిట శాపాలుగా మారతాయి. తాజాగా ప్రజాప్రతినిధుల కేసులో అపరిష్కృతంగా ఉన్న అంశంలో ఒకప్రజాప్రయోజన వ్యాజ్యంలో 'అమికస్‌క్యూరి'గా నియమితులైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లోని వివరాలు ఒక్కసారిగా ప్రక్రియలోని డొల్లతనాన్ని హెచ్చరించినట్లుగా అనిపించింది. ఆయన అఫిడవిట్‌లోని సారాంశ మేమిటంటే 'సుప్రీం కోర్టు ఎన్నిసార్లు ఆదేశాలిచ్చినా ప్రజాప్రతినిధులపై కేసులకు తార్కిక ముగింపు దొరకడంలేదు. అదంతా వ్యవస్థాగత లోపమేనంటున్నారాయన.నేరన్యాయ విచారణ ప్రక్రియలో ఉన్నలోపాన్ని ఎత్తిచూపారు. కేసులు అపరిష్కృతంగా వాయిదాలు వేసుకుంటూ ఏళ్ల తరబడి అటకమీదనే ఉంటున్నాయన్నది సమాజానికి తెలియనిదీ కాదు. దాని మీద ఎంత కసరత్తు జరిగినా సత్ఫలితాలు మాత్రం 'హుళక్కే'. ప్రజాప్రతినిధుల మీదఉన్న కేసులవాయిదాలు, సుదీర్ఘ వాయిదాలు, వంటి అంశాలను అర్థంచేసుకోవచ్చు. కానీ సాధారణ పౌరుల కేసుల పరిష్కారంలో 'సాగతీత' కక్షిదారులను ఎంత నిర్బలురను చేస్తుందో చెప్పనలవికాదు. ఒక వ్యక్తి అతి చిన్న వయసులో కోర్టుకు చేరిన పిత్రార్జిత ఆస్తుల విభజన కేసుల్ని చూస్తే ఆ వ్యక్తి పండు ముదుసలై పళ్లూడిపోయాక కానీ హాయిగా నవ్వుకు నేందుకు కూడా వీలుకాదు. ఒకసారి కోర్టు వ్యాజ్యంలో చిక్కుకుంటే ఇక న్యాయం కోరే కక్షిదారుని ముఖారవిందమే చూడబోము. వాయిదాల తీరుపై ఉన్న ధర్మాసనం నిర్దిష్ట ఆదేశాలుండి న్యాయవాదుల నుంచి సరైనసహకారం లభిస్తే తప్ప సాధారణ కక్షిదారుల న్యాయానికి తాత్కాలిక సంకెళ్లు వేసినట్లే. ప్రజాప్రతినిధుల్లో శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ముఖ్యమంత్రులు కూడా కేసుల్లో ఉండటంకొంతఅసౌకర్యం కలుగుతున్నమాట వాస్తవమే అయినా మిగిలిన కేసుల సంగతి ఏమిటో ఆలోచన చేయాలి. న్యాయం ముందు అందరూ ఒక్కటేనని తరచు వినిపించే మాట. అది వాయిదాల న్యాయప్రక్రియలో మాత్రమే పనిచేస్తోంది. అలా అని సుమోటో రిట్ పిటిషన్ల రోజువారీ అప్పటికప్పుడు అత్యవసరం పేరిట లంచ్‌మోషన్‌లో వచ్చేరాజకీయప్రాధాన్యమున్న కేసుల గురించి సమాచారాన్ని మరుసటి రోజు పేపర్లలో, చానళ్లలో పరకాయిస్తున్నప్పుడు మన కేసులు వాయిదాల కేనా?అని సాధారణ కక్షిదారుడు విచారించకుండాఉండడు. ఏ క్రిమినల్ కేసునైనా అభియోగాలు నమోదు చేసిన తేదీ నుండి ఏడాదిలోగా తీర్పు రావాలని నిర్దేశిత సమయంగా నిర్ణయిస్తే మంచిదనేసూచన 'అమికస్ క్యూరీ' అఫిడవిట్‌లో ప్రస్తావించారు. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నకేసులను హైకోర్టు నిరంతర పర్యవేక్షణలోకి తీసుకోవాలి. అలాగే ప్రజాప్రతినిధుల కేసుల విషయంలోనూ హైకోర్టుల పర్యవేక్షణ అవసరమేనని హైకోర్టుకు సూచనలున్నాయి. దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులను శాశ్వతంగా రాజకీయాల్లో పాల్గొనకుండా నిషేధించాలనికోరుతూ న్యాయవాది అశ్వినీ కుమార్ 2016లో దాఖలుచేసిన 'పిల్'లో 'అమికస్ క్యూరీ' విజయ్ హన్సారియా తన 22వ నివేదికను సమర్పించారు. ఏ కేసుకైనా నిర్దిష్ట విచారణ గడువును ఉన్నత ధర్మాసనం నిర్దేశిస్తే కోర్టుల్లో విచారణవేగవంతమయ్యే వీలుంది. దేశంలో 15 కోట్ల నుండి 20 కోట్ల మంది ప్రజలు నేరుగా కోర్టుకేసుల వలలో చిక్కుకుని న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు.వారి ఘోషఆలకించే విధంగా మరిన్ని సంస్కరణలు అవసరం.కేసు ఎలాంటిదైనా అత్యంత అరుదైన సందర్భాలు, లేదంటే తప్పనిసరి విధిలేని పరిస్థితుల్లో మాత్రమే 'వాయిదా'కు అర్హత పొందేటట్లు నిర్దేశించాలన్న సూచనలు లేకపోలేదు. ప్రజాప్రతిని ధుల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది.

అతనికేమీ తెలియదు. అయినా అన్నీ తెలుసుననుకుంటాడు. అటువంటి వాళ్లు రాజకీయంగా రాణిస్తారు.



జార్జి బెర్నార్డ్ షా

పాలకులు సాధారణంగా ప్రజల వంటివారు కారు, పాలకుడు మంచివాడైతే ప్రజలు కూడా మంచివారుగా ఉంటారు.



చాణక్యుడు

# హాకర్ల జీవనోపాధిని దెబ్బతీస్తున్న జోన్లు

**పట్టణాల అభివృద్ధి, సుందరీకరణ, ట్రాఫిక్ నియంత్రణ అవసరమే కానీ ఆ అభివృద్ధి పేదల జీవనోపాధిని బలి తీసుకునే విధంగా ఉండకూడదు. పెద్ద షాపింగ్ మాల్స్, కార్పొరేట్ వాణిజ్య సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందించి, చిన్న వ్యాపారులను పట్టణాల నుంచి బయటకు నెట్టడం సమంజసం కాదు.వీధి వ్యాపారులు పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగం. తక్కువ ధరలకు ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించడంలో, స్వయం ఉపాధిని పెంపొందించడంలో, నిరుద్యోగాన్ని తగ్గించడంలో వారిపాత్ర విశేషమైనది. అందువల్ల వారిని సమస్యగా కాకుండా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములుగా ప్రభు త్వం గుర్తించాలి.రుణాలు మంజూరు చేయాలి. జి.ఓ.ఎం. ఎస్. నెం.140లోని రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల విధానాన్ని పునఃసమీక్షి ంచి రద్దు చేయాలి. టౌన్ వెండింగ్ కమిటీలను చట్టం ప్రకారం పునర్వ్యవస్థీకరించి, వీధి వ్యాపారుల నిజమైన ప్రతినిధులకు ప్రాధాన్యం కల్పించాలి.**

రాష్ట్రంలో 10 లక్షల మంది పైగా పట్టణాలు నగరాలు మండల కేంద్రాలతో పాటు ప్రధాన గ్రామాలలోనూ రోడ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నారు. దాదాపు 50 లక్షల మంది కుటుంబ సభ్యులు ఇదే జీవనాధారంగా ఉన్నది. చిరు వ్యాపారులకు ఉపాధి కల్పనే కాకుండా సాధారణ ప్రజలకు చౌకగా కూరగాయలు,పళ్ళు ఇతర సరుకులు అందిస్తూ సమాజంలో ముఖ్యపాత్ర వహిస్తున్నారు. వీధుల్లో వ్యాపారాలు చేసుకునే వారిని రక్షణ కొరకు సుప్రీంకోర్టులు అనేక తీర్పులు ఇచ్చాయి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. నిబంధనలు రూపొందించాయి అవి కాగితాలికే మిగిలిపోయాయి. వీరికి రక్షణ కొరవడింది. వేధింపులు నిత్యకృత్యం అయ్యాయి. ఒకవైపున మున్సిపల్, మరొకవైపున పోలీసులు, వివిధ శాఖలు వీరితో బంతాట ఆడుకున్నట్లు జీవితాలతో ఆడుకుంటున్నారు. వీరి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ దొంగల్లా చూస్తున్నారు. పట్టణాభివృద్ధి, సుందరీకరణ, రోడ్ల వెడల్పు, ప్రమాదాల నివారణ పేరుతో వీరిని అక్కడక్కడ తొలగిస్తున్నారు. ప్రత్యామ్నాయం లేకుండా చేస్తున్నారు. దీనితో వారి కుటుంబాలను బజారున పడేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీధి వ్యాపారుల సర్వే చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. నోటీసులు లేకుండా తొలగించరాదు. రుణ సదుపాయం కల్పించాలి. మంచినీరు, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఇవన్నీ గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వెండింగ్ జోన్లు ప్రవేశపెట్టి కొన్ని వీధుల్లో చట్టబద్ధంగా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలి. అలా కాకుండా కూటమి ప్రభుత్వం (జి.ఓ.ఎం.ఎస్). నెం.140 ద్వారా రాష్ట్రంలోని 51పట్టణ, స్థానిక సంస్థల్లో స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌లకు ఆమోదం తెలపడం పట్టణాభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, పరిశుభ్రత, వీధి వ్యాపారుల జీవనోపాధి వంటి కీలక అంశాలపై మరోసారి చర్చకు దారి తీసింది. పట్టణాలను క్రమబద్ధీకరించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, పాదచారులకు సురక్షి తమైన మార్గాలను కల్పించడం ప్రభుత్వ బాధ్యతే. అయితే అదే సమయంలో లక్షలాది మంది వీధి వ్యాపారుల జీవనోపాధిని రక్షి ంచడం కూడా రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన ప్రభుత్వ బాధ్యత. దేశంలో కోట్లాది మంది నిరుద్యోగులు, స్వయం ఉపాధిపై ఆధారపడిన కుటుంబాలకు వీధి వ్యాపారమే ప్రధాన జీవనా ధారం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన మహి ళలు, వికలాంగులు, వృద్ధులు, యువకులు, చిన్న వ్యాపా రులు రోడ్లపైనే చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి జీవనోపాధిని దెబ్బతీసే విధానాలు సామాజిక న్యాయానికి విరుద్ధం. స్ట్రీట్ వెండర్స్ (జీవనోపాధి రక్షణ, వీధి వ్యాపార నియంత్రణ) చట్టం-2014ను కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారులను రక్షి ంచడానికి తీసుకొచ్చింది. ఈ చట్టం ఉద్దేశం హాకర్లను పట్టణాల నుంచి తొలగించడం కాదు. వీధి వ్యాపారులను గుర్తించి, సర్వే నిర్వహించి, గుర్తింపుకార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేసి, పట్టణ ప్రణాళికలో భాగ స్వాములుగా గుర్తించడమే ఈచట్టం ప్రధాన లక్ష్యం. అందు వల్ల స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌ల అమలుకూడా అదే స్ఫూర్తితో జరగాలి. ప్రభుత్వం గుర్తించిన వెండింగ్ జోన్లలో మాత్రమే వ్యాపారం చేయాలని నిర్ణయించడం పరిపాలనా పరంగా సమంజసంగా కనిపించినా, ఆ జోన్లు నిజంగా జీవనోపాధి ని కొనసాగించడానికి అనుకూలంగా ఉన్నాయా అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.ప్రజల రాకపోకలు లేని ప్రాంతాలకు వ్యాపారులను తరలిస్తే వారి ఆదాయం



పూర్తిగా దెబ్బతింటుంది. ఇదిచట్టం కల్పించిన జీవనోపాధి హక్కును నిర్వీర్యం చేయడమే.స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం -(2014) టౌన్ వెండింగ్ కమిటీ మొత్తం ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలి. ప్రతి పట్టణంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి వీధి వ్యాపారికి గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలి.టౌన్ వెండింగ్ కమిటీల్లో నిజమైన వీధి వ్యాపారుల ప్రతి నిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. కానీ అనేక పట్టణాల్లో ఈ ప్రక్రియను పక్కనబెట్టి, సర్వేలు పూర్తిచేయకుండా, గుర్తింపుకార్డులు ఇవ్వకుండా, నేరుగా తొలగింపులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది స్ట్రీట్ వెండర్స్ చట్టానికి విరుద్ధం మాత్రమే కాకుండా, సుప్రీంకోరు, వివిధ హైకోర్టులు ఇచ్చిన మార్గదర్శకాలకు కూడా వ్యతిరేకం. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో పాటు ఇతర పట్టణాల్లో కూడా రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల విధానాన్ని అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ విధానం వీధి వ్యాపారుల హక్కులను తీవ్రంగా పరిమితం చేసే ప్రమాదం ఉంది. రెడ్ జోన్ ప్రాంతాల్లో వీధి వ్యాపారాలకు పూర్తిగా నిషేధం విధిస్తున్నారు. విజయవాడ నగరంలో 418ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులను రెడ్ జోన్లుగా ప్రకటించారు. బందర్ రోడ్, మహాత్మా గాంధీరోడ్, సిద్ధార్థ కళాశాల రోడ్, వన్‌టౌన్, గాంధీనగర్, సింగ్‌నగర్, బీఆర్‌టీఎస్ రోడ్, రైల్వే స్టేషన్ పరిసరాలు, కాళేశ్వరరావు మార్కెట్, లెనిన్ సెంటర్ వంటి ప్రాంతాలు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా జీవనోపాధి సాగిస్తున్న వేలాది మంది హాకర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీనితో వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం నెలకొంది. అంబర్ జోన్ ప్రాంతాల్లో పరిమిత సంఖ్యలో మాత్రమే వ్యాపారులకు అనుమతి ఉంటుంది. నిర్ణీత సమయాల్లో లేదా కొన్ని రోజులలో మాత్రమే వ్యాపారం చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల రోజువారీ ఆదాయంపై ఆధారపడే చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారు. ఒక రోజు వ్యాపారం లేకపోయినాకుటుంబ పోషణ కష్టమయ్యే పరిస్థితుల్లో ఈ విధానం అన్యాయంగా మారుతుంది. వీధి వ్యాపారానికి అనుమతి ఉన్న ప్రాంతా లను గ్రీన్ జోన్లుగా పేర్కొంటున్నారు. అయితే చాలా గ్రీన్ జోన్లు జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉన్నాయి. వినియోగదారులు లేని ప్రాంతాల్లో వ్యాపారం చేస్తే ఆదాయం ఎలా వస్తుంది? వారి కుటుంబాలు ఎలా బ్రతు కుతాయి అనేది ప్రశ్న. వ్యాపారం జరిగే ప్రాంతాలే హాకర్ల జీవనాధారం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో గ్రీన్ జోన్ పేరుతో వ్యాపారులను ఖాళీ ప్రదేశాలకు తరలించడం అంటే వారి జీవనోపాధిని హరించడమే. విజయవాడలో బీసెంట్ రోడ్ గ్రీన్ జోన్ పరిధిలోనే ఉన్నప్పటికీ, అక్కడ గుర్తింపు కార్డులు కలిగిన హాకర్లను కూడా తరచూ తొలగిస్తున్నారు. ఇది ప్రభుత్వం ప్రకటించిన విధానానికే విరుద్ధంగా ఉంది. చట్టబద్ధమైన గుర్తింపు కార్డులున్నప్పటికీ హాకర్లను వేధించడం ఆందోళనకరమైన విషయం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జి) ప్రకారం ప్రతి పౌరుడికి తనకు నచ్చిన వృత్తి లేదా వ్యాపారం చేసే హక్కు ఉంది. ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో జీవనోపాధి కూడా అంతర్భాగమేనని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసింది. అందువల్ల వీధి వ్యాపారులను ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించకుండా, పునరావాసం ఇవ్వకుండా బలవంతంగా తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కావున ప్రభుత్వాలు కూడా వ్యాపార ప్రదేశాలో మౌలిక సదుపాయాలు, రక్షణ కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణాల అభివృద్ధి, సుందరీకరణ, ట్రాఫిక్ నియంత్రణ అవసరమే కానీ ఆ అభివృద్ధి పేదల జీవనోపాధిని బలి తీసుకునే విధంగా ఉండకూడదు. పెద్ద షాపింగ్ మాల్స్, కార్పొరేట్ వాణిజ్య సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందించి, చిన్న వ్యాపారులను పట్టణాల నుంచి బయటకు నెట్టడం సమంజసం కాదు.వీధి వ్యాపారులు పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగం. తక్కువ ధరలకు ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించడంలో, స్వయం ఉపాధిని పెంపొందించడంలో, నిరుద్యోగాన్ని తగ్గించడంలో వారిపాత్ర విశేషమైనది. అందువల్ల వారినిసమస్యగా కాకుండా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములుగా ప్రభుత్వం గుర్తించాలి.రుణాలు మంజూరు చేయాలి. జి.ఓ.ఎం. ఎస్. నెం.140లోని రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల విధానాన్ని పునఃసమీక్షి ంచి రద్దు చేయాలి. టౌన్ వెండింగ్

# 'ఆర్గానిక్ సాగు'తో ఆరోగ్య విప్లవం రావాలి

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

గతంలో ఆకలితో అలమటించిన భారతదేశం హరిత విప్లవంతో ఆహార స్వయం సమృద్ధిని సాధించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. కానీ, ఆనాడు సాధించిన విజయం నేడు ఒక ప్రాణాంతక సంక్షోభానికి దారితీస్తుందని ఎవరూ ఊహించలేదు. ఒకప్పుడు 'ఆహారమే ఔషధం' అని గర్వంగా చెప్పుకున్న మన నేలపై, నేడు 'ఆహారమే విషం' అనే చేదు నిజం ప్రతి పళ్లాన్నీ భయపెడుతోంది. పొలాల్లో దిగుబడి పెంచాలనే ఆరాటం, మార్కెట్‌లోపంట మెరిసిపోవాలనే కక్కుర్తి కలగలసి మన నిత్య జీవితాన్ని ఒక విషవలయంలోకి నెట్టేశాయి. పంట పరిమాణం (రాశి) కంటే నాణ్యత (వాసి) ముఖ్యమనే పరమసత్యాన్ని మరచిపోయిన పరిణామమిది. కేంద్ర వ్యవసాయ శాఖలోక్‌సభలో సమర్పించిన అధికారిక వివరాలు ఈ విష సంస్కృతి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. జాతీయ స్థాయిలో పురుగు మందుల అవశేషాల పర్యవేక్షణ ప్రాజెక్ట్ కింద దేశవ్యాప్తంగా పరీక్షి ంచిన 70,652 పండ్లు, కూరగాయల శాంపిళ్లలో ఏకంగా 2,223 సాంపిళ్లు ఆహార భద్రత ప్రమాణాలసంస్థ నిర్ణయించిన సురక్షి త పరిమితులను మించి ప్రమాదకర రసాయనాలను కలిగి ఉన్నాయని తేలింది.జాతీయ స్థాయి లో ఉల్లంఘనల సగటు 3.1శాతంగా ఉంటే, మనతెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత దిగ్భ్రాంతికరంగా ఉంది. తెలంగాణలో పరీక్షి ంచిన 8,198 శాంపిళ్లలో 486(5.9శాతం) శాంపిళ్లు కల్తీగా తేలి దేశంలోనే అత్యధిక సంఖ్యను నమో దు చేయగా, ఆంధ్రప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో అత్యధికం గా 6.4శాతం శాంపిళ్లు విష రసాయనాల మయమ య్యాయి. కర్ణాటకలో 3.6శాతం, మహారాష్ట్రలో4.9శాతం మేర ప్రమాదకర అవశేషాలు ఉండగా, తెలంగాణలో హెక్టా రుకు వాడే క్రిమిసంహారకాల మోతాదు (0.530 కేజీ) జాతీయ సగటు (0.277 కేజీ)



కంటే దాదాపు రెట్టింపు కావడం మనల్ని నివ్వెరపరుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో నిషేధించిన మోనోక్రోటోఫాస్, క్లోర్‌పైరి ఫాస్, కార్బోఫ్యూరాన్ వంటి నిషిద్ధ రసాయనాలు నేటికీ మన పొలాల్లో యథేచ్ఛగా చిలకరించబడుతున్నాయి. ఈ రసాయన విషం ప్రతిరోజూ మన శరీరంలోకి చేరి నిశ్శబ్దంగా మన ఆరోగ్య వ్యవస్థను ధ్వంసం చేస్తోంది. జ్ఞాపకశక్తి మందగించడం, తీవ్రమైన నాడీ సంబంధిత రుగ్మతలు, హార్మోన్ల అసమతుల్యత, సంతానలేమి వంటి సమస్యలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రాణపదంగా చూసుకునే చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల అటకెక్కుతోంది. కాలేయం, మూత్రపిండాల వైఫల్యంతో పాటు క్యాన్సర్ వంటి మహమ్మారులు ప్రతి ఇంటా భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. పంట పండించే రైతు కుటుంబాలు, ముఖ్యంగా పొలాల్లో పనిచేసే మహిళలు, పిల్లలు ఈ విషప్రభావానికి మొదటి బాధితులుగా మారుతుండటం అత్యంత విచారకరం. ఈ ప్రాణాంతక పరిస్థితి నుంచి బయటపడాలంటే మన ఆలోచనా ధోరణి మారాలి. హరిత విప్లవం ఆకలి తీర్చింది నిజమే,కానీ ఇప్పుడు మనకు కావలసింది ఆరోగ్యకరమైన ఆహార విప్లవం. సమగ్ర సస్యరక్షణ, సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను యుద్ధప్రాతిపదికన ప్రోత్సహించాలి. భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా ఆర్గానిక్ రైతు కలిగిన దేశంగా ఉన్నప్పటికీ, రసాయన రహితసాగు వైపు రైతులు ధైర్యంగా అడుగులు వేయాలంటే ప్రభుత్వాల మద్దతు అనివార్యం. ప్రారంభంలో దిగుబడి తగ్గినా రైతు నష్టపోకుండా ఉండేందుకు ప్రత్యేక కనీస మద్దతు ధర, ప్రీమియం ధరలు, పంట కొనుగోలు హామీని అందించాలి. కేవలం ఉపన్యాసాలు కాకుండా ఆర్థికప్రోత్సాహకాలు దక్కినప్పుడే రైతు సేంద్రీయ బాట పడతాడు. పొలం నుండి మన పళ్లెం వరకు ప్రతి స్థాయిలోనూ కఠిన పర్యవేక్షణ ఉండాలి. నిషేధిత రసాయనాలు అమ్మేవ్యాపారులపై నిర్దాక్షి ణ్యమైన చర్యలు తీసుకోవాలి. ఎగుమతిఅయ్యేపంటలకు, దేశీయంగా మనం తినే ఆహారానికి ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలను వర్తింపజేయాలి. వినియోగదారులుగా మనం కూడా

# ఆర్థిక రంగాన్ని వణికిస్తున్న 'ఎల్‌నినో' దడ

నండూరి రవిశంకర్

ఈ ఏడాది అత్యంత శక్తివంతమైన ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు అనూహ్య రీతిలో మారిపోతాయని, ఉష్ణోగ్రతలు భారీగా పెరగొచ్చని, రుతుపవనాలు అసాధారణంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా రుతుపవనాలపై ఏవిధంగా ఉంటుందనే దానిపై నిశితంగా పరిశీలిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో అభివృద్ధి చెందుతున్న ఎల్‌నినో వాతావరణ వ్యవస్థ సాధారణ వర్షపాత విధానాన్ని తీవ్రంగా దెబ్బతీయనుంది. దీని ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో కరవును, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాలను తెచ్చే అవకాశం ఉందని నేషనల్ జియోగ్రాఫిక్ నివేదించింది. అందుకే దీన్ని 'సూపర్ ఎల్‌నినో'గా సైంటిస్టులు చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలోని నీరు అసాధారణంగా వేడెక్కడాన్ని ఎల్‌నినో అంటారు. ఇది 2నుంచి 7సంవత్సరాలకు ఒకసారి కనిపించే ఊహించని వాతావరణ దృగ్విషయం. ఇది జరిగినప్పుడు వాతావరణంలో తేమ కదలికలను మార్చి, కొన్ని చోట్ల పొడి పరిస్థితులను, మరికొన్ని చోట్ల భారీ వర్షాలను కలిగిస్తుంది.గతంలో ఎల్‌నినో బలహీనమైన రుతుపవనాలు, కరవు, పంట నష్టాలు వంటి పరిస్థితులను కలిగించింది. గతంలో 1982-83, 1997-98, 2015-16లో ఇటువంటి భారీ మార్పులు సంభవించాయి. ఈ ఏడాది కొన్ని చోట్ల వర్షపాతం తగ్గడం, మరికొన్ని చోట్ల అధిక వర్షపాత ఘటనలు పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శీతాకాలం, వసంతకాలంలో జరిగే పరిణామాలు రుతుపవనాల సీజన్‌పై గరిష్ట ప్రభావాలు చూపుతాయనిఅమెరికా ఎన్ఓఎఎ వాతావరణ అంచనా కేంద్రం ఆపరేషనల్ ప్రిడిక్షన్ బ్రాంచ్ చీఫ్ జాన్ గోట్‌షాల్క్ తెలిపారు. ఈ ఏడాది జూన్,ఆగస్టు 2026 మధ్యలో ఎల్‌నినో మొదలై ఏడాది చివరివరకు కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా కాలానుగుణ వర్షాలు పడే ప్రాంతాల్లో ఆహార భద్రత, కరవు, కారుచిచ్చు వంటి పరిస్థితులకు దారితీసే అవకాశం ఉంది. మరోవైపు ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్ని చోట్ల బలమైన రుతుపవనాల కారణంగా అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారత్‌లో సాధారణంగా ఎల్‌నినో సంవత్సరాల్లో తక్కువవర్షపాతం నమోదవుతుంది. భారత వాతావరణశాఖ ఇప్పటికే ఈఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. ఈ క్రమంలో పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను జాగ్రత్తగా పరిశీలిస్తోంది. హిమాలయాల్లో తక్కువ మంచు కవరేజ్, అమెరికా నైరుతి ప్రాంతంలో పొడి శీతాకాలం వంటి కారకాలు ఎల్‌నినోఉన్నప్పటికీ రుతుపవనాలను బలపరిచే అవకాశం కూడా లేకపోలేదు. అయితే ఈసారి పసిఫిక్ వేడెక్కడం బేసిన్‌వైడ్‌గా కనిపిస్తుంది.భారత్, ఇండోనేషియా, పశ్చిమ ఆఫ్రికా రుతుపవన వ్యవస్థను ప్రభావం చూపే అవకాశం ఉందని గాట్‌షాల్క్ పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిపోవడంవల్ల భారత్‌లో కరవు సంభవించే అవకాశాలున్నాయి. అలాగే మధ్య ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌తోపాటు దక్షి ణ పసిఫిక్, మధ్య అమెరికా, ఉత్తర బ్రెజిల్ వంటి ప్రాంతాల్లోనూ కరవు సంభవించే అవకాశాలున్నాయని సైంటిస్టులు హెచ్చరిస్తున్నా రు. 1876-78 మధ్య పసిఫిక్ మహాసముద్ర జలాల ఉష్ణోగ్రతలు 3.5డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. ఫలితంగా ఏర్పడిన సూపర్ ఎల్‌నినో కారణంగా ప్రపంచ దేశాల్లో కరవు విలయ తాండవం చేసింది. పంటలు పండకపోవడం తో తినడానికి తిండి లేక, తాగునీళ్లు అసలే లేక అప్పటి ప్రపంచ జనాభాలో 4శాతం మంది మృత్యువాతపడ్డారు. భారత్‌లో ఈ సంఖ్య 96లక్షలపైనే. భారత్‌లో ముఖ్యంగా దక్షి ణాదిన బాంబే, మైసూరు, మద్రాస్, హైదరాబాద్ ప్రావి న్స్‌లలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు తలెత్తి పంటలు పండలేదు. దీంతో లక్షలాది మంది రైతులు,నేత కార్మికులు కూలిపనుల కోసం ఉత్తరాదికి వలస వెళ్లారు. దక్షి ణాదిలో జనాభా తగ్గడానికి ఈ కరవు కూడా ఒక కారణమైందని అంటారు. భారత్‌లో తలెత్తిన ఈ కరవును గ్రేట్ ఫెమైన్ (మహా కరవు) లేదా మద్రాస్ ఫెమైన్ (మద్రాస్ కరవు)గా పిలుస్తారు. ఈ కరవు కారణంగా చైనా, బ్రెజిల్, ఆఫ్రికా దేశాలపైనా తీవ్ర ప్రభావం పడింది. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. ఇప్పటికీ ఆఫ్రికా దేశాలపై ఈ కరవు ప్రభావం ఉన్నదని నిపుణులు చెప్తారు. భారత్ వంటి ఆసియా దేశాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదవుతుంది. ఫలితంగా కరవు పరిస్థితులు రావొచ్చు. మరికొన్ని తీరప్రాంత దేశాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించొచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఎండలు మండిపోతాయి. అలాగే ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు నమోదు చేస్తాయి. ఇక పసిఫిక్, హవాయి, పశ్చిమాసియా దేశాల్లో తుఫాన్లు తీవ్రమవుతాయి. అట్లాంటిక్ మహాసముద్రంలో తుఫాన్ల ఉధృతి తగ్గుతుంది. భూమిపైనే అత్యంత వేడి దేశంగా భారత్ రికార్డులకెక్కింది.ప్రస్తుతం ప్రపంచంలోని అత్యంత వేడినగరాల జాబితాలోఉన్న 100నగరాలు భారత్‌కు చెందినవే కావడం గమనార్హం.ఇలాంటి సమయంలో నైరుతి రుతుపవనాలు ఐదు రోజుల ముందుగానే కేరళను చేరుతాయన్న ఐఎండీ అంచనాలు రైతులకు కాస్తఊరటనిచ్చాయి. సూపర్ ఎల్‌నినో ఏర్పడే పరిస్థితులు అంతకంతకూ పెరుగుతుండటం అన్నదాతలకు కొత్త భయాలను తీసుకొస్తున్నది. ఖరీఫ్‌లోనే దేశంలో 6570శాతం వరకూ ధాన్యం దిగుబడివచ్చే అవకాశం ఉన్నది. సూపర్‌ఎల్‌నినో కారణంగా ఈసారి ఖరీఫ్‌లో సరైన వర్షాలు పడకపోవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. సరైనవానలు లేకధాన్యం దిగుబడి గణనీయంగా పడిపోయి దేశంలో ఆహారసంక్షోభం కూడా తలెత్తే ప్రమాదం ఉన్నదని మరికొందరు అంచనావేస్తున్నారు.దిగుబడి రాకపోవడంతో గ్రామీణప్రాంతాల్లోని ప్రజలు ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదంఉన్నదని చెప్తున్నారు. ఇప్పటికే యుద్ధాలతో పతనమైన

# ప్రజావాక్కు



## పర్యావరణ రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది

పరిశ్రమల నుంచి వెలువడే పొగ,కొండల్లా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, భానుడి భగభగలు,అకాల వర్షాలు, ఎల్‌నినో ప్రభావం,భూగోళం ఎంతటి ప్రమాదకర పరిస్థితులలోకిజారిపోయిందో తెలియజేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గాలి,నీరు, భూమి, జీవజాతులను కాపాడుకోవలసినవసరముంది. ఇవిభూమిపై సమతుల్యతను కాపాడటానికి,ప్రకృతి వనరులను భవిష్యత్ తరాల కోసం నిల్వఉంచడానికి, కాలుష్యాన్ని నివారించడానికి ఉపయోగపడతాయి.వీటిని కాపాడుకోవాలంటే మొక్కలు నాటడం అడవులను కాపాడుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పునర్వినియోగ వస్తువులను వాడటం, నీటిని వృథా చేయకుండా ఆదా చేయడం, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనవనరులను ప్రోత్సహించడం, చెత్తను తగ్గించి, సక్రమంగా పారవేయడం,పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవడం వల్ల అంటువ్యాధులు సోకవు,స్వచ్ఛ ప్రాణవాయువు, చల్లదనమిచ్చే వర్షాలతో జీవరాశికి ముప్పుండదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## ఆశకు అంతం లేదా?

ఆశకు అంతం లేదంటారు. దురాశ దుఃఖానికి చేటు అని చదువుకున్నాం. మానవుడి జీవితంలో కీలకపాత్ర పోషించే ఆశమితంగా ఉండాలంటారు. మనిషి ఉల్లాసంగా ఉండడానికి ఆశ కూడా ఒక కారణం అంటే అతిశయోక్తి కాదు. మంచికన్న మనీకే మక్కువ ఎక్కువ. తల్లిదండ్రుల బిడ్డల మీద ఆశ మరింత కష్టపడడానికి పునాది వేస్తుంది. ఆశ నిత్యనూతనం, అందమైన నిరీక్షణ, ప్రతి మనిషి జీవితంలో ఆశ నిరాశలమధ్య ఊగిసలాడే సందర్భాలనేకం. శ్రమ,పట్టుదలతో కోరికలను సొంతం చేసుకోవచ్చు.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

## ఫెర్టిలైజర్ ఫర్ సేల్ యాప్ వాడాలి

రాష్ట్ర రైతులు వ్యవసాయానికి వాడుకునే ఎరువుల బస్తాలు ఇక నుండి ఫెర్టిలైజర్ ఫర్ సేల్ యాప్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలనిఅధికారులు సూచిస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు మరింత అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ఈ యాప్ ద్వారా బ్లాక్‌లో అమ్మకాలు,డీలర్ల మధ్య సమన్వయం, రైతులకు వీలైన సమయంలో ఎరువులు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## అప్రమత్తత

కూరగాయలు తాజాగా, శుభ్రంగా కనిపిస్తే చాలు అని మనం వెంటనే కొనేస్తుంటాం. అయితే కొందరు వ్యాపారులు కూరగాయలు తాజాగా కనిపించేందుకు రసాయనాలతో కడుగుతున్న సందర్భాలు ఉన్నాయి. విషయం తెలియక వాటిని కొనుగోలు చేసి మనమే ఇంటికి తెచ్చుకుంటున్నాం. అందుకే కూరగాయలు కొనేటప్పుడు వాటిసహజమైన రంగు, తాజాదనాన్ని గమనించడం అవసరం. వ్యాపారులు కూడా కేవలం లాభాపేక్షతో కాకుండా ప్రజలఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన, సహజమైన కూరగాయలను అందించాలి. ప్రజలకు మంచి ఆహారం అందించడం ప్రతి వ్యాపారి సామాజిక బాధ్యతగా భావించాలి.మనం కూడా కూరగాయలను ఇంటికి తెచ్చిన తర్వాత శుభ్రమైన నీటితో బాగా కడిగి ఉపయోగించాలి. వ్యాపారులు బాధ్యతగా, ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యకరమైన ఆహారం ప్రతి కుటుంబానికి అందుతుంది. ఆరోగ్యమే మన నిజమైన సంపద.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## అవయవదానంపై అవగాహన అవసరం

అవయవదానం గురించి సమాజంలో అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసిన అవయవాలతో గరిష్ఠంగా ఎనిమిది మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. కణజాల దానం కూడా పలువురికి కొత్త జీవితాన్ని అందించగలదు.అయినప్పటికీ అవయవదానంపై ఉన్న అపోహలు, అనవసర భయాలు, అపార్థాలు దాతలసంఖ్య పెరగడానికి అడ్డంకిగామారుతున్నాయి. మూత్రపిండాలు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్, పేగులు, ఎముకలు, ఎముక మజ్జ, చర్మం, కళ్ల కార్నియా వంటి అవయవాలు, కణజాలాలను అవసరమైన వారికి మార్పిడి చేయడం ద్వారా వారి జీవితాలను పొడిగించవచ్చు. జీవించి ఉన్న వ్యక్తి కూడా వైద్యపరమైన నిబంధనలకు అనుగుణంగా ఒక మూత్రపిండం లేదా కాలేయం, ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్, పేగుల్లో కొంత భాగాన్ని దానం చేయగలడు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పలుకుబడితో దౌర్జన్యాలు

స్థానిక ప్రజా ప్రతినిధులు సర్పంచ్ కుటుంబ సభ్యులు వివిధ గొడవలతో దాడులు దౌర్జన్యాలు గ్రామాలలో అలజడులు సృష్టిస్తున్నారు. ప్రజాప్రతినిధుల పలుకుబడితో అధికారులను ఇబ్బంది పెడుతున్నారు. ఎక్కువగా గొడవలు చేస్తున్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారు.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 4 రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్



## చెన్నైని హౌరాతో కలిపే 410 కి.మీ. రైలు మార్గం

### ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.9,450 కోట్లు

### ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్‌లో

### 3, 4 రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం

### బీహార్‌లో రూ.3,590 కోట్ల ఎన్‌హెచ్ ప్రాజెక్టుకు ఓకే

### కేబినెట్ వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** రైలు సామర్థ్యాన్ని విస్తరించడం, రహదారి అనుసంధానాన్ని మెరుగు పరచడం లక్ష్యంగా, ఐదు రాష్ట్రాల్లో రూ.13,041 కోట్లకు పైగా విలువైన రైల్వే, రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. చెన్నైని హౌరాతో కలిపే రూ.9,450 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులతో పాటు, బీహార్‌లోని జాతీయ రహదారి-22లోని ముజఫర్‌పూర్ - సీతామర్హి - సోన్‌బర్సా విభాగాన్ని రూ.3,590.73 కోట్లతో నాలుగు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులన్నింటికీ కలిపి సుమారు రూ.13,041 కోట్ల పెట్టుబడి అవసరమని కేంద్ర రైల్వే, ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. "దేశంలో సరుకు రవాణాకు డిమాండ్ యేటా కనీసం 10శాతం పెరుగుతోంది, దీనివల్ల ట్రక్కులు, రైళ్లు, ఓడలు, విమాన మార్గాలలో వృద్ధి చోటుచేసుకుంటుంద్ని అని వివరించారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాలను కవర్ చేసే ఈ నాలుగు రైల్వే ప్రాజెక్టులు, ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌కు సుమారు 410 కిలోమీటర్లు అదనంగా చేర్చనున్నాయి. ఇవి 2030-31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టులలో ఖరగ్‌పూర్, భద్రక్ (రాణితల్) మధ్య 173 కిలోమీటర్ల నాలుగో లైన్, భద్రక్, హరిదాస్‌పూర్ మధ్య 75 కిలోమీటర్ల నాలుగో లైన్, గుమ్మిడిపూండి, గూడూరు మధ్య 90 కిలోమీటర్ల మూడో, నాలుగో లైన్లు ఉన్నాయి. నాలుగవ ప్రాజెక్టులో భాగంగా ఒడిశాలోని 72 కిలోమీటర్ల కటక్- పారాదీప్ (బడబంధ) మార్గంలో మూడవ, నాల్గవ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకారం, ఈ సామర్థ్య విస్తరణ వల్ల సంవత్సరానికి సుమారు 76 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా ఏర్పడుతుందని అంచనా. ఈ మార్గాలను బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్స్, కంటైనర్లు, ఆహార ధాన్యాల రవాణాకు ఉపయోగిస్తారు. క్యాబినెట్ ప్రకటన ప్రకారం, ఈ విస్తరణ వల్ల సుమారు 13 కోట్ల లీటర్ల చమురు వినియోగం, దాదాపు 65 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని కూడా అంచనా.

**బీహార్‌కు రూ. 3,591 కోట్ల హైవే ప్రాజెక్ట్:** ఇదిలా ఉండగా, బీహార్‌లోని ఎన్‌హెచ్22లో 82.58 కిలోమీటర్ల ముజఫర్‌పూర్- సీతామర్హి- సోన్‌బర్సా విభాగాన్ని రూ. 3,590.73 కోట్ల మూలధన వ్యయంతో నాలుగు లేన్లుగా విస్తరించడానికి సిసిఇఎ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఎఎం) కింద అభివృద్ధి చేయబడుతుంది. తూర్పు- పశ్చిమ కారిడార్‌లో భాగమైన ఎన్‌హెచ్27కు అనుసంధానమైన సోన్‌బర్సా వద్ద ఉన్న భారత్- నేపాల్ సరిహద్దు, ముజఫర్‌పూర్ మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. ఈ ప్రాజెక్టులో బాగమతి నదిపై 340 మీటర్ల వంతెనతో సహా ఏడు ప్రధాన వంతెనలు, మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, రెండు ఫ్లైఓవర్‌లు ఉన్నాయి.



## ఎన్టీయేలో ప్రక్షాళన.. 600 మంది నిపుణులు తొలగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో ప్రక్షాళన చేపట్టారు. సుమారు 600 మంది సబ్జెక్ట్ నిపుణులను తొలగించారు. వీరి స్థానంలో బోర్డులోకి కొత్త నిపుణులను నియమిస్తున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదేశాల ప్రకారం ఈ మార్పులు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్టీఏ రివ్యూ మీటింగ్‌లో మంత్రి జోషి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు కావాల్సిన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాల తయారీలో నాలుగు అంచెల విధానాన్ని అమలు చేయనున్నట్లు ఎన్టీఏ డైరెక్టర్ మంత్రి జోషికి వివరించారు. భద్రతను పెంచి, లోపాలను తగ్గించనున్నట్లు తెలిపారు. రాబోయే మూడు వారాల్లోగా సుమారు 25 మంది అధికారులను ఎన్టీఏలోకి తీసుకోనున్నట్లు డైరెక్టర్ జనరల్ చెప్పారు. ఎన్టీఏ ఆఫీసులను కొత్త ప్రదేశాలకు మార్చనున్నారు. సీఐఎస్ఎఫ్ దళాలను మోహరించే రీతిలో ఆఫీసులను ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల జరిగిన నీట్ యూజీ పేపర్ పరీక్ష లీక్, రద్దు ఘటనల నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి, ఎన్టీఏ డైరెక్టర్‌తో మంత్రి జోషి సమావేశం అయ్యారు. ప్రస్తుతం ఎన్టీఏ నుంచి 50 మంది సిబ్బందిని తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తగా 10 ప్రొఫెషనల్ లీడర్‌షిప్ పొజిషన్స్ ప్రకటించారు. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూర్టీ ఆఫీసర్, జనరల్ మేనేజర్ టెస్ట్ సెక్యూర్టీ, ఆర్ అండ్ డీ జనరల్ మేనర్ పోస్టులకు రిక్రూట్మెంట్ చేస్తున్నారు. సైబర్ సెక్యూర్టీ, సైకోమెట్రిక్స్, క్వశ్చన్ పేపర్ డిజైన్ అంశాలపై ఫోకస్ పెట్టినట్లు మంత్రికి చెప్పారు. కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్‌కు సంబంధించిన వ్యవస్థను సమూలంగా మార్చాలని మంత్రి ఆదేశించారు.




## నీట్ నిర్వహణలో సమగ్ర సంస్కరణలు అవసరం

### విచారణ ప్రారంభించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టిఎలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీం కోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టిఎలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.



## జమ్ముకాశ్మీర్ భారత్‌లో అంతర్భాగం

### అమెరికా రాయబారి సెర్గియోగోర్

**శ్రీనగర్, ఆగస్టు 19:** జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతోసంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూ కశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికారాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు.

## బలూచిస్థాన్‌లో పాక్ దుశ్చర్యలపై జోక్యంచేసుకోవాలి

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు బలూచ్ అధ్యక్షుడి లేఖ



**క్వెట్టా, ఆగస్టు 19:** బలూచిస్థాన్లో పాకిస్థాన్ సైన్యం ఇటీవల జరిపిన వైమానిక దాడుల ఘటన తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ దాడుల్లో 30 మందికి పైగా పౌరులు మరణించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బలోచ్ అమెరికన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారా చంద్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేఖ రాశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. పాకిస్థాన్ దుశ్చర్యలపై అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు ఆగస్టు 12వ తేదీ తెల్లవారుజామున సురబ్ జిల్లాలోని గిదర్ ప్రాంతంలో నివాస గృహాలపై పాకిస్థాన్ వైమానిక దళం విచక్షణారహితంగా బాంబుల వర్షం కురిపించిందని, ఈ ఘటనలో మహిళలు, చిన్నారులతో సహా అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, భారీగా ఆస్తి నష్టం జరిగిందని బలోచ్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తారా చంద్ రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ తీవ్రమైన ఆరోపణలపై మీ ప్రభుత్వం విచారణ జరపాలి. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన విమానాలు, ఆయుధాలు, డ్రోన్లు, టెక్నాలజీ లేదా ఇతర సైనిక పరికరాలు ఏమైనా ఉపయోగించారా అనే విషయాన్ని నిర్ధారించాలి. ఒకవేళ అమెరికా సరఫరా చేసిన ఆయుధాలను దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు లభిస్తే, పాకిస్థాన్కు అందిస్తున్న సైనిక సహాయంపై సమీక్ష జరపాలి" అని ఆయన కోరారు. అంతే కాకుండా అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించిన ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తునకు అమెరికా మద్దతు ఇవ్వాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని తారా చంద్ తన లేఖలో విజ్ఞప్తి చేశారు. "అధ్యక్షా ప్రపంచంలో ఏ చిన్నారి ప్రాణమైనా ఎంత విలువైందో, బలోచ్ చిన్నారి ప్రాణం కూడా అంతే విలువైంది. సాక్ష్యాలను ముందుగానే నిర్ధారించాలని మేము అమెరికాను కోరడం లేదు. వాస్తవాలను నిగ్గు తేల్చి, పౌరులను రక్షించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే కోరుతున్నాం" అని పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ ఆరోపణలను పాకిస్థాన్ మీడియా విభాగం ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్పీఆర్) గట్టిగా ఖండించింది. ఇది వైమానిక దాడి కాదని, ఓ ఉగ్రవాదసంస్థకు చెందినవాహనంలో అమర్చిన శక్తిమంత మైన బాంబు అనుకోకుండా పేలిపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని వివరణ ఇచ్చింది.

## పూర్వవైభవం కోసం తెరపైకి మళ్లీ పాతఫార్ములా

### బిఎస్‌పి అధినేత్రి వ్యూహాల్లో మార్పులు

**లక్నో, ఆగస్టు 19:** ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళితబ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్‌చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధిం చిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు. దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు.

## జార్ఖండ్‌లో నిరసనల ఆందోళన రెండునెలలు వాయిదా

### డిమాండ్లు పరిష్కరించనిపక్షంలో మరింత ఉధృతంచేస్తాం..

**రాంచి, ఆగస్టు 19:** జార్ఖండ్‌లో పరీక్షల వివాదం రాంచీ: టిడిపిఎల్‌కు సంబంధం ఉన్న 22 జెపిఎస్‌సి, జెఎస్ఎస్‌సి పరీక్షలను రద్దు చేస్తూ, మరో 23 పరీక్షలపై సిఐడీ దర్యాప్తునకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అర్ధరాత్రి నోటిఫికేషన్ జారీ చేసిన కొన్ని గంటల్లోనే పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఆందోళన చేస్తున్న జెపిఎస్‌సి,జెఎస్ఎస్‌సి రిఫార్మ్ మంచ్ తమ నిరసనను రెండు నెలల పాటు వాయిదా వేసింది.గత 26 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మంచ్ బుధవారం ప్రకటించింది. తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చేందుకు ప్రభుత్వానికి రెండు నెలల సమయం ఇస్తున్నట్లు మంచ్ నేత రవీంద్ర పాస్వాన్ తెలిపారు.రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థులు మాట్లాడుతూ తమ పోరాటాన్ని, పరీక్షల సంస్కరణల డిమాండ్‌ను ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వం గుర్తించాల్సి వచ్చిందన్నారు. పలు పరీక్షలను రద్దు చేయడం జార్ఖండ్ యువత 26 రోజులుగా సాగించిన పోరాటం ఫలితమేనని పేర్కొన్నారు.రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వం తీసుకునే చర్యలను నిశితంగా పరిశీలిస్తామని మంచ్ తెలిపింది. ఈ వ్యవధిలో తమ డిమాండ్లన్నింటిపై స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత భారీ స్థాయిలో పునఃప్రారంభిస్తామని రవీంద్ర పాస్వాన్ హెచ్చరించారు.ప్రభుత్వం 22 పరీక్షలను రద్దు చేసిందని విద్యార్థులు తెలిపారు. తమడిమాండ్లన్నీ ఇంకా పూర్తిగా నెరవేరలేదని స్పష్టం చేశారు. పిజిటి, మున్సిపల్ సర్వీసెస్, ఎక్సైజ్ కానిస్టేబుల్, సెకండరీ స్కూల్ టీచర్ (మాధ్యమిక్ ఆచార్య) వంటి మరికొన్ని పరీక్షలను కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ ఇంకా రద్దు చేయని పరీక్షలను కూడా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆందోళన సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దీపికా పాండే సింగ్, డాక్టర్ ఇర్ఫాన్ అన్సారీ నిరసన స్థలాన్ని సందర్శించారని విద్యార్థులు తెలిపారు. 'ఎగ్జామ్ మాఫియాపై చర్యలు తీసుకుంటామని, పరీక్షల్లో అక్రమాలను నిర్మూలించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి ఇర్ఫాన్ అన్సారీ హామీ ఇచ్చి రెండు నెలల సమయం కోరినట్లు చెప్పారు.మంత్రి విజ్ఞప్తి, ప్రభుత్వం ఇప్పటికే పలు డిమాండ్లపై తీసుకున్న చర్యలను పరిగణనలోకి తీసుకుని ఆందోళనను రెండు నెలల పాటు నిలిపివేయాలని రిఫార్మ్ మంచ్ నిర్ణయించింది. ఈ వ్యవధిలో ప్రభుత్వం తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని విద్యార్థులు కోరారు.రెండు నెలల తర్వాత కూడా ప్రభుత్వం తమ ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదని, డిమాండ్లపై ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని భావిస్తే ఆందోళనను తిరిగి ప్రారంభిస్తామని హెచ్చరించారు.

## మధ్యాహ్నభోజనంలో ఉప్పుకు బదులు సర్ఫ్‌పౌడర్!

**పాట్నా, ఆగస్టు 19:** మధ్యాహ్న భోజనంలో ఉప్పునకు బదులు సర్ఫ్ పౌడర్‌ను వంటవాడు కలపడంతో ఆ భోజనం తిన్న తర్వాత 40మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బీహార్‌లోని నలంద జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం మధ్యాహ్నం పరాసిలోని మిడిల్ స్కూల్‌కు సోయాబీన్ రైస్‌తో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ఒక ఎన్జీవో సంస్థ సరఫరా చేసింది. కొంతమంది విద్యార్థులు భోజనం చేసిన తర్వాత ఆహారంలో ఉప్పు తక్కువగా ఉన్నదని ఫిర్యాదు చేశారు. కిచెన్ రూమ్‌లో ఉప్పు, డిటర్జెంట్ పౌడర్ డబ్బాలు ఒకేచోట ఉండటంతో వంట వ్యక్తి పొరపాటుపడ్డాడు. సాల్ట్‌కు బదులుగా సర్ఫ్ పౌడర్‌ను ఆ ఆహారంలో కలిపాడు. ఆ భోజనం తిన్న తర్వాత 36మంది బాలికలు కళ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో పాటు వాంతులు చేసుకున్నారు. స్కూల్‌లో ప్రాథమిక చికిత్స తర్వాత ఆ విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నదని డాక్టర్లు తెలిపారు. మరోవైపు బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రవణ్ కుమార్ ఆ ఆసుపత్రిని సందర్శించారు. ప్రభావిత విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని మీడియాతో అన్నారు.

## ఇరాన్ పట్టు తప్పుతున్న హార్ముజ్!

**టెహ్రాన్, ఆగస్టు 19:** ప్రపంచ ఇంధన రవాణాకు గుండెకాయలా ఉన్న హార్మూజ్ జలసంధి ఇప్పుడు మరోసారి మూడు దేశాలకు కేంద్ర బిందువు అయింది. ఈ కీలక సముద్రమార్గంపై ఇరాన్ ఆధిపత్యం క్రమంగాతగ్గుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికా నౌకాదళం కొనసాగిస్తున్నదిగ్బంధం, ప్రత్యామ్నాయ మార్గాల్లో పెరుగుతున్న నౌకల రాకపోకలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి. దీంతో యుద్ధం మొదలైనతర్వాత తొలిసారిగా హార్మూజ్‌పై ఇరాన్ పట్టు బలహీనపడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

**ట్రాఫిక్ దారి మారింది**

సముద్ర నౌకల కదలికలను పర్యవేక్షించే మెరైన్‌ట్రాఫిక్ గణాంకాల ప్రకారం గత వారం హార్మూజ్ జలసంధిని కనీసం 95 నౌకలు దాటాయి. అంతకుముందు వారంలో ఈ సంఖ్య 118గా ఉంది. అయితే నౌకలు ఎంచుకుంటున్న మార్గంలో కీలకమైన మార్పు కనిపించింది. గత రెండు వారాల్లో హార్మూజ్ దాటిన నౌకల్లో దాదాపు 80 శాతం ఒమన్ వైపు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నాయి. ఈ మార్గాన్ని ఐక్యరాజ్యసమితి అనుమతించింది. అయితే దీన్ని ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇరాన్ హెచ్చరికలను పట్టించుకోకుండా అమెరికా రక్షణపై నమ్మకంతో నౌకలు ఈ మార్గంలో సాగుతున్నాయి. ఇరాన్ సూచించిన మార్గాన్ని నౌకలు ఎంచుకోకపోవడంతో ఆ దేశానికి మరో దెబ్బ తగిలింది. జలసంధి మీదుగా వెళ్లే నౌకల నుంచి టోల్ వసూలు చేసే అవకాశం తగ్గింది. మధ్యప్రాచ్య దేశాలు కూడా ఈ విధానాన్ని అంగీకరించేందుకు ఆసక్తి చూపడంలేదు. సౌదీ అరేబియా, కువైట్, యూఏఈ వంటి చమురు ఉత్పత్తి దేశాలు భారీ చమురునౌకలను హార్మూజ్ మీదుగా పంపిస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్ దాటిన తర్వాత అక్కడి నుంచి ఇతర నౌకలకు చమురును బదిలీ చేస్తున్నాయి. ఇరాన్ దాడులను తప్పించుకునేందుకు కొన్ని భారీ నౌకలు తమ ట్రాన్స్‌పాండర్లను ఆపివేస్తున్నాయి. దీంతో వాటి కదలికలను సాధారణ ట్రాకింగ్ వ్యవ స్థలు కూడా గుర్తించలేకపోతున్నాయి. ఈ రహస్య రాకపోకలను డార్క్ షిప్పింగ్‌గా పిలుస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్మూజ్ జలసంధికి సంబంధించి కీలక ప్రకటన చేశారు. జలసంధిలో ఉంచిన సముద్రపు మైన్లను తొలగించామని తెలిపారు. నౌకాదళ దిగ్బంధం కొనసాగుతోందని స్పష్టం చేశారు. హార్మూజ్ జలసంధి నుంచి సాధారణంగా ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో దాదాపు ఐదో వంతు సాగుతుంది.

# సంక్షిప్త వార్తలు

## పుస్తక రూపంలో సోనియా ఆత్మకథ..నవంబరు 10న విడుదల




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ తన ఆత్మకథ(జీవిత చరిత్ర)ను పుస్తక రూపంలో పాఠకుల ముందుకు తీసుకొస్తున్నారు. బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్ పేరుతో ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల కానున్నట్టు అంతర్జాతీయ ప్రచురణ సంస్థ ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ (పెంగ్విన్ ర్యాండమ్ హౌస్) ప్రకటించింది. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ చాలా మందికి తెలుసు. చదువుకునే రోజుల్లో రాజీవ్‌తో ప్రేమాణం, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో సోనియా పంచుకోబోతున్నారు.

## ఇమ్రాన్‌ను కలుసుకున్న సోదరీమణులు..



**రావల్పిండి, ఆగస్టు 19:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పిటిఐ అధినేత ఇమ్రాన్ ఖాన్ రావల్పిండిలోని అడియాల జైలులో తన భార్య బుష్రా బీబీ, సోదరి నొరీన్ నియాజీలతో భేటీ అయ్యారు. పాక్ సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాల మేరకు దాదాపు తొమ్మిది నెలల తర్వాత మొదటిసారి వీరిద్దరూ జైల్లో ఇమ్రాన్‌తో ములాఖత్ సందర్భంగా కలిశారు. పాకిస్థాన్ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇమ్రాన్ ఖాన్‌ను ఆయన కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి కలిసేందుకు అనుమతినిస్తూ మంగళవారం ప్రభుత్వానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల నేపథ్యంలోనే జైలు అధికారులు ఈ భేటీకి ఏర్పాట్లు చేశారు.

## సిజెపి నిరసనలపై ఆదేశాలు వెనక్కి తీసుకున్న విజయ్ సర్కార్

**చెన్నై, ఆగస్టు 19:** తమిళనాడు సర్కారు యూటర్న్ తీసుకున్నది. ఆదేశాలు ఇచ్చి 24 గంటలు గడవకముందే వెనుకడుగు వేసింది. ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు, యువత నిరసన ప్రదర్శనల్లో పాల్గొనరాదు అని మంగళవారం తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సింథియా సెల్వి పి ఆ ఆదేశాలు జారీ చేశారు.ఆగస్టు 17వ తేదీన ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆందోళనల్లో పాల్గొనే విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ తన ఆదేశాల్లో పేర్కొన్నది.

## తమిళనాడు ఎమ్మెల్యేలకు కార్లు, నిర్వహణకోసం రూ.75 వేలు

**చెన్నై, ఆగస్టు 19:** తమిళనాడు సిఎం విజయ్ ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలకు భారీ బొనాంజా ప్రకటించారు. ప్రతి ఎమ్మెల్యేకు ఓ కారు, పెట్రోల్ అలెవన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సిఎం చెప్పారు. తమిళనాడులో మొత్తం 234 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పుడు వారందరికీ ప్రభుత్వం తరపున ఓ కారు అందనున్నది. దాని పెట్రోల్, మెయింటెనెన్స్ ఖర్చులు ప్రభుత్వమే ఇవ్వనున్నది. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలు నిత్యం ప్రయాణం చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వ వాహనం వల్ల పారదర్శక, అవినీతిలేని ప్రభుత్వాన్ని నడపవచ్చు అని అన్నారు.

## హోటల్‌లో అగ్నిప్రమాదం..చిన్నారిసహా 9 మంది మృతి

**కోల్‌కత్తా, ఆగస్టు 19:** కోల్‌కతాలో తాజాగా ఓ హోటల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఎసి పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

20-8Pg6exHMNWJQE:20-8Pg6exHMNWJQE.qxd 8/19/2026 11:53 PM Page 1






# 7 డిగ్రీ కాలేజీలకు కొత్త భవనాలు

- విశాఖ, రాయలసీమల్లోనూ భారీ జోనల్ గ్రంథాలయాల నిర్మాణం
- 175 నియోజకవర్గాల్లో లైబ్రరీలు
- ఆళ్లగడ్డ కాలేజీకి కొత్త భవనం, కడప లైబ్రరీ 9 నెలల్లో పూర్తి చేస్తాం
- అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుకు సన్నాహాలు

**విజయవాడ. ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇందులో భాగంగా సొంత భవనాలు లేని 37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించామని శాసనసభలో ప్రకటించారు. బుధవారం శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ప్రస్తుతం ఆ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 1038కి చేరిందని, కళాశాలకు అవసరమైన భూమి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రత్యేక పథకం కింద ఆళ్లగడ్డ కాలేజీకి కొత్త భవనం, ధ్వంసమైన ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అవసరమైన టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు ల్యాబ్స్, కంప్యూటర్లు, బెంచీలను ఎమ్మెల్యే కోటా నిధుల (శ4) కింద సమకూర్చుకోవాలని సూచించారు. ఒక్కో డిగ్రీ కళాశాల పూర్తిస్థాయిలో నిర్మించడానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చవుతుందని, దశలవారీగా అన్ని కాలేజీలకు మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

**గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి:** రాష్ట్రంలో గ్రంథాలయాల వ్యవస్థను బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని లోకేశ్ తెలిపారు. కడపలో గ్రంథాలయ నిర్మాణ పనులపై ఎమ్మెల్యే మాధవీ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, రాబోయే తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం గ్రంథాలయాలకు చెందాల్సిన సెస్సు నిధులను ట్రెజరీకి మళ్లించిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ నిధులను తిరిగి గ్రంథాలయ శాఖకు అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. మంగళగిరిలో కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీ విజయవంతమైందని, రాత్రి 8 గంటల తర్వాత కూడా 300 మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పూర్వ విద్యార్థులు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకరిస్తే గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయవచ్చని పిలుపునిచ్చారు.

**అమరావతి, విశాఖ, రాయలసీమల్లో భారీ లైబ్రరీలు:** అమరావతిలో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్, తెలుగు కల్చరల్ సెంటర్‌తో అనుసంధానించి దేశంలోనే అత్యుత్తమ సెంట్రల్ లైబ్రరీని నిర్మించనున్నట్లు లోకేశ్ ప్రకటించారు. త్వరలోనే దీని డిజైన్ ఖరారు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. దీనికి దీటుగా విశాఖపట్నంలోని ఆంధ్రాయూనివర్సిటీ కేంద్రంగా ఒక జోనల్ లైబ్రరీని, రాయలసీమ కేంద్రంగా మరో అత్యాధునిక జోనల్ లైబ్రరీని అన్ని హంగులతో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పుస్తక పఠనం పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతుందని, వారిని స్మార్ట్‌ఫోన్లు, ఐప్యాడ్‌లకు దూరం చేయడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.



అసెంబ్లీ సమావేశాల్లో నారా లోకేశ్

## వర్ల రామయ్యకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా నూతనంగా ఎన్నికైన టిడిపి సీనియర్ నేత వర్ల రామయ్యకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. మండలిలో ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన అనంతరం మంత్రి నారా లోకేష్‌ను అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల మంత్రి లోకేష్‌కు వర్ల రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ విజయాలు, వాయిస్ మండలిలో మరింత బలంగా వినపడేలా చూడాలని మంత్రి లోకేష్ కోరారు.



వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి లోకేష్

## వర్సిటీల్లో నాణ్యమైన విద్యే రాష్ట్ర భవిష్యత్తుకు పునాది

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 19 ప్రభాతవార్త :** రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, భవిష్యత్ నిర్మాణంలో ఉన్నత విద్యాసంస్థల పాత్ర అత్యంత కీలకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం జరిగిన రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టిన ప్రైవేట్ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లులు, ఉన్నత విద్యా నియంత్రణ అంశాలపై ఆయన మాట్లాడారు. కేవలం రోడ్లు, పోర్టులు, పరిశ్రమల వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందదని నాణ్యమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులే రాష్ట్ర భవిష్యత్తుకు నిజమైన చోదక శక్తులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన అయిన 'విజన్ 2047, ప్రధాని మోదీ 'వికసిత్ భారత్ 2047' సాకారం కావాలంటే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు కేవలం వ్యాపార సంస్థలుగా మారకుండా ఉండేందుకు పటిష్టమైన నిబంధనలు, ఫీజుల నియంత్రణ అవసరమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ బోధనా సిబ్బంది కేవలం దాదాపు 23 శాతం మాత్రమే ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో **నిబంధనలకు**



**విరుద్ధంగా నియామకాలు :** తన నియోజకవర్గ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో సరైన ఎడ్యుకేషన్ కమిటీ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమిస్తుండటం వల్ల విద్యా నాణ్యత దెబ్బతింటోందని సభ దృష్టికి తెచ్చారు.

**ఏపీని ఎడ్యుకేషన్ హాబ్‌గా మార్చాలి :** నాణ్యమైన విద్య కోసం మన విద్యార్థులు విదేశాలకు వెళ్లి ఏటా లక్షల కోట్ల రూపాయల సంపద బయటకు పోతోందని, అలాంటి ప్రపంచ స్థాయి ప్రమాణాలను మన రాష్ట్రంలోనే కల్పిస్తే విదేశీ విద్యార్థులు కూడా మన రాష్ట్రానికి వచ్చి చదువుకునే వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా సవరణ బిల్లులకు ఆయన తమ పూర్తి మద్దతును ప్రకటిస్తూ ప్రసంగాన్ని ముగించారు.

# మేయర్, మున్సిపల్ చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలకు అసెంబ్లీలో బిల్లు ఆమోదం

- మొత్తం శాసనసభలో మూడు కీలక బిల్లులకు ఆమోదం

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఇకపై నగర పంచాయతీ, పురపాలక, నగరపాలక సంస్థల ప్రెసిడెంట్ పోస్టులు ప్రత్యక్ష ఎన్నిక పద్ధతిన సాగనున్నాయి. ఇందుకు సంబంధించిన బిల్లును ఏపీ శాసనసభలో మంత్రి నారాయణ ప్రతిపాదించడంపై ప్రత్యక్ష ఎన్నిక వల్ల మేయర్లు, మున్సిపల్ ప్రెసిడెంట్లపై కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రభావం ఉండదు. నిర్ణయాలు కూడా చాలా వేగంగా తీసుకుంటారన్నారు. మేయర్, మున్సిపల్ ప్రెసిడెంట్లను ప్రత్యక్షంగా ఎన్నుకునేలా బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. బిల్లుపై మాట్లాడిన పలువురు ఎమ్మెల్యేలు పట్టణాలు, నగరాల్లో మంచి పాలన అందే అవకాశం ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 3 చట్ట సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ సందర్భంగా జరిగిన చర్చలో తెలుగు ప్రాధాన్యంపై పలువురు ఎమ్మెల్యేలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తగిన ప్రాధాన్యం ఇచ్చే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలని వారు కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధానం చెబుతూ ఈ అంశాలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకొని తాము మాతృభాషకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు 50 ఎకరాల భూమి ఉండాలన్న నిబంధనను సడలించినట్లు మంత్రి లోకేశ్ వెల్లడించారు. సిఆర్‌డిఎ పరిధి, విజయవాడ, విశాఖ, తిరుపతిలో పది ఎకరాలు, మిగిలిన చోట్ల 15 ఎకరాలుగా నిబంధనలు సడలించినట్లు చెప్పారు. శాసనసభలో ఉన్నత విద్య రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్ చట్టాన్ని కమిటీగా మార్పు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ, ఆర్థికపరమైన జీఐబీ రిజర్వేషన్ వ్యవహారంతో పాటు ప్రైవేటు నైపుణ్య వర్సిటీల స్థాపన, నియంత్రణ బిల్లులను మంత్రి ప్రవేశపెట్టారు. వీటిని సభ ఆమోదించింది. ఈ సందర్భంగా పుర, నగర పాలక ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్షంగా ఎన్నుకునే బిల్లుకు శాసనసభ ఆమోదించిన అనంతరం బిల్లుపై మాట్లాడిన పలువురు ఎమ్మెల్యేలు పట్టణాలు, నగరాల్లో మంచి పాలన అందే అవకాశం ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల మున్సిపల్ సంస్థల్లో ప్రజా సమస్యల పట్ల పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే విధంగా మేయర్లు మున్సిపల్ చైర్మన్లు వ్యవహరిస్తారని సానుకూలతను వ్యక్తం చేశారు. మూడు బిల్లులు సభలోని మొత్తం సభ్యుల ఆమోదాన్ని పొందాయి.



శాసనసభ లోపలి దృశ్యం

## స్టిల్ వెయిటింగ్ జగన్



నారా లోకేష్, జగన్

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు కొనసాగుతున్న నేపథ్యంలో, మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అంశంపై చర్చకు రావాలంటూ ఆయన సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై చర్చ కోసం మూడో రోజు కూడా తాను వేచి చూస్తున్నట్లు లోకేశ్ ఈ పోస్టులో పేర్కొన్నారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, మాజీ ముఖ్యమంత్రి అని గుర్తు చేసిన ఆయన, జగన్ కోసం వేచిన్నా, ఆయన సొంత గడ్డపైనే చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ మేరకు స్టిల్ వెయిటింగ్ (ఇంకా ఎదురుచూస్తున్నా) అనే ట్యాగ్‌ను తన పోస్టుకు జత చేశారు. లోకేశ్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది మామూలు ట్యాగింగ్ కాదంటూ నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు.

## ప్రజాస్వామ్య విలువలు పెంచేలా కృషిచేస్తా

- ఏపి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ టి. మాధవ్

**సచివాలయం,ఆగష్టు19,ప్రభాతవార్త :** రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా శాసన వ్యవస్థలో ప్రజాస్వామ్య విలువలు పెంచేలా కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావు తెలిపారు. డిప్యూటీ స్పీకర్‌గా వైఎసి ఆదివారంగా ఎన్నికైన తూమాటి మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు తెలిపారు. అనంతరం ఎల్ఓపి బొత్స సత్యనారాయణ వైకాప సభ్యులు డిప్యూటీ చైర్మన్ చైర్లో అలంకరింపచేశారు. అనంతరం డిప్యూటీ చైర్మన్ అధ్యక్షతన ప్రారంభమైన శాసనమండలిలో పలువురు సభ్యులు డిప్యూటీ చైర్మన్ గా ఎన్నికైన తూమాటి మాధవ్ ను ప్రశంసించారు. రాజ్యాంగంలో శాసన వ్యవస్థ చాలా బలమైందని అత్యంత విలువైందని కూడా డిప్యూటీ చైర్మన్ తెలిపారు. ఆ బాధ్యతను గుర్తెరిగి అందరూ సభ్యులను సమానంగా ఆదరించేలా కృషిచేస్తానన్నారు. పరిపాలన వ్యవస్థలో ప్రజా సమస్యలకు పెద్దపీట వేసి ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి సూచిస్తానని తెలిపారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడేలా నా వంతు కృషి చేస్తానని అధికార ప్రతిపక్ష సభ్యులు అందరి సహకారంతో సభ నిబంధనలను పాటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఓపి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అధికార పక్ష సభా సాంప్రదాయాలను మంటగలిపేలా ఈరోజు వ్యవహరించిందని విమర్శించారు. డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తిని అధికార, ప్రతిపక్ష సభ్యులు కలసి చైర్ వద్దకు తోడుకొని వెళ్ళడం శాసనమండలి సాంప్రదాయమని కనీసం చైర్ వరకు రాకపోగా శాసనమండలి నుంచి చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొనకుండా వెళ్ళిపోవడం దురదృష్టకరమని తెలిపారు.

### మెగా డిఎస్సీలో జరిగిన అవకతవకలపై

# మండలిలో చర్చించాలి

**సచివాలయం,ఆగష్టు 19,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 50వ శాసనమండలి మూడవ రోజు బుధవారం ఉదయం 10గంటలకు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అధ్యక్షతన ప్రారంభమైంది. మెగా డిఎస్సీ 2025లో జరిగిన అవకతవకలపై చర్చించాలని వైసీపీ ఎమ్మెల్సీలు డాక్టర్ చంద్రశేఖర్, కల్పలతా, ఎం.వి.రామచంద్రారెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి ప్రభుత్వ బిల్లులు ఆమోదం పొందిన తర్వాత ప్రశ్నోత్తరాల కార్యక్రమానికి అనుమతించారు. ప్రశ్నోత్తరాల సమయంలో డిఎస్సీ 2025లో జరిగిన అవకతవకలపై చర్చించాలని శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేస్తూ పోడియంను చుట్టుముట్టి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, డిఎస్సీపై సిబిఐ విచారణ జరపాలని నినాదాలు చేస్తూ వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. వైసీపీ ఎమ్మెల్సీల ఆందోళనతో మండలి సమావేశాన్ని కాసేపు వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించి వెళ్ళిపోయారు. వాయిదా అనంతరం శాసనమండలి సమావేశాలు ప్రారంభం. మిగిలిన ప్రశ్నలను డీమ్డ్ గా ప్రకటించిన మండలి చైర్మన్. వైసీపీ ఎమ్మెల్సీ అయిన తూమాటి మాధవరావును శాసనమండలి డిప్యూటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. అనంతరం తూమాటి మాధవరావును డిప్యూటీ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా ఎల్ఓపి బొత్స సత్యనారాయ ఇతోపాటు మిగిలిన వైసీపీ సభ్యులందరూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావు తనకు ఇంతటి ప్రాధాన్యత కలిగిన పదవి దక్కడంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపిన తర్వాత సభను కాసేపు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత మండలి చైర్మన్ వర్ల రామయ్యను నూతన మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. వర్ల రామయ్య నూతన ఎమ్మెల్సీ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మండలి చైర్మన్ సభను 20వ తేదికీ వాయిదా వేశారు.

# అవయవదాత కుటుంబాలకు రూ.లక్ష సాయం

- 5,920 మంది అవయవాల కోసం నిరీక్షణ
- కొత్త నిబంధనలతో అవయవదానానికి ఊతం,స్వాప్ దానర్థకు అవకాశం
- మంత్రి ప్రవేశపెట్టిన మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లుకు సభ ఆమోదం

**విజయవాడ.ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** జీవన్మృతుల ( బ్రెయిన్‌డెడ్ ) వ్యక్తుల అవయవదానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.10,000 నుంచి ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు2026పై బుధవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. అవయవదానం, ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులు, బిల్లులోని ముఖ్యాంశాల గురించి వివరించారు. ఒక బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి ఎనిమిది అవయవాలను సేకరించి అవసరమైన వారికి అందించవచ్చుని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 5,920 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వీరిలో దాదాపు 100 మంది గుండె, 3,000 మంది కిడ్నీ, 2,000 మంది లివర్ మార్పిడి కోసం నిరీక్షిస్తున్నారని మంత్రి వివరించారు. పాంక్రియాస్ మార్పిడి కోసం నలుగురు ఉన్నారని తెలిపారు. పుట్టిన నెల రోజుల వయసున్న శిశువుల నుంచి 90 ఏళ్ల వయసున్నవారి వరకు అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. పదేళ్లలోపు వయసున్న సుమారు 40 మంది పిల్లలు కూడా ఈ జాబితాలో ఉన్నారని వెల్లడించారు. అవయవదానంపై అపోహలను తొలగించే దిశగా ప్రభుత్వం అనేక అవగాహన



కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రజల్లో ప్రభావం చూపగల ప్రముఖులను కూడా భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు ద్వారా అవయవదానంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. అలాగే అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు శాసనసభ్యులు అవయవదానం ప్రాముఖ్యత గురించి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవన్మృతుల అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకొస్తే రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నామని, దాత పార్థివ దేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతున్నాయన్నారు. అలాగే దాతల కుటుంబాల ఆర్థిక నేపథ్యం ఇతర అంశాల ప్రాతిపదికన అర్హులైన వారు ఉంటే పొరుగు సేవలు లేదా ఒప్పంద విధానంలో ఉద్యోగాన్ని ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.10 వేల సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు స్పష్టం చేశారు. మూడు నుంచి తొమ్మిదికి అవయవ మార్పిడి కేంద్రాలు రాష్ట్రంలో ఉన్న ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాల సంఖ్యను మూడు నుంచి తొమ్మిదికి పెంచామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అవయవ మార్పిడి సేవలను విస్తరించడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని 12 టీచింగ్ ఆసుపత్రులను కూడా రాబోయే రోజుల్లో ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. కిడ్నీ, లివర్ వంటి అవయవాల మార్పిడిలో ప్రైవేటు ఆసుపత్రుల వాటా ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ రంగంలోనూ ఈ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగంలోని పద్మావతి ఆసుపత్రిలో గత ఏడాది 18 హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరిగినట్లు మంత్రి వెల్లడించారు. 100 మందికి పైగా దాతలు ముందుకొచ్చేలా కృషి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అవగాహన కార్యక్రమాల ఫలితంగా అవయవదాతల సంఖ్య పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2023లో 41 మంది దాతలు ముందుకు రాగా 126 అవయవ మార్పిడులు జరిగాయి. 2024లో 66 మంది దాతలు ముందుకు వచ్చి 210 అవయవ మార్పిడులు జరిగాయి. 2025లో 93 మంది దాతలు ముందుకు రాగా 300 అవయవ మార్పిడులు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటికే 74 మంది దాతలు ముందుకు వచ్చారని, 200కు పైగా అవయవ మార్పిడులు జరిగినట్లు మంత్రి తెలిపారు. ఏడాది ముగిసేలోగా 100 మందికి పైగా దాతలు, 400కు పైగా అవయవ మార్పిడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వం మేరకు ఈ రంగంలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.

## ఉన్నత విద్య సంస్కరణల్లో భాగంగానే

# రెగ్యులేటరీ కమిషన్ అమెండ్‌మెంట్ బిల్లు

- శాసన సభలో ఎపిహెచ్ఇఆర్ఎంసి అమెండ్ మెంట్ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి లోకేష్..

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఉన్నతవిద్యలో అనేక సంస్కరణలు ఈరోజు ప్రజా ప్రభుత్వం తీసుకువస్తోంది. అందులో భాగంగానే ది ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరీ కమిషన్ అమెండ్ మెంట్ బిల్ 2026 ను తెచ్చామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ...ఇది చాలా కీలకమైన బిల్లు, గతంలో ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరీ కమిషన్ యాక్ట్ అనేది ఉండేది. అది ఇప్పుడు కమిటీ కింద మార్చాల్సిన ఆవశ్యకతను సభ్యులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. గత సెషన్ లో ఉన్నత విద్య కమిషనర్ పాలనా సంబంధ సమస్యలు, అడ్మిషన్లపై చర్చించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి (అనేది కేవలం ఎగ్జామినేషన్స్ పై దృష్టి పెట్టడం, కరిక్యులమ్ బలోపేతం చేయడం, ఇండస్ట్రీ లింక్ ఎలా చేయాలనే దానిపై ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పుడు సవరణ తీసుకురావడానికి ప్రధాన కారణం గతంలో ఉన్న రెగ్యులేటరీ కమిషన్ రాజ్యాంగ పరిధులను దాటి వ్యవహరించింది. ఉన్నత విద్య కమిషనర్, ఉన్నత విద్యామండలికి సమాంతర వ్యవస్థగా తయారైంది. విధివిధానాలు స్పష్టంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. యూజిసి, ఏఐసిటీఇ నేషనల్ కౌన్సిల్స్, ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీలు చేయాల్సిన పనులను కూడా ఈ కమిషన్ చేయడం మొదలుపెట్టింది. దీనివల్ల పాలనాపరమైన గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రజా ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే. ఈ ఫీ రెగ్యులేటరీ కమిటీ ద్వారా ఎట్టి పరిస్థితుల్లో ఏ యూనివర్సిటీ, ఏ కాలేజీ ఎక్కడా ప్రాఫిట్ హియరింగ్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. అనేకమంది నిపుణులు కూడా నాకు చెప్పింది ఏంటంటే అందరికీ మీరు బేస్ ఫీ ఫిక్స్ చేస్తున్నారు బాగానే ఉంది, కానీ క్వాలిటీ ఎక్కడైతే బాగుందో అక్కడ మీరు ఎక్కువ ఫీ ఇవ్వండి. అప్పుడు మాకు కూడా ఇన్సెంటివ్ ఉంటుంది, రీసెర్చ్ కూడా చేశామని వాళ్లు చెప్పారు. అదేవిధంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రభుత్వ విధానం గనుక స్పీడ్ తోపాటు క్వాలిటీ లింక్ చేసి ఫీ ఇన్సెంటివైజేషన్, ఫీ ఫిక్సేషన్ చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నందున ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఇతర



రాష్ట్రాల్లో ఏం జరుగుతుందన్నది కూడా మేం అధ్యయనం చేశాం. మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు కూడా కేవలం ఒక కమిటీ ఏర్పాటుచేసి, ఆ కమిటీ ద్వారా ఈ వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నారు. ఈ అమెండ్ మెంట్ ద్వారా చాలా స్పష్టంగా కమిషన్ ని కమిటీగా మార్చుతున్నాం. వాళ్ల పరిధి కేవలం ఫీ రెగ్యులేషన్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ కమర్షియలైజేషన్ అనేది స్పష్టం చేశాం. ఫీజుకు సంబంధం లేని కార్యకలాపాలన్నింటినీ ఈ కమిటీ పరిధి నుంచి తీసి ఉన్నత విద్య కమిషనర్ కు ఇవ్వడం జరిగింది. గతంలో రిటైర్డ్ హైకోర్ట్ జస్టిస్ చైర్ పర్సన్ గా పెట్టాలని ఉంది, అది మేము కొనసాగిస్తున్నాం. ఎక్స్ అఫీషియో మెంబర్స్ ని ఏకంగా జేఎన్టియూ గానీ, మన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఉన్నత విద్య కమిషనర్ ని కౌన్సిల్ రిప్రజెంటేటివ్స్ గా ఇందులో పొందుపరిచాం. ప్రొసీజర్ మొత్తం మోడర్నైజ్ చేసి పారదర్శకమైన మెకానిజంతో ఫిక్స్ డ్ టైమ్ లైన్స్ పెట్టి ఒక డిజిటల్ రిపోర్టింగ్ ఏర్పాటుచేయడం ద్వారా లెజిస్లేటివ్ కి ఎకౌంటబిలిటీగా ఉంచే లక్ష్యంతో ఈ సవరణ బిల్లు తెస్తున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు.

శాసనసభలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి లోకేష్.. అమరావతి: కేంద్రంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో ఖిజన్ విశ్వాస్‌ఖి నినాదంలో భాగంగా నియంత్రణ సరళీకరణ, సులభతరం చేయడం అత్యవసరం, అందులో భాగంగానే "ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026" ను ప్రవేశపెడుతున్నట్లు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. నేడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం ప్రైవేటు రంగానికి, పరిశ్రమలకు మాత్రమే కాకుండా అన్ని రంగాలకు వర్తింపజేయాలని సిఎం స్పష్టంగా చెప్పారు. ఇందులో భాగంగా ఒక కమిటీని కూడా నియమించాం. ఆ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని శాఖల కార్యదర్శులను కలిసి సంప్రదింపులు జరిపింది. ప్రత్యేకంగా ఉన్నత విద్యా శాఖను కూడా కలిసి అనేక సూచనలు అందించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవడం అవసరం. అత్యంత ప్రాధాన్యత కలిగిన బిల్లు ఇది. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూసినట్లయితే ఉత్తరప్రదేశ్‌లో సుమారు 111 విశ్వవిద్యాలయాలు, గుజరాత్‌లో 100 విశ్వవిద్యాలయాలు, రాజస్థాన్‌లో 94 విశ్వవిద్యాలయాలు, కర్ణాటకలో 91 విశ్వవిద్యాలయాలు, తమిళనాడులో 65 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 56 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వాటిలో 22 ప్రభుత్వ, 14 ప్రైవేటు, 7 డీమ్డ్, 10 స్టేట్యుటరీ విశ్వవిద్యాలయాలు, 3 కేంద్ర విశ్వవిద్యాలయాలు. ఇవి కాకుండా ఎన్ఎస్ఇఆర్, ఐఐటీ.ఐఐఎం వంటి జాతీయ సంస్థలు కూడా 10 ఉన్నాయి. రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీలకు అనుబంధంగా 2602 కళాశాలలు ఉండగా, వాటిలో సుమారు 2369 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. గతంలో ప్రేవైటు వర్సిటీ స్థాపనకు కనీసం 50ఎకరాలు ఉండాలనే నిబంధన ఉండేది. కేంద్రప్రభుత్వం భూమిపై నిబంధనలు తొలగించిన నేపథ్యంలో మనం 50ఎకరాలను 10ఎకరాలకు తగ్గించాం. ఇది దిళిదీతి, గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తిస్తుంది. మిగిలిన ప్రాంతాలలో బ్రౌన్‌ఫీల్డ్, గ్రీన్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయాలకు 15 ఎకరాలు నిర్ణయించాం. కనీస పెట్టుబడిపై నిబంధనను తొలగించాం. ప్రతి దరఖాస్తును ప్రభుత్వం నియమించే నిపుణుల కమిటీ ద్వారా కేసుటుకేసు పై సమీక్షిస్తారు. బ్రౌన్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయంగా మార్చేందుకు యుజిసీమార్గదర్శకాల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశాం. గతంలో ప్రపంచంలోని టాప్ 100 విదేశీ విశ్వవిద్యాలయాలతో జాయింట్ డిగ్రీ ఉంటేనే విశ్వవిద్యాలయంగా మార్చాలన్న నిబంధనను తొలగించాం. కొత్తగా వచ్చే విదేశీ విశ్వవిద్యాలయాలు 3 నుండి 5 సంవత్సరాల ట్రాక్ రికార్డు చూసిన తర్వాతే జాయింట్ డిగ్రీకి ముందుకు వస్తాయి. మరో మహిళా వర్సిటీ రాబోతోంది.. ఈ బిల్లు ద్వారా రాష్ట్ర చరిత్రలో రెండవది అయిన "విష్ణు మహిళా విశ్వవిద్యాలయం" ఏర్పాటుకు వెసులుబాటు కల్పించాం. డీమ్డ్ విశ్వవిద్యాలయాలను అప్‌గ్రేడ్ చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా ప్రభుత్వ విధానం కనుక ఫాస్ట్ ట్రాక్ అప్రూవల్ ద్వారా మొత్తం ప్రక్రియను 60 రోజులలో పూర్తి చేసి, ఆన్‌లైన్ పారదర్శక విధానాన్ని తీసుకొచ్చాంమన్నారు.

# ఏ పి ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లుకు ఆమోదం

**విజయవాడ, ఆగస్టు19. ప్రభాతవార్తప్రతినిధి:** .ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు...బిల్లును ప్రవేశపెడుతూ మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాసఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, మరియు కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు..ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం 1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు, మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం థర్డ్‌పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు... ..ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం 2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు..ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం 2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు.

20-8pg7exHMNWJQE:20-8pg7exHMNWJQE.qxd 8/19/2026 11:46 PM Page 1



# స్థానిక పోరులో వైసిపి జెండా ఎగరాలి

- మరో యేడాదిలో పాదయాత్ర మొదలెడతా
- రాబోయే ఎన్నికల్లో వైసిపిదే విజయం
- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్



**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు. మనం చేసిన అభివృద్ధి పనుల క్రెడిట్ చోరీ తప్పించి ఆయన చేసిందేమీ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసిపి శ్రేణులు ఐక్యంగా పని చేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందన్నారు. అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అమాయక యువతులను చంపేస్తున్నారన్నారు. మనం చేస్తున్న ప్రతి ఉద్యమాన్ని వక్రీకరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించి భంగపడుతుందన్నారు. వైసిపికి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజల మధ్యకు వచ్చిన ప్రతిసారి ప్రభుత్వం భయంతో అరాచకాలు సృష్టిస్తుందన్నారు. దాడులకు పాల్పడుతున్న టిడిపి కార్యకర్తలను వదిలిపెట్టి మన పార్టీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు.



## సోషల్‌మీడియాలో విషప్రచారాలపై వైసిపి నేతల ఫిర్యాదు

**తిరుపతి, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఎఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ వైసిపి నేతలను అవమానకరంగా చూపించేలా రూపొందించిన వీడియోపై ఆ పార్టీ సామాజిక మాధ్యమం నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతినగరంలోని తూర్పు, అలిపిరి, పడమర, యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు సమర్పించారు. వీడియోను రూపొందించిన, ఎడిట్ చేసి సామాజిక మాధ్యమంలో వైరల్ చేసిన వ్యక్తులను సైబర్ దర్యాప్తు ద్వారా గుర్తించి, డిజిటల్ ఆధారాలను భద్రపరిచి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు ఇరగం అనిల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామిరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ధామా షణ్ముగం, సామాజిక మాధ్యమం నగర అధ్యక్షుడు బచ్చు ప్రకాష్, వైసిపి నాయకులు మల్లం రవికుమార్‌రెడ్డి, స్వరూప్, కోటి, దేరంగుల బాలాజీ, రమణారెడ్డి, సాయి రాకేష్, చరణ్ తదితరులు ఫిర్యాదులు సమర్పించారు.

### ప్రజా పక్షంగా ప్రజల గొంతు వినిపించేందుకు

# కొత్త పార్టీ పెడుతున్నా

- తిరుమలలో విజయసాయి రెడ్డి కీలక ప్రకటన



**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల తరపున ప్రజల కోసం, ప్రజా పక్షంగా ప్రజల గొంతు వినిపించేందుకు నూతన పార్టీని ఏర్పాటు చేస్తున్నానని మాజీ ఎంపి వేణుంబాకం విజయసాయిరెడ్డి కీలక ప్రకటన చేశారు. పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, భవిష్యత్ కార్యాచరణను ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన గొంతుకగా నిలుస్తానని, సరికొత్త రాజకీయానికి శ్రీకారం చుడతానని విజయసాయి రెడ్డి తన రాజకీయ పునః ప్రవేశంపై బుధవారం ఉదయం తిరుమలలో సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంతంగా కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు అధికారిక ప్రకటన వెలువడించడంతో రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. తన కొత్త పార్టీకి దేవదేవుడు తిరుమల శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి వివరించారు. దేశంలో ఎల్‌నినో ప్రభావం లేకుండా సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని కూడా స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శన సమయంలో ఆయన కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఆలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇటీవలే ఆయన రాజకీయాల్లోకి తిరిగి వస్తానని, సొంతంగా ఒక మీడియా సంస్థను కూడా ప్రారంభిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. తనది స్వతంత్ర భావజాలమని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయం తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా కూడా ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే సొంత జెండాతో రాష్ట్ర రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఖాయమని తెలిసిపోయింది.

## తిరుమల సమాచారం



### ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.15 లక్షలు విరాళం

**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు,ట్రస్ట్‌లకు దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ పి. శిల్పా, డాక్టర్ శ్రీధర్ రెడ్డి దంపతులు వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.15 లక్షలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరిని కలిసి చెక్కును అందజేశారు.

### పవిత్రతకు భంగం కలిగిస్తే చర్యలు

**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో పవిత్రతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వరాహస్వామి కార్ పార్కింగ్ ప్రాంతంలో బీడీ తాగిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమల పవిత్రత, భద్రత ప్రశాంత వాతావరణాన్ని పరిరక్షించేందుకు తిరుమలలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. తిరుమల వరాహ స్వామి కార్ పార్కింగ్ ప్రాంతంలో బహిరంగంగా బీడీ తాగుతున్న తమిళనాడు అరక్కోణం జిల్లా పాళనిపేటకు చెందిన ఆర్.సంతోష్(31)పై కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకుని చర్యలు





### తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు షురూ!

**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ ఏడాది అధికమాసం రావడంతో కలియుగ వైకుంఠవాసుడు ఏడుకొండల వేంకటేశ్వరునికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలను టిటిడి అధికారులు విజయవంతం చేయడం, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే దిశగా పనులు మొదలుపెట్టింది. ఇప్పటికే స్వామివారి పుష్కరిణి మూసివేసి అభివృద్ధి పనులు చేపడుతోంది. ఇంకా ఆలయ మాఢవీధుల్లో, ఆలయం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దడం, బారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు వంటి పనులు మొదలయ్యాయి. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్ని విభాగాలను ఉత్తేజపరిచి పర్యవేక్షిస్తున్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 23వ తేదీతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ధ్వజారోహణం జరిగే సెప్టెంబర్ 15వ తేదీనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ తొమ్మిదిరోజుల ఉత్సవాల్లో 19వ తేదీ గరుడసేవ, 21న బంగారురథం, 22న రథోత్సవం, 23న చక్రస్నాన మహోత్సవం, ధ్వజావరోహణం ప్రధాన ఘట్టాలు. కాగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 11వ తేదీ నుండి మొదలుకానున్నాయి. ఆలయ మాఢవీధుల్లో, ఆలయం ఎదురుగా మొత్తం గ్యాలరీలు నిర్మాణం జరుగుతోంది.

### తిరుమలలో డ్రైవర్ల ఎన్యుమరేషన్‌పై అవగాహన



**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ యాత్రికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వరాహ స్వామి గెస్ట్‌హౌస్ సర్కిల్‌లో డ్రైవర్ల ఎన్‌మ్యరేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, యాత్రికుల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. తిరుమలలోని అన్ని మఠాల మేనేజర్లతో పోలీస్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యాత్రికుల భద్రత, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ శాఖతో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. యాత్రికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, తిరుమలలో శాంతిభద్రతలు సమర్థవంతంగా ఉండేలా నిరంతరం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

## వైష్ణవ ఆచార్యుల భక్తి, శరణాగతి భావాలు ఆదర్శప్రాయం

**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవైష్ణవ ఆచార్యులు చూపిన భక్తి, శరణాగతి ఆచార్య నిష్ఠ, కైంకర్య మార్గాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తిరువల్లిక్కేణికి చెందిన మాడభూషి అనంతాళ్వాన్ తెలిపారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన 'శ్రీవైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలు' జాతీయ సదస్సు బుధవారం సాయంత్రం ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పండితులు, ఆచార్యులు ఈ సదస్సులో పాల్గొని శ్రీవైష్ణవ సంప్రదాయం, ఆచార్య భక్తి, శరణాగతి, కైంకర్యం తదితర అంశాలపై ప్రసంగించారు. మాడభూషి అనంతాళ్వాన్ 'ఎంబార్ వళి తిరునామం' అంశంపై మాట్లాడుతూ, భగవంతునిపై అచంచలమైన భక్తితోపాటు ఆచార్యుల పట్ల సంపూర్ణ విశ్వాసం, శరణాగతి కలిగి ఉండటమే శ్రీవైష్ణవ సంప్రదాయంలోని ప్రధాన సందేశమన్నారు. రామానుజాచార్యులు, ఎంబార్ వంటి ఆచార్యులు చూపిన భక్తి, శరణాగతి మార్గం అందరికీ ఆదర్శమన్నారు. చెన్నైకి చెందిన డాక్టర్ ధనంజయన్ "ఎంబార్ తనియన్‌లోని భక్తి–పెరియ తిరుమొళి వైశిష్టం" అంశంపై మాట్లాడుతూ ఎంబార్ తనియన్‌లో ఆచార్య భక్తి, శరణాగతి భావాలు ఎంతో విశిష్టంగా ప్రతిఫలిస్తాయని తెలిపారు. ఆళ్వార్ల పాశురాల్లోని భక్తి తత్వాన్ని ఆచార్యులు తరతరాలకు అందించారని వివరించారు. వరంగల్‌కు చెందిన సముద్రాల శఠగోపాచార్య 'ఎంబార్– శ్రీరామానుజులు' అంశంపై మాట్లాడుతూ రామానుజాచార్యుల ప్రియ శిష్యుడిగా ఎంబార్ విశిష్ట స్థానాన్ని పొందారని తెలిపారు. ఆచార్య భక్తి, వినయం, శరణాగతి, కైంకర్య భావాలకు ఎంబార్ జీవితం గొప్ప నిదర్శనమన్నారు. శ్రీరంగానికి చెందిన విష్ణుచిత్తన్ స్వామి "ఆండాళ్‌పై పుండరీకాక్ష స్వామి రచించిన తనియన్ల విశిష్టత" అంశంపై మాట్లాడుతూ, ఆండాళ్ అమ్మవారి తనియన్లలో ఆమె అపారమైన భక్తి, శ్రీమన్నారాయణునిపై అచంచలమైన ప్రేమ, శరణాగతి భావాలు హృద్యంగా ప్రతిఫలిస్తాయని తెలిపారు. ఆండాళ్ అమ్మవారి బోధనలు నేటి తరానికి కూడా మార్గదర్శకమన్నారు. బెంగళూరుకు చెందిన దేవరాజన్ 'భగవద్విషయ వ్యాఖ్యానాల్లో దాశరథి అనుభవం' అంశంపై మాట్లాడారు. శ్రీరంగానికి చెందిన బ్రద్రి భట్టర్ స్వామి,హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రవికుమార్ స్వామి, శ్రీరంగానికి చెందిన శ్రీనివాసాచార్య స్వామి ఆళ్వార్లు, ఆచార్యులు అందించిన భక్తి, శరణాగతి, కైంకర్య మార్గాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ జాతీయ సదస్సు ద్వారా శ్రీవైష్ణవ ఆచార్యుల భక్తి, శరణాగతి, కైంకర్య భావాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి సదస్సులు ఆచార్యుల ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి తిరుమళిశై ఆళ్వార్, పండితులు, పరిశోధకులు, భక్తులు పాల్గొన్నారు.

# జనవరిలోపే కుప్పం ఎయిర్‌పోర్టు పనులు

- సిఎం ఆదేశాలతో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు
- రూ.10 కోట్లతో ఆర్డీఓ, డిఎస్పీ కార్యాలయ భవనాల నిర్మాణం
- కృష్ణా జలాలతో మళ్లీ చెరువులు నింపుతాం
- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

**కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులను జనవరిలోపే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎయిర్‌పోర్టుకు తొంభైశాతం భూసేకరణ పూర్తయిందన్నారు. పరిహారంగా ఇప్పటికే సుమారు రూ.90 కోట్లు చెల్లించామన్నారు. ఇంకా రూ.80-90 కోట్ల పరిహారం రైతులకు అందించాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను అక్టోబర్‌లోగా పూర్తిచేస్తామన్నారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించి ఇంకా రెండు,మూడు క్లియరెన్స్‌లు రావాల్సి ఉందన్నారు. కుప్పం ప్రాంతంలో సాగు, పరిశ్రమల అవసరాల దృష్ట్యా యామిగానిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణంకు గాను సిఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కుప్పంలో నూతనంగా సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఆర్డీఓ, డిఎస్పీ కార్యాలయాల భవనాల నిర్మాణంకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. దీంతోపాటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ భవనాలు, ప్రభుత్వ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల నిర్మాణాలను మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే మార్చి లోగా కుప్పంలో 52వేల గృహాలకు సోలార్ కనెక్షన్లు అందించడంతో పాటు 100 మెగా వాట్ల సోలార్ కరెంట్ ఉత్పత్తి అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు.



ఇక ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత (పర్సెప్షన్) పెంచేందుకు తగు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం 72శాతం ఉన్న సానుకూలతను సెప్టెంబర్ కల్లా 80శాతంకు తీసుకెళ్తామన్నారు. ఈ అంశంలో కొన్ని ప్రభుత్వ శాఖల పనితీరుకు ఆదేశించామని చెప్పారు. అన్నక్యాంటీన్లు, ఆస్పత్రుల నిర్వహణపై ప్రజల్లో సానుకూలత పెరిగిందన్నారు. కుప్పంలో ఎంపిక చేసిన సుమారు 9వేల బంగారు కుటుంబాలకు డిసెంబర్ కల్లా పి4 కార్యక్రమంలో భాగంగా ఆర్థికభరోసాతో పాటు వారికి శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కుప్పం ప్రాంతంలోని నసియాల ఎకో టూరిజం సెంటర్‌ను మార్చిలోగా అభివృద్ధి చేస్తామన్నారు. అక్కడ క్యాంటీన్, హార్స్ రైడింగ్, స్పిరిట్యువల్ సెంటర్, డార్మెంటరీ వసతి తదితర సౌకర్యాలు కల్పించి టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడ్తామన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో మరలా కుప్పం ప్రాంతంలోని పలు చెరువులను కృష్ణాజలాలతో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో 34 హ్యాబిటేషన్లలో ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. గతేడాది తాగునీటి అవసరాలకై రూ.3కోట్లు వ్యయం చేశామన్నారు. కుప్పంలో ప్రధాన రహదారి మూడో రీచ్ పనులకు సంబంధించి సెప్టెంబర్ 15కల్లా భవన యజమానులకు నగదు జమచేసి అదే నెలాఖరులోగా పనులు మొదలు పెడతామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ జరగాలన్నదే తమ అభిమతం అన్నారు. కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ అంశంలో ప్రజాభిప్రాయాన్నే ప్రాతిపదికగా తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలువురు తమ అభిప్రాయాలను వినతుల రూపంలో అందిస్తున్నట్లు చెప్పారు.

# గుంతకల్‌లో రైల్వే జిఎం తనిఖీలు

బళ్లారి- గుంతకల్లు- ధర్మవరం సెక్షన్ తనిఖీ చేసి, అభివృద్ధి పనులు పరిశీలించిన సందీప్ మాథుర్

**గుంతకల్ (రైల్వే) ఆగస్టు 19 ప్రభాతవార్త:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ గుంతకల్ రైల్వే డివిజన్‌లో సౌత్ కోస్ట్ రైల్వే (ఎస్‌సిఓఆర్) జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా బళ్లారి–గుంతకల్లు– ధర్మవరం సెక్షన్‌ను తనిఖీ చేసి, మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రయాణికుల సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. తనిఖీలో భాగంగా సందీప్ మాథుర్ హగరి వంతెనను క్షుణ్ణంగా పరిశీలించారు. వంతెన నిర్మాణ స్థితి, భద్రతా అంశాలు, నిర్వహణ చర్యలను సమీక్షించారు. రైళ్ల రాకపోకలు సురక్షితంగా, సమర్థవంతంగా జరిగేలా అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా గుంతకల్లు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజనీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా, డివిజన్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం రైల్వే స్టేషన్లను కూడా తనిఖీ చేసి, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రయాణికుల సౌకర్యాలు, వసతుల అభివృద్ధిలో భాగంగా ఫుట్






ఓవర్ బ్రిడ్జిలు, వెయిటింగ్ హాళ్లు, తాగునీటి సౌకర్యాలు, యార్డ్ రీమోడలింగ్, ఇతర భద్రతా సంబంధిత పనులను పరిశీలించారు. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించడంతో పాటు స్టేషన్ల పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన మార్పులు, అభివృద్ధి చర్యలను సూచించారు. ధర్మవరం స్టేషన్‌లో క్రూ లాబీని పరిశీలించి, అక్కడి సౌకర్యాలు, పని విధానాలను సమీక్షించారు. ప్రసన్నాయపల్లి వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 125ను సందీప్ మాథుర్ తనిఖీ నిర్వహించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న గేట్‌మ్యాన్‌తో మాట్లాడి, భద్రతా విధానాలు, నిర్వహణ ప్రక్రియలు, పని ప్రదేశంలోని పరిస్థితులపై ప్రత్యక్షంగా వివరాలు తెలుసు కున్నారు. చట్టబద్ధంగా నిర్వహించాల్సిన రిజిస్టర్ల నిర్వహణ, భద్రతా పరికరాల లభ్యత, వాటి స్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్దేశిత భద్రతా విధానాలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని స్పష్టంచేశారు. తనిఖీ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, రైళ్ల సురక్షిత నిర్వహణకు నిరంతర పర్యవేక్షణ, సకాలంలో నిర్వహణ పనులు చేపట్టడం, భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ఎంతో అవసరమని అన్నారు. అలాగే ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి

## ఆస్తి కోసం కొడుకు తిరస్కారం.. తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

**కార్వేటినగరం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** తండ్రి మరణించిన వేళ.. కన్న కొడుకే తలకొరివి పెట్టెందుకు నిరాకరించిన వైనం తిరుపతి జిల్లా కార్వేటినగరం మండలంలో కన్నీళ్ళు పెట్టించే ఘటన వెలుగుచూసింది. పొన్నగల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(65), శాంతమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలు పెళ్ళి చేసుకొని అత్తవారి ఇంట్లో వుంటున్నారు. కుమారుడు చెన్నైలో వుంటున్నాడు. 15ఏళ్ళ క్రింతం శాంతమ్మ మృతి చెందినప్పటి నుంచి వెంకటేశ్వర్లు కల్లుగీత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆలనాపాలనా లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం వెంకటేశ్వర్లు మరణించారు. తండ్రి మృతిపై కుమారుడికి సమాచారం అందించినా రాలేదు. తనకంటూ ఆస్తులు కూడబెట్టలేదని, తలకొరివి కూడా పెట్టనని బీష్మించుకొని రాలేదు. దీంతో పెద్ద కుమార్తెయిన నాగరత్నమ్మ తన తండ్రికి కొరివిపెట్టి జన్మనిచ్చిన రుణం తీర్చుకుంది. కన్నతండ్రికి చివరి వీడ్కోలు పలుకుతూ సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కన్నకొడుకు చేయాల్సిన చివరి కర్మను కన్నకూతురు చేయాల్సిన పరిస్థితి రావడం అక్కడ వున్న వారిని తీవ్ర బావోద్వేగానికి గురి చేసింది. ఆస్తి కోసం అయిన.. ఏ కారణంతోనైనా.. చివరి మజిలీలో కన్నపేగు బంధాల మధ్య ఇలాంటి దూరం ఏర్పడడం మాత్రం కలచివేస్తుంది. ఈ ఘటన ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది.



కన్న తండ్రికి కడసారి కొరివి పెడుతున్న కన్న కూతురు దృశ్యం

## న్యాయం కోసం నిరాహారదీక్ష

భగ్నం చేసిన పోలీసులపై యాదవ సంఘం మండిపాటు



**తిరుపతి, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నగరంలో యాదవులు, టిడిపి నేతల మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుంది. ఇటీవల టిడిపి తిరుపతి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్‌కు వైసిపి నేత వాసుయాదవ్ అనుచరుల మధ్య మాటల యుద్ధంతో ఏకంగా జెబి ఇంటిపైకి వాసు యాదవ్ వెళ్ళి దాడికి పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలతో గొడవలు పెద్దవై టిడిపి నేతలపై హత్యాయత్నం చేశారనే ఫిర్యాదుతో పోలీసులు వైసిపి నేతలపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ వివాదం ముదిరి తిరుపతిలో యాదవులకు, బలిజ సామాజిక వర్గానికి మధ్య మాటల యుద్ధం సాగింది. ఈ నేపథ్యంలో వాసూ యాదవ్ తల్లి రేణుకమ్మ కుమారుడిపై అక్రమంగా కేసు బనాయించారని, తన కుమారుడు జెబి ఇంటిపై దాడిచేసి ఉంటే సిసి కెమెరాల పుటేజీలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అంతేగాక జెబి శ్రీనివాస్, అతని అనుచరులు యాదవులపై కులం పేరుతో దూషించి దురుసుగా ప్రవర్తించారనేది యాదవసంఘాల ఆరోపణలు. ఇదీ కాస్త ముదిరి యాదవులు, బలిజకులస్థుల మధ్య మరింతగా చెలరేగింది. తన కుమారుడికి ఏమి ప్రమేయం లేదని అతని తల్లి రేణుకమ్మ న్యాయం కోసం నాలుక్కాళ్ళ మండపం వద్ద భగవద్గీతను చేతిలో పట్టుకుని శాంతియుతంగా నిరాహార దీక్షకు కూర్చున్నారు. బుధవారం ఆమె నిరాహారదీక్షతో ఒక్కసారిగా తిరుపతిలో సంచలనం రేకెత్తింది. సమాచారం అందుకున్న తిరుపతి తూర్పు పోలీసులు అక్కడకు చేరుకుని రేణుకమ్మను ఆమెకు మద్దతుగా కూర్చున్న మరికొందరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. దీక్షను భగ్నం చేయించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిడిపి ఇన్‌ఛార్జి యాదవులను కులం పేరుతో దూషించాడని ప్రశ్నించినందుకే తన కొడుకుపై అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## 34శాతం రిజర్వేషన్లతో బిసిలకు పండుగ

- వడ్డెర మహిళ రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం హర్షదాయకం
- టిడిపి బిసి సెల్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం



**చిత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాత వార్త:** బిసి వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళ రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం, అదేవిధంగా బిసిలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయం చారిత్రాత్మకమని, బిసిలకు ఒకే రోజు రెండు పండుగలు వచ్చినవిధంగా వుందని టిడిపి మాజీ బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి షణ్ముగం ఆనందం వ్యక్తం చేసారు. బుధవారం చిత్తూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు ఇచ్చిన హామిలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని, ఎన్నికల సమయంలో బిసిలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 34శాతం రిజర్వేషన్లకై కీలక నిర్ణయం తీసుకోవడం బిసి వర్గాలకు ఎంతో ప్రాధాన్యమైన విషయమన్నారు. బిసి వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళ రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా బిసి మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరిగిందన్నారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి అభ్యున్నతికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. 34శాతం రిజర్వేషన్ నిర్ణయం బిసిలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని, భవిష్యత్తు తరాలకు కూడా ప్రయోజనం చేకూర్చే చారిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర జనాభాలో 56శాతం వున్న బిసి వర్గాలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన 34శాతం రిజర్వేషన్‌ను 24 శాతంకు తగ్గించారని అందుకే రాష్ట్రంలో వున్న బిసి వర్గాలు తగిన గుణపాఠం చెప్పి 11 సీట్లకు పరిమితం చేసిందని ఇప్పటికైనా వైసిపి బుద్ది తెచ్చుకొని వెనుకబడిన వర్గాల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోకపోతే ఇంకోసారి బిసిల ఆగ్రహానికి గురి అవుతారని హెచ్చరించారు. ముఖ్యంగా రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించినందుకు బిసి వర్గాల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో భారతీయ జనతా పార్టీకి షణ్ముగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సింక్‌ఫీల్డ్ కప్: వాచియర్‌ను ఓడించి


# అగ్రస్థానానికి ప్రజ్ఞా




**సెయింట్ లూయిస్:** సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత్ యువ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద దూసుకుపోతున్నాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో బుధవారం ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్-లాగ్రావ్‌పై కేవలం 28 ఎత్తుల్లోనేఓడించి, అమెరికన్ గ్రాండ్ మాస్టర్ వెస్లీ సోతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. ఈ విజయంతో ప్రజ్ఞానంద ఎనిమిది పాయింట్లకు గాను ఐదు పాయింట్లను సాధించి ఈ ఏడాది చివర్లో జరగనున్న గ్రాండ్ ఫైనల్‌లో స్థానం ఖారారు చేసుకున్నాడు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి చివరి రౌండ్‌పైనే ఉంది. ప్రజ్ఞానంద తెల్ల పావులతో అనిష్ గిరితో తలపడనున్నాడు. అలాగే ఉజ్బెకిస్తాన్ గ్రాండ్ మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ కూడా అద్భుత ఫామ్‌లోకి వచ్చాడు. డచ్ ప్లేయర్ జోర్డన్ వాన్ ఫోరెస్ట్‌పై విజయం సాధించి వరుసగా మూడో గేమ్ గెలిచాడు. దీంతో సిందరోవ్ 4.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో మరో కీలక పోరులో సిందరోవ్, వెస్లీ సోను ఎదుర్కోనున్నాడు. మరోవైపు జర్మనిికి చెందని విన్సెంట్ కీమర్ టాప్ సీడ్ అమెరికన్ ఫాబియానో కరువానాను ఓడించి 4.5 పాయింట్లతో సిందరోవ్‌తో కలిసి మూడో స్థానాన్ని పంచుకున్నాడు. కీమర్ వాన్ ఫోరెస్ట్‌తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో అమెరికాకు చెందిన లెవోన్ అరోనియన్, నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరి డ్రా చేసుకున్నారు.

## వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ స్టార్ లక్ష్య, ఉన్నతి నిష్క్రమణ

### డబుల్స్‌లో అర్జున్-హరిహరన్ ఓటమి




**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026 నుండి భారత్ స్టార షట్లర్ లక్ష్యసేన్, ఉన్నతి హుడా అనూహ్యంగా నిష్క్రమించారు. ఢిల్లీలో బుధవారం పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్‌లో అమెరికాకు చెందిన గారెట్ టాన్‌పై తొలి గేమ్‌ను గెలుచుకున్న లక్ష్య రెండో గేమ్‌లో వెనుకబడ్డాడు. టాన్ పుంజుకుని రెండో గేమ్‌ను దక్కించుకోవడంతో మ్యాచ్ నిర్ణాయక మూడో గేమ్‌కు చేరుకుంది. ఈ గేమ్‌లో లక్ష్య పోరాడినా టాన్ ప్రారంభం నుండే దూకుడును ప్రదర్శించాడు. ఒక దశలో 11-4 ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే లక్ష్యసేన్ చివరిన వరుస పాయింట్లు సాధించడంతో స్కోర్ 17-16కు చేరింది. కీలక సమయంలో గారెట్ వరుస పాయింట్లు తెచ్చుకోవడంతో 21-17తో మూడో గేమ్‌ను గెలుచుకుని మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఓటమితో ఈ టోర్నీలో లక్ష్యసేన్ ప్రయాణం ముగిసింది. అలాగే మహిళల మూడుగేమ్‌ల పోరులో, 18 ఏళ్ల ఉన్నతి హుడా కెనడాకు చెందిన 13వ సీడ్ మిషెల్ లీ చేతిలో ఓడిపోవడంతో ఛాంపియన్‌షిప్ ప్రచారం ముగిసింది. ఉన్నత ర్యాంకులో ఉన్న కెనడియన్ క్రీడాకారిణిపై ఆధిపత్యం చెలాయిస్తూ, ఉన్నతి తొలి గేమ్‌ను 21-11 తేడాతో సునాయాసంగా గెలుచుకుంది. రెండో గేమ్‌లో లీ బలంగా పుంజుకుని, 21-9 తేడాతో ఆధిక్యం సాధించి మ్యాచ్‌ను సమం చేయడంతో నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడో గేమ్ పోరులో చివరి నిమిషాల్లో ఉన్నతిపై లీ స్వల్ప ఆధిక్యం సాధించి గేమ్‌ను 23-21 తేడాతో ముగించింది. ఇక పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన ఎంఆర్ అర్జున్-హరిహరన్, దక్షిణ కొరియాకు చెందిన ఎంహెచ్ కాంగ్-డి కి చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి పాలయ్యారు. తొలి రౌండ్‌లో భారత ద్వయం, కొరియా జోడీ చేతిలో 17-21, 14-21 తేడాతో ఓడిపోయింది.



## టీమిండియా ఘన విజయం

### 165 రన్స్ తేడాతో శ్రీలంక ఓటమి

**కొలంబో:** శ్రీలంక పర్యటనను టీమిండియా ఘనంగా ప్రారంభించింది. గాలె వేదికగా బుధవారం ముగిసిన తొలి టెస్టులో సమష్టిగా రాణించిన టీమిండియా 165 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. యువ స్పిన్నర్ మానవ్ సుతార్(6/55, 4/76)10 వికెట్ల ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. 84/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను కొనసాగించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు ధనంజయ డిసిల్వా(151 బంతుల్లో 7 ఫోర్లతో 59), సోనాల్ దినుషా (129 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీలతో రాణించగా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(6/55) ఆరు వికెట్లు తీయగా, ప్రసిధ్ కృష్ణ(2/16) రెండు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసారు. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆఖరి రోజు ఆటలో డిసిల్వా, సోనాల్ దినుషా భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించినా, జడేజా ఈ జోడీని విడదీసి ఐదో వికెట్‌కు నమోదైన 95 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడినా, మానవ్ సుతార్ దెబ్బతీసాడు. వరుస బంతుల్లో సోనాల్ దినుషా, ప్రబాత్ జయసూర్యను పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాతి ఓవర్లలో లాహిరు కుమార, కేశర నువాంతలను ఔట్ చేసి భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

# కెప్టెన్ హార్దిక్ సహా 8 మందికి గుడ్‌బై

## ముంబై ఇండియన్స్ సంచలన నిర్ణయం

**న్యూఢిల్లీ:** ముంబయి ఇండియన్స్ జట్టులో భారీ మార్పులు జరుగుతున్నాయి. 2020లో చివరిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలిచిన ముంబయి ఇండియన్స్ ఆ తర్వాతి ఆరు సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. 2026 సీజన్‌లో ముంబై తొమ్మిదో స్థానంలో నిలిచింది. దీంతో వచ్చే సీజన్‌కు ముందు జట్టును పునర్నిర్మించే ఆలోచనలో ఫ్రాంచైజీ ఉందనే అంచనాలు పెరిగాయి. ఇందులో భాగంగా ప్రక్షాళన చేపట్టి 2027 ఐపీఎల్ నాటికి జట్టును పటిష్ట స్థితికి తీసుకెళ్లాలని యాజమాన్యం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే రిటెన్షన్‌పై కీలక నిర్ణయాలు తీసుకోనుందనే అంచనాలు ఉన్నాయి. అందులో కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేరు ఉండటం చర్చకు దారితీస్తోంది. ఐపీఎల్ 2027 రిటెన్షన్ జాబితా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

అయినా కోర్ ఆటగాళ్లలో కొందరిని కొనసాగించే అవకాశం ఉంది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, తిలక్ వర్మతో పాటు, రియాన్ రికెల్టన్, విల్ జాక్స్, నామన్ ధీర్, కార్బిన్ బోష్, మిచెల్ సాంట్నర్, అల్లా గజన్‌ఫర్ పేర్లు రిటెన్షన్ రేసులో ఉన్నట్లు సమాచారం. హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపైనే ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. హార్దిక్‌తో పాటు, క్వింటన్ డి కాక్, ట్రెంట్ బౌల్ట్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్, రాబిన్ మింజ్, దానిష్ మాలేవార్ పేర్లు కూడా విడుదలయ్యే ఆటగాళ్ల జాబితాలో వినిపిస్తున్నాయి. 2024 నుంచి ముంబై కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హార్దిక్ వచ్చే సీజన్‌లో మరో ఫ్రాంచైజీకి వెళ్లే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. ఆయనను ట్రేడ్ చేయడం లేదా నేరుగా విడుదల చేయడం జరిగే అవకాశాలను ప్రస్తావిస్తున్నారు. హార్దిక్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ ముందంజలో ఉండొచ్చని సమాచారం. చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ కూడా ఆసక్తి చూపే జట్లుగా పేర్కొంటున్నారు. అయితే తుది నిర్ణయం ఫ్రాంచైజీల అధికారిక ప్రకటనల తర్వాతే స్పష్టమవుతుంది. ఈ మార్పులతో వేలానికి ముందు ముంబై పర్స్ విలువ పెంచుకోవాలని చూస్తున్నట్లు అంచనా. తద్వారా అవసరమైన స్థానాల్లో కొత్త ఆటగాళ్లను తీసుకునే అవకాశం ఉంటుంది. ముంబయి ఇండియన్స్ రిటెన్షన్ లిస్ట్ ఇంకా అధికారికంగా రాలేదు. అయినా హార్దిక్ పాండ్యా సహా 8 మంది విడుదలయ్యే అవకాశాలపై వస్తున్న అంచనాలతో ముంబై జట్టు రూపమే గణనీయంగా మారే అవకాశం ఉంది.





## సిన్సినాటి ఓపెన్‌లో దూసుకెళుతున్న సబాలెంకా, ఆండ్రీవా, గౌఫ్

**న్యూఢిల్లీ:** ప్రపంచ నంబర్ 1 అరీనా సబలెంకా, ఐదవ సీడ్ మీరా ఆండ్రీవా, నాల్గవ సీడ్ కోకో గాఫ్ సిన్సినాటి ఓపెన్‌లో ఘన విజయాలతో దూసుకెళుతున్నారు. సబలెంకా కేవలం 54 నిమిషాల్లో వాంగ్ జిన్యును 6-1, 6-3 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు, ఆండ్రీవా 32వ సీడ్ జానిస్ టెన్ నుండి గట్టి పోటీని ఎదుర్కొని, ఒక గంట 42 నిమిషాల పోరులో 6-1, 7-6(5) తేడాతో విజయం సాధించింది. 19 ఏళ్ల ఆ క్రీడాకారిణి తన నాలుగో మ్యాచ్ పాయింట్‌ను కైవసం చేసుకుని విజయాన్ని ఖాయం చేసుకుని, సిన్సినాటిలో రెండోసారి నాలుగో రౌండ్‌కు చేరుకుంది. అలాగే నాలుగో సీడ్, 2023 సిన్సినాటి ఛాంపియన్ కోకో గాఫ్ కూడా తన తోటి అమెరికన్ క్రీడాకారిణి ఆన్ లీని 6-1, 7-6(3) తేడాతో ఓడించి ముందంజ వేసింది.

# వాణిజ్యం

## ఇండిగో టికెట్ల బుకింగ్ వ్యవస్థలో సడెన్ బ్రేక్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశీయ విమానయాన మార్కెట్లో అతిపెద్ద సంస్థ ఇండిగో వెబ్‌సైట్ లో బుధవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో పలువురు ప్రయాణికులు విమాన టికెట్లు బుక్ చేసుకోలేకపోయారు. ఢిల్లీ నుంచి పలు నగరాలకు వెళ్లేందుకు ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు ఈ సమస్య ఎదురైంది. వేర్వేరు తేదీల్లో విమానాల కోసం వెతికినా




అందుబాటులో ఉన్న సర్వీసుల వివరాలు కనిపించలేదని ప్రయాణికులు తెలిపారు. మరో ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లోనూ ఇండిగో టికెట్ బుక్ చేసుకునే సమయంలో సాంకేతిక సమస్య ఉన్నట్లు సందేశం వచ్చింది. వెబ్‌సైట్ సమస్యపై పలువురు ప్రయాణికులు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఫిర్యాదు చేశారు. టికెట్లు బుక్ చేసుకోవడంతోపాటు ఆన్‌లైన్ చెక్‌ఇన్ పూర్తి చేయడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. విమానాల వివరాలు కనిపించకపోవడంతో తదుపరి ప్రక్రియకు వెళ్లలేకపోయామన్నారు. ఈ సాంకేతిక సమస్యకు కారణమేంటన్న దానిపై ఇండిగో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సమస్య ఎంతమందిని ప్రభావితం చేసిందన్న వివరాలు కూడా వెల్లడించలేదు. దేశీయ విమానయాన మార్కెట్లో ఇండిగోకు 65 శాతానికిపైగా వాటా ఉంది. గత డిసెంబరులోనూ సంస్థ భారీ స్థాయిలో కార్యకలాపాల సమస్యను ఎదుర్కొంది. పైలట్ల రోస్టర్ నిర్వహణలో లోపాల కారణంగా సుమారు 4,500 విమానాలు రద్దయ్యాయి. దాంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజా ఘటనతో విమాన ప్రయాణాలకు సంబంధించిన డిజిటల్ సేవలపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



## వరుస నష్టాల్లో బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు

**ముంబయి, ఆగస్టు 19:** అధిక స్థాయిలో కొనసాగుతున్న ముడి చమురు ధరలు, పెరిగిన గ్లోబల్ బాండ్ ఈల్డ్స్, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో కీలక బెంచ్‌మార్క్ సూచీలు బుధవారం వరుసగా నష్టాలను చవిచూశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా దిగువకు ముగిశాయి. రక్షణ, ఇంధన రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా అత్యధిక రంగ సూచీలు నష్టాల్లో ముగియగా, ఐటీ షేర్లు మాత్రం బేరసారాల కొనుగోళ్లతో లాభపడ్డాయి. అమెరికాఇరాన్ వివాదం, హోర్ముజ్ జలసంధిపై కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో సరఫరాపై ఆందోళనలు కొనసాగడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 92 డాలర్లకు చేరువలోనే ఉంది. బీఎస్ఈ సెన్సెక్స్ 325.78 పాయింట్లు నష్టపోయి 76,909.68 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 76.60 పాయింట్లు కోల్పోయి 24,078.30 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టపోయింది. మొత్తం 1.49 శాతం దిగజారింది. నిఫ్టీ వరుసగా ఏడో సెషన్‌లో నష్టపోయి మొత్తం 2.05 శాతం క్షీణించింది. నిఫ్టీ నష్టాలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.83 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.71 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.41 శాతం క్షీణతతో ప్రధాన కారణాలుగా నిలిచాయి. విస్తృత మార్కెట్‌లో బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.67 శాతం పడిపోయాయి. బీఎస్ఈలో మొత్తం 4,734 షేర్లలో 1,807 షేర్లు లాభపడగా, 2,483 షేర్లు నష్టపోయాయి. మరో 244 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్‌లో అక్టోబర్ 2026 సెటిల్‌మెంట్ బ్రెంట్ క్రూడ్ ధర 97 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 91.99 డాలర్లకు చేరింది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి స్వల్పంగా బలహీనపడి డాలర్‌తో పోలిస్తే 95.7550 వద్ద ట్రేడైంది. గత సెషన్‌లో ఇది 95.7450 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 0.02 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,54,290 వద్దకు చేరాయి. వ్యక్తిగత షేర్లలో రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 3.50 శాతం, ప్రిజమ్ జాన్సన్ 5.10 శాతం, ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ 1.05 శాతం, సీగల్ ఇండియా 2.06 శాతం, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ 0.98 శాతం లాభపడ్డాయి. మరోవైపు రెఫెక్స్ ఇండస్ట్రీస్ 0.93 శాతం, ఇండిజీన్ 0.14 శాతం, ఇంటర్‌ఆర్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ 1.33 శాతం నష్టపోయాయి.





## ధేను బిల్డ్‌కాన్‌లో రూ.1,000 కోట్ల రుణాల మళ్లింపు

### సర్క్యులర్ ఫండింగ్‌పై సెబీ మధ్యంతర ఉత్తర్వులు

**ముంబయి,ఆగస్టు 19:** ధేను బిల్డ్‌కాన్‌ఇన్‌ఫ్రాకు సంబంధించి నిధులమళ్లింపు వ్యవస్థను సెబీ గుర్తించింది. మొదట సేకరించిన కొంత మొత్తాన్ని పలు కంపెనీల ద్వారా పదేపదే తిప్పి, రూ.1,000కోట్ల కొత్తరుణాలు వచ్చినట్లుగా చూపించి, అందులో సుమారు రూ.840 కోట్లను షేర్లుగా మార్చినట్లు నియంత్రణ సంస్థ ఆరోపించింది. దీనిని సెబీ మోసపూరిత ఆర్థిక నెట్‌వర్క్ గా అభివర్ణించింది. బుధవారం జారీ చేసిన మధ్యంతర, ఎక్స్‌పార్టీ ఉత్తర్వుల్లో సెబీ ఈ వివరాలను వెల్లడించింది. ధేనుసంస్థ, బ్యాంకు ఖాతాలు, భవిష్యత్తులో జరగాల్సిన ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపుపై చర్చలు జరిగినట్లు సందేశాలు సూచిస్తున్నాయి. నవంబర్ నాటికి రుణ ఒప్పందాలు, స్టాంప్ పేపర్లు, కేవైసీ, బ్యాంకు ధ్రువీకరణ అంశాలపై చర్చలు జరిగినట్లు గుర్తించింది. 46 లావాదేవీల ద్వారా రూ.1,000 కోట్లుడిసెంబర్ 21,2024న ధేను తనరుణపరిమితిని రూ. 1,000 కోట్లకు పెంచింది. అనంతరం డిసెంబర్ 24 నుంచి 31 మధ్య 46 లావాదేవీల ద్వారా ఏడు రుణదాతల నుంచి రూ.1,000 కోట్లు అందుకున్నట్లు చూపించారు. ఈ లావాదేవీలను వెనుకకు అనుసరించిన సెబీ 28 రకాల నిధుల మళ్లింపు మార్గాలను గుర్తించింది. ధేను రూ.1,000 కోట్ల రుణాలు పొందినట్లు చూపించినప్పటికీ, ఆ సమయంలో సంస్థ బ్యాంకు ఖాతాల్లో గరిష్ఠ నిల్వ రూ.25.81 కోట్లుగా ఉన్నట్లు గుర్తించింది. అదే సమయంలో ధేను నుంచి సుమారు రూ.996.1 కోట్లు ఐదు సంస్థలకు వెళ్లినట్లు సెబీ తెలిపింది. వాటిలో జెనెసిస్ డెవలపర్స్ అండ్ హోల్డింగ్స్, హిల్‌రిడ్జ్ ఇన్వెస్ట్‌మెంట్స్, అభిజిత్ ట్రేడింగ్, ఇంటెలెక్చువల్ బిల్డర్స్ తదితర సంస్థలు ఉన్నాయి. ఇది కేవలం కంపెనీల మధ్య డబ్బు బదిలీ కాదని సెబీ పేర్కొంది. ఉదాహరణకు టియాన్ సంస్థ సంబంధిత సంవత్సరాల్లో కేవలం కొన్ని లక్షల రూపాయల ఆదాయాన్ని చూపినప్పటికీ, ధేనుకు రూ.160 కోట్ల రుణం ఇచ్చినట్లు పేర్కొంది.

## ఈ యేడాదిలో ఒక్కసారే రెపోరేట్ల సవరణఛాన్స్

### ఆర్బీఐ డిప్యూటి గవర్నర్ పూనమ్ గుప్తా




**ముంబై, ఆగస్టు 19:** అంతర్జాతీయ అనిశ్చితులు, పెరుగుతున్న చమురు ధరల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఇకపై వడ్డీ రేట్ల కోతకు అవకాశం కనిపించడం లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్, ఎంపీసీ సభ్యురాలు పూనమ్ గుప్తా పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఒకసారి వడ్డీ రేటు పెంపునకు అవకాశం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. బుధవారం విడుదలైన ఎంపీసీ సమావేశం మినిట్స్‌లో పూనమ్ గుప్తా తన అభిప్రాయాలను వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం గరిష్ఠంగా 5.9 శాతానికి చేరే అవకాశం ఉన్నందున, ఈ ఏడాది కాలంలో వడ్డీ రేటు పెంపునకు పరిస్థితులు అనుకూలించవచ్చని ఆమె తెలిపారు. ప్రస్తుతం మరింత ద్రవ్య విధాన సడలింపునకు అవకాశం లేదని పేర్కొన్న ఆమె, మెరుగుపడుతున్న రుతుపవన పరిస్థితులు, దేశీయ ఆర్థిక కార్యకలాపాల్లో స్థిరత్వం కారణంగా భారత వృద్ధి అంచనాలు బలపడ్డాయని చెప్పారు. జూన్‌లో నమోదైన వర్షాభావ లోటు జూలైలో తగ్గిందని, దీంతో పంటల సాగు వేగం పుంజుకుందని తెలిపారు. జలాశయాల్లో నీటి మట్టాలు కూడా పెరిగాయని పేర్కొన్నారు. పలు ఆర్థిక సూచీలు దేశీయ ఆర్థిక వ్యవస్థలో చురుకుదనం, స్థిరత్వాన్ని కొనసాగిస్తున్నాయని, ఇవి వృద్ధి వేగానికి మద్దతునిస్తున్నాయని పూనమ్ గుప్తా వివరించారు. జూన్‌లో స్వల్ప విరామం తర్వాత జూలైలో అమెరికాఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రతరం అయినప్పటికీ, చమురు, ఇతర ఇంధన ఉత్పత్తుల ధరలు, లభ్యతపై అంచనాలు మెరుగుపడ్డాయని ఆమె తెలిపారు. 2026-27లో భారత వాస్తవ జీడీపీ వృద్ధి 6.7 శాతంగా, వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 5.0 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. గత అంచనాలతో పోలిస్తే వృద్ధి అంచనాను 10 బేసిస్ పాయింట్లు పెంచగా, ద్రవ్యోల్బణ అంచనాను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఏడాది సగటు ముడి చమురు ధర అంచనాలో స్వల్ప మార్పు చేయాల్సిన అవసరం ఉందని పూనమ్ గుప్తా అన్నారు. ప్రస్తుత చమురు ఫ్యూచర్స్ ధరలను బట్టి చూస్తే, 2026-27లో ముడి చమురు సగటు ధర బ్యారెల్‌కు సుమారు 90 డాలర్లు ఉండొచ్చని అంచనా వేశారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్‌లో ప్రకటించిన ద్రవ్య విధానంలో ఏడాది సగటు చమురు ధరను బ్యారెల్‌కు 85 డాలర్లుగా అంచనా వేయగా, జూన్ పాలసీలో ఆ అంచనాను 95 డాలర్లకు పెంచిన విషయం తెలిసిందే.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) రిక్రూట్‌మెంట్**

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ బేసిస్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది

**ఖాళీల సంఖ్య :**
**సాధారణ : 7680 + బ్యాక్ లాగ్ : 287**

అర్హత ప్రమాణాలు (వయస్సు, అర్హత మొదలైనవి) అవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings** ప్రకటన నం. **CRPD/CR/2026-27/17** లో లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనని చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోమని సలహా.

- **ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 11.08.2026 నుండి 31.08.2026 వరకు.**

ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు - **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings**లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 11.08.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.



# తీపి వంటకం ! చేదు సంకటం !!

భారతీయ సంస్కృతిలో, పండుగల్లో వేడుకలకు 'తీపి మిఠాయిలుంటేనే ఆ వేడుక బాగా చేసుకున్నట్లు లెక్క. ఇప్పుడు తీవ్రమైన వాతావరణ సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. గులాబ్ జామున్, లడ్డూ, కాజూ కట్లీ వంటి సంప్రదాయ స్వీట్ల తయారీకి అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులపై గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తీవ్రంగా పడుతోంది. దీంతో ముడిసరుకుల నాణ్యత, లభ్యత తగ్గిపోతుంది. 'క్లైమేట్ ఆన్ మై ప్లేట్' అనే ప్రత్యేక కథనం వెలుగులోకి తెచ్చింది. వేసవి తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పాడి పశువులు తీవ్రమైన వేడి ఒత్తిడికి (హీట్ స్ట్రెస్) గురవుతున్నాయి. దీనివల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గడమే కాకుండా, పాలలో కొవ్వు శాతం కూడా పడిపోతోంది. ఇది రసగుల్లా, గులాబ్ జామున్ వంటి పాల ఆధారిత స్వీట్ల తయారీకి అవసరమైన నాణ్యమైన కోవా లభ్యతను దెబ్బతీస్తోంది.మరోవైపు, లడ్డూల తయారీకి వాడే శనగ పంటలు అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులతో నష్టపోతున్నాయి. అనూహ్యంగా పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల శనగ గింజ పరిమాణం తగ్గి దిగుబడి తగ్గుతోంది. అలాగే, హల్వా, ఇతర మైదా స్వీట్లకు వాడే గోధుమ పంటలు విపరీతమైన వేడిగాలుల (హీట్‌వేవ్స్) కారణంగా దెబ్బతింటున్నాయి. స్వీట్లకు ప్రాణమైన చక్కెరను ఇచ్చే చెరకు పంటపై ఎల్ నినో, నీటి కొరత ప్రభావం చూపుతున్నాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చెరకు దిగుబడి తగ్గడంతో చక్కెర ధరలు పెరిగి, స్వీట్ల తయారీ వ్యయం అధికమవుతోంది.కాజూ కట్లీకి వాడే జీడిపప్పు, స్వీట్లకు సువాసననిచ్చే ఏలకులు, కుంకుమపువ్వు వంటి వాటి సాగుపైనా వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముడిసరుకుల ధరలు పెరగడంతో కొందరు వ్యాపారులు కల్తీకి పాల్పడే ప్రమాదం కూడా పొంచి ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, పండుగల తియ్యదనం తగ్గిపోతోంది. □

# మేకప్ ఐ'తేనే'ం ?



.పెళ్లిళ్లు, పార్టీలు అంటూ మేకప్‌ను వేసుకుంటాం. మరి దాన్ని తొలగించ డానికి టిష్యూని వాడి పైపైన తొలగిస్తాం. లేదంటే అలానే నిద్రపోతుం టాం. ఇలా చేయడంవల్ల మొటిమలు చర్మాన్ని పాడుచేస్తాయి. వీటిని దూరం చేయాలంటే..

తేనె సహజమైన మేకప్ రిమూవర్‌గా పని చేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా చేస్తుంది. రెండు స్పూన్ల తేనె తీసుకుని దానిలో కాటన్ బాల్‌ను ముంచి ముఖంపై ఐదు నిమిషాలు మృదువుగా మసాజ్ చేసి ఆపై గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే మరి. పచ్చిపాలల్లో విటమిన్లు, ప్రొటీన్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాదు, మేకప్‌నూ తొలగిస్తాయి. పాలల్లో కాటన్ బాల్ ముంచి పది నిమిషాలు పాటు మర్దన చేసి ఆపై నీటితో శుభ్రం చేయాలి. పాలు సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేసి మెరుపును అందిస్తాయి. ముఖానికి ఆవిరి పట్టి కూడా మేకప్‌ను సులభంగా తొలగించవచ్చు. పదినిమిషాలు ఆవిరిపట్టి.. తరవాత కాటన్ క్లాత్‌తో ముఖం తుడుచుకుంటే చాలు. చెమటతో పాటు మురికి పోతుంది. మొటిమలు రాకుండా ఉంటాయి. దోసకాయ రసం.. ఉబ్బిన కళ్లకు ఉపశమనాన్ని అందించడమే కాదు, సహజ మేకప్ రిమూవర్‌గానూ ఉపయోగపడుతుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు మొటిమల నుంచి కాపాడటంతో పాటు సహజ క్లెన్సర్‌గా పని చేస్తాయి. దోసకాయ రసంలో కాటన్ బాల్ ముంచి చర్మంపై రాసుకోవాలి. తరవాత నీటితో శుభ్రం చేసుకుంటే సరి. □

వాలు జడ చాలామంది అమ్మాయిల కల. కానీ ఎన్ని ప్రయత్నాలు చేసినా అది నెరవేరని వారే ఎక్కువ.

## వాల్జెడ కోసం !



అలాంటివారు ఈసారి స్టార్ అనీస్ లేదా అనాసపువ్వు ప్రయత్నించండి. బిర్యానీకి ఘుమఘుమలు అందించే ఈ దినుసులు కురులు వేగంగా పెరగడంలో చాలా బాగా సాయపడుతుందట. ఇంతకీ ఎలా వాడాలంటే.. ఈ పువ్వుల్లోని విత్తనాలను ఓ పదింటిని కచ్చా పచ్చాగా దంచి, ఒక గాజు సీసాలో వేయాలి. తరవాత అరకప్పు కొబ్బరినూనెను ఆ పొడి మునిగేలా పోసి, ఎండలో ఉంచాలి. నూనె వేడెక్కాక వేరే పాత్రలోకి వడపోయాలి. తలస్నానం చేసే ముందురోజు రాత్రి పెట్టుకుంటే సరి. లేదంటే అరకప్పు కొబ్బరిపాలకు స్పూను చొప్పున ఆలివ్ నూనె, అనాస పువ్వు నూనె, కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్ కలిపి, తలకు పట్టించి, అరగంటయ్యాక గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే సరి. వీటిల్లో నచ్చినదాన్ని వారానికి రెండుసార్లు ప్రయత్నిస్తే చాలు. స్టార్ అనీస్ విత్తనాల్లోని షికిమిక్ యాసిడ్..కెరటిన్ పెరుగుదలలో సాయపడు తుంది. దీంతో కురులు వేగంగా పెరుగుతాయి. వీటల్లోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రుకీ చెక్ పెట్టేస్తాయి. అంటే రెండిందాలా ప్రయోజనమన్నమాట ప్రయత్నించండి మరి. □



ప్రశ్న: నేను 50 ఏళ్ల ఒంటరి మహిళను. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాను. డిగ్రీ చదివే రోజుల్లో ఒక తాగుబోతుకు ఇచ్చి నాకు పెళ్లి చేశారు. ఒక కొడుకు పుట్టిన తరువాత నా భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. దీంతో గొడవపడి విడాకులు తీసుకున్నాను. ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండాల్సి రావడంతో నా కొడుకును మా అమ్మ వద్ద ఉంచాను. ఆమె సరిగా పెంచకపోవడంతో అతను బాధ్యత లేకుండా తయారయ్యాడు.బీటెక్‌లో చేరినా మొదటి సంవత్సరం సరిగా చదవకుండా కాలేజీ మానేశాడు. ప్రస్తుతం సెల్‌ఫోన్‌కు బానిసై ఇంటికే పరిమితమయ్యాడు. నేను మందలిస్తే

ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## వ్యథ ప్రేమతో చేరదీయండి !

నాపైనే తిరగబడుతున్నాడు. నాతో రావడానికి కూడా ఇష్టపడటం లేదు. మా అమ్మ కూడా అతన్ని వెనకేసుకొస్తోంది. ఇప్పుడు నా కొడుకును ఎలా మార్చాలి?

– ఒక సోదరి, అనంతపురం



జవాబు: అమ్మా, మీ కొడుకు పరిస్థితికి సెల్‌ఫోన్ ఒక్కటే కారణం కాదు. చిన్ననాటి పెంపకం, తండ్రి దూరం కావడం, తల్లి ఉద్యోగరీత్యా ఎక్కువకాలం దూరంగా ఉండటం, అతని ఆలోచనా విధానం, వ్యక్తిత్వంపై ప్రభావం చూపి ఉండవచ్చు. అందువల్ల అతన్ని పనికిరాని వాడు" అంటూ విమర్శించడం మానేయాలి. కొడుకును మార్చాలని కాదు.. అతనితో మీ సంబంధాన్ని మార్చాలని ప్రయత్నించండి. అతనితో ప్రశాంతంగా, స్నేహపూర్వకంగా మాట్లాడండి. 'నువ్వు ఎందుకు ఇలా తయారయ్యావు?' అని ప్రశ్నించడంకంటే.. 'నీకు ఏం చేయాలని ఉంది? నీకు ఏం ఇబ్బందిగా ఉంది?' అని అడగండి. అతని మాటలను మధ్యలో అడ్డుకోకుండా వినండి. బీటెక్ ఎందుకు మానేశాడో, బయటకు వెళ్లడానికి ఎందుకు ఇష్టపడటం లేదో, భవిష్యత్తు గురించి అతని ఆలోచనలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయండి. తక్షణమే చదువు కొనసాగించమని అని ఒత్తిడి చేయకుండా చిన్న చిన్న బాధ్యతలను అప్పగించండి. ఇంటి పనుల్లో భాగస్వామ్యం చేయడం, రోజూ కొంతసేపు బయటకు వెళ్లడం, వ్యాయామం చేయడం, నిద్ర–ఆహార సమయాలను క్రమబద్ధీకరించడం వంటి చిన్న మార్పులతో ప్రారంభించండి. సెల్‌ఫోన్ వినియోగానికి కూడా స్పష్టమైన పరిమితులు అవసరం. అతనితో చర్చించి క్రమంగా వినియోగ సమయాన్ని తగ్గించేలా చూడండి.మీ తల్లి అతన్ని వెనకేసుకురావడం కూడా సమస్యను పెంచే అవకాశం ఉంది. అయితే ఆమెను నిందించడం వల్ల ప్రయోజనం లేదు. ఆమెతో కూడా ప్రేమగా మాట్లాడి వివరించండి. కుటుంబంలోని పెద్దలందరూ ఒకే విధమైన నియమాలను పాటించడం చాలా ముఖ్యం. అతనిలో తీవ్రమైన నిరాశ, అసహనం, కోపం, నిద్రలో పెద్ద మార్పులు, సామాజికంగా పూర్తిగా దూరం కావడం, ఏ పనిపైనా ఆసక్తి లేకపోవడం లేదా రోజువారీ పనులను కూడా చేయలేని పరిస్థితి కనిపిస్తే మానసిక ఆరోగ్య నిపుణుడిని సంప్రదించడం మంచిది. అవసరమైతే సైకాలజిస్ట్ లేదా సైకియాట్రిస్ట్ ద్వారా సమగ్రంగా అంచనా వేయించాలి. కొడుకును ఒక్కరోజులో మార్చలేం. కానీ తల్లి చూపించే ప్రేమ, సహనం, నమ్మకం.. వాటితో పాటు స్పష్టమైన హద్దులు, బాధ్యతలను కలిపితే మార్పుకు బలమైన పునాది వేయవచ్చు. కొడుకును మార్చడం కంటే ముందుగా.. అతనితో మీ సంబంధాన్ని మార్చండి. సంబంధం మారితే, ప్రవర్తన మారే అవకాశం ఉంటుంది. □

## ఓం దత్తాత్రేయస్వామి వజ్రకవచం



అత్రి మహర్షి .. అనసూయ మాత కోరిక మేరకు దత్తాత్రేయుడు అవతరించాడు. దేవతలకు .. మహర్షులకు జ్ఞానాన్ని భోదించాడు. అలాంటి దత్తాత్రేయస్వామి తన భక్తులను అనేక రూపాలలో .. అనేక విధాలుగా పరీక్షిస్తుంటాడు. తన పరీక్షకి నిలబడిన భక్తులను ఆయన కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. దత్తాత్రేయ స్వామిని ఏడుమార్లు తలచుకుంటే .. ఏడోసారికి ఆయన భక్తుల చెంతకి చేరుకుంటాడని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. అలాంటి దత్తత్రేయస్వామి చరిత్రను పారాయణం చేయడం వలన అనేక దోషాలు తొలగిపోతాయి. ఇక స్వామివారి 'వజ్ర కవచం' చదువు కోవడం వలన కూడా విశేషమైన ఫలితాలు కలుగుతాయి. దత్తాత్రేయస్వామివారి 'వజ్ర కవచం'ను మేడిచెట్టు క్రింద కూర్చుని చదువుకోవడం వలన ధనధాన్యాలు కలుగుతాయి. మారేడు చెట్టు క్రింద కూర్చుని చదవడం వలన సుఖ సంతోషాలు కలుగుతాయి ..రావిచెట్టు క్రింద కూర్చుని 'వజ్ర కవచం' చదవడం వలన ఆయురారోగ్యాలు చేకూరతాయి. తులసి మొక్క దగ్గర కూర్చుని ఈ వజ్రకవచాన్ని చదవడం

## స్టీమ్ బాస్కెట్‌తో...



కాయగూరల్ని ఆవిరిమీద ఉడికించాలంటే ఏం చేస్తాం? ఒక పాత్రలో నీళ్లుపోసి.. ఆ పాత్రలోకి సరిగానఫిట్ అయ్యే మరో పాత్రని తీసుకుంటాం. మళ్లీ దాన్లోకి నీళ్లు పోకుండా కింద మరో గిన్నెని బోర్లించాలి. వెజిటబుల్ స్టీమర్ బాస్కెట్ మీ దగ్గరుంటే.. ప్రతి సారీ ఇంత కష్ట పడాల్సిన అవసరం లేదు. ఈ స్టెయిన్‌లెస్ స్టీల్ బాస్కెట్‌ని కావాలంటే వెడల్పు చేసుకోవచ్చు. వద్దనుకుంటే పాత్రకు తగ్గట్టుగా చిన్నదిగా మార్చుకోవచ్చు.



రంధ్రాలుండటంవల్ల దీన్లో నీళ్లు చేరే అవకాశం లేదు. ఉడికించిన తర్వాత బాస్కెట్‌ని బయటకు తీయడానికి వీలుగా ఒక హుక్ ఉంటుంది. చేతికి ఆవిరి పట్టకుండా బాస్కెట్‌ని తేలిగ్గా బయటకు తీసుకోవచ్చు. □

## 'మోడ్రన్ మిస్సమ్మ' ఫస్ట్ సింగిల్ లాంచ్



మోడ్రన్ మిస్సమ్మ చూసిన ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు : 'వదల' నిర్మాత కిశోర్ నాయుడు లాస్య అండ్ మిధున క్రియేషన్స్ బ్యానర్‌పై చిరంజీవి పమిడి, శివ పమిడి, కిరణ్ కుమార్ నల్లూరి, స్రవంతి నంబూరి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం మోడ్రన్ మిస్మమ్మ. సాయిబాబా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష నర్రా, తన్మయి ఖుషి, సిజు ఏఆర్, ప్రమోదిని, హారిక, డా.భద్రం, శివన్నారాయణ, రాకేష్ రాచకొండ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హీరో హర్ష నర్రా మాట్లాడుతూ.. మిస్సింగ్, రోటి కపడా రొమాన్స్ తర్వాత ఇది నా మూడో సినిమా. ఆ రెండు చిత్రాలు కమర్షియల్‌గా పెద్దగా ఆడలేదు. అయినా నా పోరాటం ఆగదు. కష్టపడుతూనే ఉంటాను. ఈ సినిమా కష్టపడి కాకుండా ఇష్టపడి చేశాం. టీమ్ అంతా ఫ్రెండ్స్‌లా మూవీ చేశాం. తన్మయి చాలా బాగా నటించింది. హీరోయిన్ తన్మయి ఖుషి మాట్లాడుతూ '23' మూవీ తర్వాత నటించిన సినిమా ఇది. నాగార్జున మన్మధుడు చిత్రంలోని 'వద్దురా సోదరా' అనే సాంగ్ అప్పట్లో మగవాళ్లకు కనెక్ట్ అయినట్టు, ఇప్పుడు మా చిత్రంలోని ఈ సాంగ్ అమ్మాయిలకు కనెక్ట్ అవుతుంది. డైరెక్టర్ సాయి బాబా మాట్లాడుతూ.. ఈ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది. ఇళ్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు.. అని పెద్దలు చెబుతుంటారు కదా.. దానికి నేనొక ఒకటి యాడ్ చేద్దామనుకుంటున్నా. సినిమా చేసి చూడు అని. ఈ మూడింటిలో అదే కష్టం ఉంటుంది అని నమ్ముతున్నా. ఈ జర్నీలో నాకు సపోర్ట్ చేసిన టెక్నీషియన్స్, ఆర్టిస్టులు, నిర్మాతకి థ్యాంక్స్. నిర్మాత చిరంజీవి పమిడి మాట్లా డుతూ..'మా బ్యానర్‌లో' కాలింగ్ సహాస్ర తర్వాత వస్తోన్న రెండో చిత్రమిది. ఆ చిత్రానికి మేం ఊహించిన రిజల్ట్ రాలేదు. ఈ చిత్రానికి మాత్రం మంచి ఆదరణ దక్కుతుందని నమ్ముతున్నా. మా హీరో హర్ష చాలా బాగా పెర్ఫార్మ్ చేశాడు. హీరోయిన్ కూడా అంతే బాగా నటించారు. రెండేళ్ల క్రితం ఈ జర్నీ స్టార్ట్ చేశాం. ఇప్పుడు ట్రెండ్‌కు తగ్గట్టుగా మూవీ తీయాలనుకున్నాం. మంచి అవుట్‌పుట్ వచ్చింది అన్నారు.

# తార

కింగ్ నాగార్జున ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో ఒకటి గీతాంజలి. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన ఈ క్లాసిక్ లవ్‌స్టోరీ ఇప్పుడు మరోసారి థియేటర్లలో తన మ్యాజిక్‌ను చూపించడానికి రెడీ అవుతోంది. ఆగస్టు

## 'గీతాంజలి' 28న రీరిలీజ్



28న నాగార్జున బర్త్‌డే సందర్భంగా గీతాంజలి తెలుగు, తమిళ భాషల్లో 4రీ ఫార్మాట్‌లో ప్రపంచవ్యాప్తంగా రీరిలీజ్ కానుంది. రక్షాబంధన్ స్పెషల్ కూడా కావడంతో ఈ రీరిలీజ్ మరింత ప్రత్యేకంగా మారింది. శ్రీ పద్మిని సినిమాస్ బ్యానర్‌పై బూర్లె శివ ప్రసాద్ ఈ ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను లేటెస్ట్ టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.గీతాంజల్లి అంటే ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తొచ్చేది అందమైన ప్రేమకథ, మనసును తాకే సంగీతం, అద్భుతమైన విజువల్స్, గుర్తుండిపోయే పెర్ఫార్మెన్స్. నాగార్జునను ఎంతో చార్మింగ్‌గా, ఎమోషనల్‌గా చూపించిన ఈ సినిమా ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది. ఈసారి 4రీ ఫార్మాట్‌లో 'గీతాంజలి'ని చూడటం ఈ రీరిలీజ్‌లో ప్రధాన ఆకర్షణ కానుంది. మరింత క్లారిటీ, డీటెయిలింగ్‌తో విజువల్స్‌ను ప్రేక్షకులు కొత్త అనుభూతితో ఎక్స్‌పీరియన్స్ చేయబోతున్నారు. అప్పట్లో థియేటర్లలో 'గీతాంజలి'ని చూసిన వారికి ఇది మరోసారి ఆ రోజులను గుర్తుచేసే నాస్టాల్జిక్ జర్నీ కానుంది. ఇక ఈ సినిమాను థియేటర్లలో చూడని నేటి జనరేషన్‌కు మాత్రం ఒక ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేసే అవకాశం దక్కనుంది. ఆగస్టు 28న 4రీలో గీతాంజలి మరోసారి థియేటర్లలో మ్యాజిక్ క్రియేట్ చేయనుంది.

## 'అమీర్ లోగ్' సినిమాలోని ప్రతీ కారెక్టర్‌కి ప్రాముఖ్యత ఉంది: వేధా జలంధర్



**మీ జర్నీ గురించి చెప్పండి?..**

నేను 2019లోనే కెరీర్ ప్రారంభించాను. నేను చేసిన ఓ రెండు సినిమాలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లాయి. కానీ అవి రిలీజ్ కాలేదు. ఆ తర్వాత నేను యాక్టింగ్ కోసం థియేటర్ కూడా నేర్చుకున్నాను.

**మీ పాత్ర ఎలా ఉంటుంది?..**

అమీర్ లోగ్ సినిమాలో నా పాత్ర పక్కింటి అమ్మాయిలా ఉంటుంది. మహిళలకు స్ఫూర్తినిచ్చేలా నా కారెక్టర్ ఉంటుంది. మా అమ్మే నాకు స్ఫూర్తి.

**అమీర్‌లోగ్‌లో అవకాశం ఎలా వచ్చింది?..**

తిమ్మరాజుపల్లి టీవీ చేసినట్టుగా మా దర్శకుడు రమణ గారికి తెలీదు. బషీర్ మాస్టర్ మాకు ఈ మూవీ ఆడిషన్స్ గురించి చెప్పారు. నేను ఆడిషన్‌కి వెళ్లాను. అక్కడ నేను బాగా పర్ఫామ్ చేయడంతో రమణవెంటనే ఓకే చెప్పారు.

**ఇప్పటి వరకు అమీర్ లోగ్'చూసిన వారు మీకు ఇచ్చిన కాంప్లిమెంట్స్ ఏంటి?..**

ఈ సినిమాలోని పాత్ర కూడా అలానే ఉంటుంది. ముక్కు సూటిగా ఉండటం, ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం అనేది మా అమ్మ నుంచే నేర్చుకున్నాను. ఈ కారెక్టర్‌లో కూడా ఇలానే ఉంటాను.

**అమీర్ లోగ్‌చిత్రంలో బిర్యానీ గురించే ఎక్కువగా ఉంటుంది?..**

అమీర్ లోగ్ సినిమాలో బిర్యానీది మెయిన్ పాత్ర అని చెప్పుకోవచ్చు. కథలో ఆ ఎలిమెంట్ బాగా కుదిరింది.

**సింక్ సౌండ్‌తో వర్క్ చేయడం గురించి చెప్పండి?..**

నేను ఇది వరకే సింక్ సౌండ్‌తో ఓ ఫీచర్ ఫిల్మ్‌కి చేశాను. మనం ఎంత ప్రొఫెషనల్‌గా ఉన్నా.. చుట్టు పక్కల ఉన్న సౌండ్స్ కూడా రికార్డ్ అవుతుంటాయి. సెట్‌లో చాలా కష్టంగా అనిపిస్తుంది. కానీ ఈ చిత్రానికి అందరూ అద్భుతంగా సహకరించారు. బస్తీ వాళ్లు కూడా మాకు ఎంతో సపోర్ట్ చేశారు.


**మ్యూజిక్ గురించి చెప్పండి?..**

స్మరణ్ గారి మ్యూజిక్ వల్ల మా చిత్రం పది మెట్లు పైకి ఎక్కినట్టు చెప్పుకోవచ్చు. ఆయన మాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు.

**భాష, యాస వల్ల ఏమైనా సమస్య వస్తుందా? అందరికీ అర్థం అవుతుందా?..**


భాష, యాసతో మా సినిమాకి ఎలాంటి సమస్య రాదు. ఎమోషన్ అనేది అందరికీ కామన్. ఎక్కడైనా ఎమోషన్ అనేది ఒకేలా ఉంటుంది. మా చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా, అన్ని ప్రాంతాల వారిని మెప్పించేలా ఉంటుంది.

## 'ఇన్సిడియస్: అవుట్ ఆఫ్ ది ఫర్దర్' 21న విడుదల



5 చిత్రాలలో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద 740 మిలియన్లకు పైగా వసూలు చేసిన 'ఇన్సిడియస్' ఫ్రాంచైజ్, ఒక కొత్త కుటుంబంతో మరియు 'ది ఫర్దర్' సామర్థ్యాన్ని పునర్నిర్వచించే ఒక భయానక రూపంతో తిరిగి వస్తోంది. 'ఇన్సిడియస్: అవుట్ ఆఫ్ ది ఫర్దర్'లో, అమేలియా ఈవ్ జెమ్మా పాత్రలో నటించింది. తాను పెరిగిన ఇంట్లోనే తన కూతురిని పెంచుతున్న ఒక యువ తల్లి, ఇన్సిడియస్ విశ్వానికి కేంద్రమైన, దారితప్పిన ఆత్మల నరకలోకమైన ది ఫర్దర్‌ఖిలోకి తాను ప్రయాణించగలనని కనుగొంటుంది. 'ఇన్సిడియస్: అవుట్ ఆఫ్ ది ఫర్దర్' చిత్రం ఆగష్టు 21, 2026న ఆంగ్లం, హిందీ, తమిళం మరియు తెలుగు భాషలలో పాన్ ఇండియాలో విడుదల కానుంది.హారర్ జానర్‌పై చేజ్‌కు ఉన్న ప్రేమ చాలా సంవత్సరాలుగా మరియు అనేక రూపాలలో విస్తరించి ఉంది. "నాకు థియేటర్ అంటే ఇష్టం, అది సంవత్సరాల తరబడి హాంటెడ్ హౌస్ ఆకర్షణలను రూపొందించడంలోకి దారితీసింది," అని ఆయన గుర్తుచేసుకున్నారు. "హైస్కూల్ నుండి నా 20 ఏళ్ల ప్రారంభం వరకు, ఒక ఛారిటీ ఈవెంట్ కోసం నా స్నేహితులతో కలిసి దీన్ని చేసేవాడిని, మరియు అది పెద్ద విజయం సాధించింది.

## శునకమా! నా ప్రాణమా!



'నీవు లేని లోటు పెద్ద నిశ్శబ్దాన్ని మిగిల్చిం'దంటూ ఇటీవలే భుజం గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న తారక్ తన శునకం మృతిని తట్టుకోలేకపోయారు. రెండు, మూడు నెలల్లో పూర్తిగా కోలుకుంటారని వైద్యుల వెల్లడినటుడు జూనియర్ ఎన్టీఆర్ తాను ఎంతగానో ఇష్టపడే పెంపుడు శునకం 'బఘీరా' మరణించడంతో ఆయన తీవ్ర భావోద్వేగానికి గుర య్యారు. నాలుగేళ్ల తమ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన ఇన్స్టాగ్రామ్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు. 'బఘీరా'తో తాను గడిపిన మధుర క్షణాలకు సంబంధిం చిన ఫొటోలను పంచుకున్నారు. బెర్నీస్ మౌంటెన్ డాగ్ జాతికి చెందిన బఘీరాను ఎన్టీఆర్ ఆప్యాయంగా హత్తుకున్న చిత్రాలు ప్రధానంగా దర్శనమిస్తున్నాయి. బఘీరా జ్ఞాపకార్థం ఒక మొక్కను నాటిన ఫొటోను కూడా ఆయన షేర్ చేశారు.'బఘీరా! నా ప్రపంచంలోనువ్వొక తోడు. నీవు లేని లోటు మాటల్లో చెప్పలేనంత పెద్ద నిశ్శబ్దాన్ని మిగిలావటూ జూనియర్ ఎన్టీఆర్ తన ఆవేదనను ఆ పోస్టులో పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఇటీవలే భుజం గాయం నుంచి కోలుకుంటున్న సంగతి తెలిసిందే. 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో భాగంగా జూలై27న ఆయన భుజానికి గాయమైంది. దీనికి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఆయనకు ఆర్థోస్కోపిక్ సర్జరీ జరిగింది. ఇప్పుడు కోలుకుంటున్నారు.

## 'ది రెడ్ బ్యాగ్' ఆకట్టుకునేలా సినిమా: నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి..



మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హారికృష్ణ సోమిశెట్టి నిర్మించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే ఈ మూవీని రవి కుమార్ సీరపు తెరకెక్కించారు. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహ సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఆగస్ట్ 21న భారీ ఎత్తున విడుదల చేయబోతోంది. ఈ క్రమంలో..నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి మాట్లాడుతూ.. .. 'మా రెడ్ బ్యాగ్' చిత్రానికి మంచి హైప్ ఏర్పడింది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్‌కి మంచి ఆదరణ దక్కింది. గ్లింప్స్, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా యూట్యూబ్‌లో ట్రెండ్ అయ్యాయి. మా కంటెంట్‌కి అన్ని వైపుల నుంచి ప్రశంసలు దక్కాయి. చివరి వరకు ఉత్కంఠ భరితంగానే సాగుతుంది. అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం.యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లింగ్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి.

## సంగీత్ శోభన్ స్పెషల్ పోస్టర్ విడుదల



ఈ నెల 23న టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేయబోతున్న మేకర్స్ మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ మూవీస్ తో యూత్ ఆడియెన్స్ లో తనకుంటూ ఓ స్పెషల్ ఫాలోయింగ్ సంపాదించుకున్న యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్, వరుస హిట్స్ అందుకుంటున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పిరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని, టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ కాంబోలో ఓ క్రేజీ మూవీ తెరకెక్కుతోంది. సరికొత్త ట్రెండీ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఈ సినిమాలో అనస్వర రాజన్ హీరోయిన్ గా నటిస్తోంది. శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.3 గా నిర్మాణమవుతున్న ఈ చిత్రానికి లక్ష్మీ భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు హీరో సంగీత్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో మారుతి అనే పాత్రలో సంగీత్ శోభన్ నటిస్తున్నారు. బర్త్ డే పోస్టర్ చూస్తే బుట్టలో ఆకుకూరలు తీసుకొస్తూ మిడిల్ క్లాస్ అబ్బాయి లుక్ లో సంగీత్ శోభన్ కనిపిస్తున్నారు. ఇలాంటి పొరుగింటి అబ్బాయి క్యారెక్టర్స్ సంగీత శోభన్ కు టైలర్ మేడ్‌లా ఉంటూ ఆకట్టుకుంటాయి. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ ను ఈ నెల 23న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ఇష్టపడేలా ఈ

20-8pg8exHMNWJQE:20-8pg8exHMNWJQE.qxd 8/20/2026 12:27 AM Page 1



# దేశంలో 800 నగరాలకు ఛాత్రోంకీ గూంజ్..!

న్యూఢిల్లీ, ఆగస్టు 19: వందేమాతరం శతాబ్ది వేడుకలు, పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా చేపట్టిన ఛాత్రోన్ కీ గూంజ్ ప్రచారం, రామ మందిరానికి సంబంధించిన 'చందా చోరీ' వివాదం, ఉత్తరాఖండ్‌లో శుద్ధీకరణ ఘటన తదితర అంశాలపై కాంగ్రెస్ బుధవారం తన రాజకీయ వ్యూహాన్ని ఖరారు చేసింది. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి 88 మంది నేతలు హాజరయ్యారు. మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు సీనియర్ నేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. పేపర్ లీకేజీలు, విద్యాపరీక్షా వ్యవస్థలోని సమస్యలపై కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని వర్కింగ్‌కమిటీ నిర్ణయించింది. ఈ ప్రచారంలో భాగంగా 800 నగరాల్లో సభలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. వీటిలో కొన్ని కార్యక్రమాలు రాహుల్ గాంధీ నాయకత్వం వహించే అవకాశం ఉందన్నారు. పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలు, వాటిని ప్రభుత్వం ఎదుర్కొన్న తీరుపైనా సమావేశంలో చర్చించారు. విద్యా, పరీక్షా వ్యవస్థలో సమూల మార్పులకు సంబంధించిన నిపుణులతో సంప్రదింపులు జరిపి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రులను ఖర్గే ఆదేశించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలకు విజయవంతంగా సానుకూల, ప్రభుత్వం అనేక అంశాల్లో ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొందని వేణుగోపాల్ పేర్కొన్నారు. రామ మందిర విరాళాలకు సంబంధించిన వివాదాన్ని కూడా కాంగ్రెస్ ప్రధాన రాజకీయ అంశంగా తీసుకొంది. చందా చోరీ అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించింది. గ్రామాలు, పంచాయతీల స్థాయిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకు ఆదేశాలు ఇచ్చినట్లు వేణుగోపాల్ తెలిపారు. రామ మందిరం పేరుతో ప్రజలను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించిన వారు ఇప్పుడు ప్రజల ముందు బహిర్గతమయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే కార్యక్రమం అనంతరం జరిగిన శుద్ధీకరణ ఘటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వందేమాతరం శతాబ్ది వేడుకలపై చర్చ.. వందేమాతరం శతాబ్ది వేడుకలను కూడా కాంగ్రెస్ తన రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో కీలకంగా చేర్చింది. జాతీయ భావనతో కూడిన ఈ అంశంపై పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిడబ్ల్యూసి చర్చించింది. భారతదేశానికి సరిహద్దు పరిస్థితిపైనా సమావేశంలో చర్చ జరిగింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాటు జరిగిందన్న ఆరోపణలను కాంగ్రెస్ ప్రస్తావించింది. చైనా విషయంలో కేంద్ర ప్రభుత్వం లొంగుబాటు విధానం అనుసరిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేసింది. ఎన్నికల పనితీరు, పార్టీ సంస్థాగత వ్యవహారాలను సమీక్షించేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని సీడబ్ల్యూసీ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా బ్లాక్, జిల్లా స్థాయిల్లో పార్టీ సంస్థాగత వ్యవహారాలను పరిశీలించేందుకు ఈ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహాత్మా గాంధీ బాధ్యతలు స్వీకరించి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్‌లో బెలగావిలో శతాబ్ది వేడుకలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. జార్ఖండ్ ప్రజలకు సీడబ్ల్యూసీ కృతజ్ఞతలు తెలిపింది. జేఎంఎం, కాంగ్రెస్ (ఎన్ఎస్), ఇతర ఇండియా కూటమి పార్టీలకు ప్రజలు స్పష్టమైన, నిర్ణయాత్మక తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అంతకుముందు సీడబ్ల్యూసీ సమావేశం ప్రారంభంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల నుంచి వెంటనే పాఠాలు నేర్చుకుని, సంస్థాగత స్థాయిలో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని పరిస్థితుల్లోనూ పార్టీ నేతలు క్రమశిక్షణ పాటిస్తూ ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, అంబికా సోనీ, ముకుల్ వాస్నిక్, పి.చిదంబరం తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## ఫోటోగ్రఫీ విజేతలకు బహుమతుల ప్రదానం



ఫోటోగ్రఫీ పోటీల విజేతలకు బహుమతులు అందచేస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ, ఆగస్టు 19, ప్రభాతవార్త : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎన్‌టిఆర్ జిల్లాస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో విజేతలకు ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా చేతుల మీదుగా బహుమతులు అందచేసారు. బుధవారం విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయం పింగళి వెంకయ్య సమావేశమందిరంలో జరిగిన కార్యక్రమంలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జ్ఞాపకాలను పదిలపరచి మటాలకు అందని భావాలను ప్రపంచానికి చాటిచెప్పే కళే ఫోటోగ్రఫీ అని పేర్కొన్నారు. మాటలతో చెప్పలేని భావాలను ఫోటోల ద్వారా చెప్పవచ్చున్నారు. సమాజంలో జరుగుతున్న ముఖ్యమైన సంఘటనలను ఫోటోజర్నలిస్టులు ప్రజలకు చేరవేయటం ముఖ్యభూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. ఫోటోజర్నలిస్టలలోని ప్రతిభను గుర్తించి సత్కరించేందుకు ప్రతి సంవత్సరం జిల్లాస్థాయిలో ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో వీడియో జర్నలిస్టులు, అమెచ్యూర్ ఫోటోగ్రాఫర్లకు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 27మంది విజేతలను సత్కరించి నగదు పురస్కారం అందచేసారు. ఈసందర్బంగా నిర్వహించిన ఫోటోప్రదర్శనను తిలకించారు. సీనియర్ ఫోటోగ్రాఫర్ పొట్లూరి ప్రసాద్ సేకరించిన అరుదైన వివిధ రకాల కెమెరాల ప్రదర్శన ప్రత్యేక అకర్షణగా నిలిచింది. ఈకార్యక్రమంలో ఆర్డీఓ వెన్నెల శ్రీను, ఐఅండ్‌పిఆర్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి.తిమ్మప్ప, డిఐపిఆర్‌వో కెవి.రమణారావు, డీపిఆర్‌ఓ కె.రవి, పోటీల సమన్వయకర్త వీవి.ప్రసాద్ తదితరులు, ఫోటోజర్నలిస్టులు పాల్గొన్నారు.

## అగ్రి ఎక్స్‌పో పరిజ్ఞానం ప్రతి రైతుకు చేరాలి

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**- అగ్రి ఎక్స్‌పోకు విశేష స్పందన**



నెల్లూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త: వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలను క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. అగ్రి ఎక్స్‌పోలో ప్రదర్శించిన సాంకేతికత కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా రైతుల పొలాల్లో ఆచరణలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులోని ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం నిర్వహించిన అగ్రి ఎక్స్‌పో కిసాన్ మేళా-2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, ఆధునిక సాంకేతిక పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను పరిశీలించి, వాటి వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల అవసరాలు, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల అవగాహన తదితర అంశాలపై కలెక్టర్ రైతులు, చాంపియన్ ఫార్మర్స్, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖిగా చర్చించారు. రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని విస తంగా అందుబాటులోకి తీసుకురావడమే ఇటువంటి ఎక్స్‌పోల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## ఫొటోగ్రాఫర్లకు సన్మానం

తిరుపతి, ఆగస్టు 19 ప్రభాతవార్త: రాయలేని ఎన్నో భావాలను ఒక్క ఫోటో ప్రపంచానికి చూపుతుందని, మనసులను మదిలోని భావాలను కదిలించే శక్తి ఒక్క ఫోటో చూపించగలరని బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపినాథ్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని పలువురు సీనియర్ ఫోటో జర్నలిస్టులు రామకృష్ణారెడ్డి ,భాగవతులు శ్రీనివాసులు లను ఘనంగా సత్కరించారు. మీడియా రంగంలో ఫోటోగ్రాఫర్ల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏ వన్ మస్తాన్, పెరియస్వామి రామ్ కుమార్ , కృష్ణంరాజు, తొండము నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, తిరుపాల చారి తదితరులు పాల్గొన్నారు

## కన్నుల పండువగా శ్రీ ద్రౌపది కళ్యాణోత్సవం

చంద్రగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త: పాంచాల దేశ రాజు ద్రుపద మహారాజు కుమార్తె శ్రీద్రౌపది కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. చంద్రగిరిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా బుధవారం ద్రౌపధి, పాండవుల కళ్యాణ ఘట్టం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక ధర్మరాజుల స్వామివారి ఆలయంలో ఆలయ అర్చకులు ద్రౌపధి సమేత శ్రీధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలు గావించారు. శ్రీకృష్ణుడు ఆశీస్సులతో శ్రీద్రౌపధి సమేత పాండవులకు కళ్యాణ మహోత్సవాన్ని సంప్రదాయ పద్దతిలో వేదపండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# దుర్గమ్మ సేవలో విఐపిలు



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 19, ప్రభాతవార్త : దుర్గమ్మవారిని బుధవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీ రవిశంకర్ గురూజీ, ఎంపి లింగమనేని రమేశ్ దర్శించుకున్నారు. వారికి ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆయనకు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

**అన్నదానమునకు విరాళం :**

దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన దశరధి సుబ్బలక్ష్మి మరియు కుటుంబీకులు పేరున రు.1,00,000 విరాళాన్ని బుధవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**గో సంరక్షణ నకు విరాళం:**

దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి ఖమ్మంకు చెందిన గుంటుపల్లి విశ్వేశ్వరరావు ఊర్మిళ మరియు కుటుంబీకులు పేరున రు.1,01,116ల విరాళాన్ని బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# నేడు సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

- **మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సమావేశం.**
- **హాజరుకానున్న 6 రాష్ట్రాల ముఖ్యమంత్రులు..**

విజయవాడ, ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి: తమిళనాడులోని మహాబలిపురం వేదికగా గురువారం జరగనున్న 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను సమావేశంలో ప్రస్తావించనున్నారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం, అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారంతో పాటు ఏపీ పునర్విభజన చట్టం అమలు, పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై సీఎం చర్చించనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు పూర్తవుతున్నా పునర్విభజన చట్టంలోని వివిధ అంశాలు ఓ కొలిక్కి తీసుకువచ్చే అంశాన్ని సీఎం ప్రస్తావించనున్నారు. షెడ్యూల్910లోని సంస్థల విభజన, ఆస్తులు-అప్పుల పంపకం, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారంపై కేంద్రం చొరవ తీసుకోవాలని కోరనున్నారు. రెవెన్యూ గ్యాప్, పన్ను సంబంధిత అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించ నున్నారు..కేంద్రం దృష్టికి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు..రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు దుగరాజుపట్నం పోర్టు, విశాఖపట్నం-విజయవాడ మెట్రో ప్రాజెక్టులు, రైల్వే కనెక్టివిటీ, విమానాశ్రయాల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ల వంటి అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టు కు నిధులు వంటి అంశాల్లో కేంద్ర సహకారానికి కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు మిగిలిన ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు, నిధులు, కేంద్ర సహకారం కోరనున్నారు. మంగళవారం సాయంత్రం తరువాత సీఎం చంద్రబాబు చెన్నయి బయలుదేరి వెళ్ళారు

# పార్టీలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని ఆటలాడుతున్నాయి

**ఏఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా**

విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి: రాజకీయ పార్టీలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఆటలాడుతున్నాయని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ, కేంద్రీకరణ, ఎన్ఈపీ వంటి చెత్తపనులు మానుకోవాలని సూచించారు. జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) ఏర్పాటులో లోపాలు ఉన్నాయని ఏఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూన అజయ్ బాబు.చావా రవి సమన్వయ కర్తలు గా వ్యవహరించారు.సీనియర్ జర్నలిస్టు ఎస్‌కె బాబు నేహాబోరాని పరిచయం చేసారు. నేహా బోరా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యం కేంద్రానికి లేదన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఉద్యమం జరుగుతున్నా, నిరాహార దీక్షలో కూర్చున్న తమపై విద్వేషం రెచ్చగొట్టాలని ప్రయత్నించారు గాని సమస్యలపై మాట్లాడేందుకు స్పందించలేదన్నారు. లెక్కలేని తనం, గురించి వివరించారు.అనంతరం నేహా మాట్లాడుతూ విద్యార్థులు ప్రాణత్యాగానికి సిద్ధపడి దీక్ష చేస్తుంటే తల్లిదండ్రులు తమకు సంఘీభావంగా వచ్చిన వారు తమలో ఉన్న బాధను వ్యక్తం చేశారని, ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను తమతో చర్చించారని చెప్పారు. దీంతో తాము అధికారంలో ఉన్న బీజేపీ కళ్లుతెరిపించేందుకు పోరాటాల ద్వారా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఉద్యమంలో బీజేపీ ఆరఎస్ఎస్ జోక్యం చేసుకుని రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించటం వల్లనే దీక్ష ఎక్కువ కాలం కొనసాగిందన్నారు.. ఢిల్లీ పోలీస్ కమీషనర్ దీక్షలో ఉన్న సోనం వాంగుచుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించే సందర్భంలో ఆరు అంచెలుగా మానవహారం ఏర్పాటు చేసి అడ్డుకునేందుకు ప్రయత్నించటం జరిగిందన్నారు. 60ఏళ్ల వాంగ్‌చుక్‌కు వ్యక్తిగత అంశాలు ఏవి లేవని, కేవలం విద్యార్థులకు న్యాయం జరగాలనే ఆయన దీక్ష చేశారని తెలిపారు. పోలీసులు ఆయన దీక్షను భగ్నం చేయటానికి ఏలాంటి కారణం చూపలేదన్నారు. ప్రజలకు సేవలందించాల్సిన పోలీసులు మత, సాంస్కృతిక అంశాలతో ఉద్యమ వాతావరణాన్ని కలుషితం చేశారని ఆరోపించారు. ఢిల్లీలో జులై 20వ తేదిన ఏమి జరిగిందో యావత్తు ప్రపంచం చూస్తుండటంతో ప్రభుత్వం చేతులేత్తేసిందన్నారు. విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సమస్య పరిష్కారం కాదని అర్థమయిందన్నారు. మహిళలు, దళితులు, మైనర్లపై కేసులు నమోదు చేయటంతో నిరాహార దీక్ష కేవలం మంత్రి రాజీనామా కోసం కాదని, పూర్తి భావజాలాన్ని మార్చాలనే నిర్ణయానికి వచ్చామని చెప్పారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధుల ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరించటం దారుణం అన్నారు. ఈ వ్యవస్థను సమూలంగా పెకలించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌టీఏలో ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసే వ్యక్తులు ఉన్నారని పేపర్ లీక్‌లకు వారే కారణమని స్పష్టం చేశారు. సీపీఐ(ఎంఎల్) పార్టీ ఎనిమిది గంటల పని విధానం, రైతులకు సంబంధించిన మూడు నల్ల చట్టాలు తీసుకురావటం వంటి చర్యలను ఖండించిందన్నారు. దేశాన్ని కొత్త తరహాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందని వివరించారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ

చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: పోలీసు శాఖ ఆధ్వర్యంలో చిత్తూరులో విధులు నిర్వహించే కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును బుధవారం ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, అలాగే ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం వంటి అంశాలను ఎస్పీ పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సెంటర్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడిన నగరంలోని ముఖ్య కూడళ్ళలో వున్న సిసి కెమెరాల దృశ్యాలను లైవ్‌గా పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌లో అత్యవసర సయంలో ఎస్ఓఎస్ సంకేతం ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే డయల్ 112 విభాగంను పరిశీలించిన ఎస్పీ ఇది ప్రజలకు అత్యవసరమైన పోలీసు, వైద్య, అగ్నిమాపక సేవలు అందించే అత్యంత కీలక నెంబర్ అన్నారు. కమాండ్ కంట్రోల్‌సెంటర్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది, డయల్ 112 సిబ్బంది, గస్తీ వాహన సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వుండాలని, వీరికి ప్రతి కాల్ ఒక ప్రాణాంతక పరిస్థితిని సూచిరవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐ మోబీన్‌తాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి.

# ప్రముఖ పారిశ్రామికవేత్త ఆర్.ఎస్ గోయింకా కన్నుమూత

రైల్వే కోడూరు అర్బన్, ఆగస్టు 19, ప్రభాత వార్త: ప్రముఖ పారిశ్రామికవేత్త జింటెక్స్ కంపెనీ అధినేత ఆర్ఎస్ గోయింకా బుధవారం చెన్నైలో కన్నుమూశారు. ఈయన 1970,71 సంవత్సరంలో ముగ్గురాళ్ల వ్యాపారానికై నాటి కడప జిల్లా నేటి తిరుపతి జిల్లా అయిన మంగంపేట ప్రాంతానికి వచ్చారు. అప్పటినుంచి చెన్నైలో ఉన్న జింపెక్స్ కంపెనీని మంగంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో కూడా పెట్టారు. నాటి నుంచి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి అయిన వైఎస్ రాజారెడ్డి,సీఎంఆర్ కంపెనీలకు చెందిన సుధాకర్ రెడ్డి, ఐబీసీ కంపెనీలకు చెందిన కందుల ఓబుల్ రెడ్డి, రాజమోహన్ రెడ్డిలతో కలిసి అప్పటినుంచి ఇప్పటికీ ముగ్గురాళ్ల వ్యాపారంలో ఐక్యతతోను, పోటీలతోనూ వ్యాపారం చేసి అంచెలంచెలుగా రైల్వే కోడూరులోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కూడా జింపెక్స్ కంపెనీని స్థాపించి ముగ్గురాళ్ల వ్యాపారాన్ని పోటా పోటీగా చేస్తూ ఆర్ఎస్ గోయింకా తనదైన శైలిలో వ్యాపారధిత్య తన పేరును నిలుపుకున్నారు. ఈయన పేదలను ఆదుకోవడమే కాకుండా అనేక గ్రామాలలోనూ, పట్టణాలలోనూ తన సంస్థ పేరున అధికంగా విరాళాలు ఇచ్చి దేవాలయాలు, బస్ స్టాప్లు వంటి ప్రజా మౌలిక వసతులు అనేక సౌకర్యాలను కల్పించి జింటెక్స్ అధినేత గోయింకా రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఒక గొప్ప దాత గానే కాకుండా ప్రజల గుండెల్లో దేవుడిలా కూడా నిలిచారన్నది వాస్తవం. ప్రజలనే కాకుండా వ్యాపారస్తులను ఆర్థికంగా ఆదుకొని వారి గుండెల్లో నిలవడమే కాకుండా పల్లెల్లో ను పట్టణాల్లలోనూ ప్రజల అవసరాలకోసం కట్టించిన బడులు, గుడులు, ప్రజా సౌకర్యాలు ఆయనకు చిహ్నాలుగానే నిలిచి పోయాయి. చిన్న ఆరోగ్య సమస్య చికిత్స నిమిత్తమై చెన్నై ఆసుపత్రి కి వెళ్లిన ఆయనకు మంగళవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి బుధవారం చికిత్స పొందుతూ కన్నుమూశారు.

ఈ విషయం తెలియగానే మంగంపేట, కోడూరు, కడప, తిరుపతి, చెన్నై లకు చెందిన వందలాది మంది ముగ్గురాయి మిల్లుల యజమానులు, పారిశ్రామిక వేత్తలు, పల్లెలు పట్టణ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మాచినేని విశ్వేశ్వర రావుతో పాటు హరినాథ రెడ్డి, రమణా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, చలపతి లతో పాటు వందలాది మంది వ్యాపారులు అయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

# మాతృభాష పరిరక్షణకు

## కమిటీ ఏర్పాటు: మంత్రి లోకేష్ ప్రకటన

గన్నవరం (కృష్ణా), ఆగస్టు 19, ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుభాష పరిరక్షణకు కమిటీని ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఈమేరకు బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. శాసనసభ సమావేశాల్లో మంగళవారం తెలుగుభాష దుస్థితిపై ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఆవేదన వ్యక్తం చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. బుధవారం ఇదే అంశంపై యార్లగడ్డ మాట్లాడుతూ రాష్ట్రంలో మాతృభాష పరిరక్షణకు పలు సూచనలు ఇచ్చారు. ప్రచారం కోసం వేస్తున్న ఫ్లెక్సీలలోనూ తెలుగులో తప్పులు దొర్లుతున్నాయని ఏరోతీగా చూస్తుంటే తెలుగు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ తెలుగుభాషను ద్వితీయభాషగా తప్పని సరి చేయాలని, తెలుగులోనూ అత్యధిక మార్కులు వచ్చేలా పాఠ్యాంశాలను రూపొందించాలని యార్లగడ్డ సూచించారు. యార్లగడ్డ సూచనలపై ఉపసభాపతి రఘురామకృష్ణరాజు స్పందిస్తూ తెలుగు భాష పరిరక్షణకు ఆధునిక గిడుగు రామ్మూర్తిగా మంత్రి లోకేష్ ఉండాలని యార్లగడ్డ కోరుతున్నారని చమత్కరించారు. యార్లగడ్డ లేవనెత్తిన అంశంపై మంత్రి లోకేష్ సమాధానమిస్తూ తాను కూడా ఆంగ్లమాధ్యమంలో చదువుకోవటం వల్ల రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో తెలుగు మాట్లాడటం, రాయటం, చదవటంలో ఇబ్బందులు పడినట్లు తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చిన తరువాత తెలుగుభాషను పూర్తిగా నేర్చుకున్నట్లు చెప్పారు. తన మాదిరిగా విద్యార్థులు ఇబ్బంది పడకూడదనేది తన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. మాతృభాషను మర్చిపోకుండా ఉండేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ద్విభాషా పాఠ్యపుస్తకాలను కొనసాగిస్తున్నామని గుర్తుచేసారు. తెలుగుభాష పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ ఇందుకోసం ఉన్నతస్థాయి సలహా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈకమిటీలో యార్లగడ్డ వెంకట్రావ్‌ను సభ్యునిగా నియమిస్తామని, ఈకమిటీ సుదీర్ఘంగా చర్చించి ఇచ్చే అమూల్యమైన సలహాలు సూచనలను పరిగణనలోకి తీసుకుని మాతృభాష పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

## వైభవంగా స్వాతి నక్షత్ర వేడుకలు

- **స్వర్ణ గరుడవాహనంపై నృసింహుని విహారం**

రాపూరు (నెల్లూరు), ఆగస్టు 19, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో బుదవారం శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి స్వాతి నక్షత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఇందులో బాగంగా తెల్లవారుజామున 4 గంటలకు స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ,చందనాలంకారం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9 గంటలకు స్వామి వారి ఆస్థాన మండపంలో వేదపండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నృసింహ హోమం నిర్వహించారు. ఉదయం 10.30 కు స్వామి వారికి,ఉభయ దేవేరులతో కళ్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడ వాహనంపై స్వామి వారిని వుంచి, క్షేత్రవాసి ఐన నరసింహ స్వామికి భక్తులు సమర్పించి 100 గొడుగులతో గరుడవాహన సేవను వేదమంత్రోఛ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్ ఇఓ జనార్ధన్ రెడ్డి,ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చకులు గుండ్లూరు శశి స్వామి,మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వేదపండితలు త్రినాథ్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి పెద్ద ఎత్తున భక్తులు వున్నారు.

## వైసిపి హయాంలో కక్షపూరితంగా ఇష్టానుసారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్

విజయవాడ, ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి: వైసీపీ హయాంలో కక్షపూరితంగా ఇష్టానుసారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేశారని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్ లు హౌస్ హోల్డింగ్ మ్యాప్ అంశంపై అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ..వైసీపీ హయాంలో కక్షపూరితంగా ఇష్టానుసారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేశారు. ఒక జిల్లాలో ఉన్న వ్యక్తిని తీసుకెళ్లి మరో జిల్లాలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో చేర్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యలు పరిష్కరిస్తున్నాం, రేషన్ కార్డుల్లో మార్పులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ ల్లో మార్పులు, చేర్పులపై ప్రజల నుంచి వచ్చిన 2 లక్షల 16 వేల వినతులు పరిష్కరించాం. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆయా డిపార్ట్మెంటులు ప్రతిపాదనలు పంపాయి. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగికి ప్రమోషన్లు కల్పిస్తామని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

## ఘనంగా నిమజ్జనంతో ముగిసిన గంగమ్మతల్లి జాతర సంబరాలు



నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలోని నారాయణవనం పంచాయతీతో పాటు చుట్టుపక్కల ఏడు గ్రామాల్లో మంగళవారం నుంచి గంగజాతర వేడుకలు ఘనంగా జరుగుతున్నది. జాతరలో భాగంగా బుధవారం ఉదయం వరకు అమ్మవారిని గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. నారాయణవనంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో జాతరను ఘనంగా చేసుకున్నారు. మొక్కుబడి కలిగిన భక్తులు జ ంతు బలితో పాటు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. నారాయణవనంలో బలిజసంఘం ఆధ్వర్యంలో నిర్వహకులు చలపతిబాబు, శరత్‌కుమార్ దగ్గరుండి నిర్వహించారు. బుధవారం ఊరేగింపు సందర్భంగా మేళాతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ నిమజ్జనం చేశారు. అలాగే సముదాయం గ్రామంలో మొక్కుబడి కలిగిన భక్తులు శరీరానికి ముళ్ళ గుచ్చుకొని వాహనాలపై వ్రేలాడుతూ విన్యాసం చేయడం భక్తులను మరింతగా ఆకట్టుకుంది.

## ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్ కి కృష్ణా జలాలు

విజయవాడ.ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి: వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది సీఎం చంద్రబాబు నాయుడేనని, ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో వెలిగొండ నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 200 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారన్నారు.కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా తొలి విడత రూ.318 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. నేడు రెండో విడతగా మరో రూ. 200 కోట్లు అందజేశామన్నారు. మిగిలిన రూ. 400 కోట్లు నిర్వాసితులకు త్వరలోనే చెల్లించి ఈ నెలలోనే నల్లమల్ల సాగర్ కు నీరిస్తామన్నారు. వెలుగొండ నిర్వాసితులను వైసిపి పార్టీ దారుణంగా మోసగించిందని,పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత ఆ పార్టీ నాయకుడికే చెల్లిందన్నారు.